The Real Personality Development Magazine

# యుగశక్తి గాయత్రి

వ్యయ భాద్రపదం-ఆశ్వయుజం : సెప్టెంబరు 2006

రూ. 8-00






# మా ప్రచురణలు

## పండిత శ్రీరామశర్మ ఆచార్యజీ సాహిత్యం

## గ్రంథములు





**Who Am I ?**




**Gayatri Sadhana**
Why and How ?



వేదముల
దివ్య సందేశము



ఆధ్యాత్మిక
కామ విజ్ఞానము




ఆరోగ్య సమస్యలు
– సమాధానాలు



మీ ఆరోగ్యం
– ఆయుర్వేదం




మూలికా చికిత్సా శాస్త్రం




వంటింటి వైద్యము

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ

**సంకల్పం**
**సంరక్షణ**
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదకులు
**కందర్ప రామచంద్ర రావు**

**సంపుటి 7 - సంచిక 5**
సెప్టెంబర్ 2006
వ్యయ భాద్రపదం - ఆశ్వయుజం
**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 85**
**3సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**

సలహాలు, సూచనలకు:
**శ్రీ అశ్విని సుబ్బారావు -**
**09848043256**

## జ్ఞాన తృష్ణ

మనందరిలో ఉంది జ్ఞాన తృష్ణ. లోలోపల ఏదో ఏదో పొంగుతోంది. అది శాంతించగోరుతోంది. శాంతి కోసం ఈ అన్వేషణ జన్మ జన్మలుగా సాగుతోంది. మనిషి చిత్తం మాయలేడి వెంట పరుగెడుతోంది. అయినా– అడుగడుగునా నిరాశ. ఏ దారీ గమ్యాన్ని చేర్చడం లేదు.

కనుక – జీవితపు లోతులలోకి దిగి, శీతల స్రోతస్సును (ఊటను) వెదకాలి. జ్ఞానం వాగ్జాలంలో లేదు. తర్కపు మాటలలో లేదు. బుద్ధిపరమైన జవాబును వెదకడంలో, ఆ పొగమంచులో నిజమైన జవాబును కోల్పోతాము. బుద్ధి మౌనం వహిస్తే, అనుభూతి మాట్లాడుతుంది. ఆలోచన అంతమయితే, వివేకం మేలుకుంటుంది.

వాస్తవానికి – ప్రపంచపు మౌలిక ప్రశ్నలకు జవాబులు బుద్ధిపరమైన తర్కం వల్ల లభించవు.

**న ప్రవచనేన, న మేధయా, న బహునా శృతేన**

(అనగా, ప్రవచనం వల్ల కాని, మేధస్సు వల్ల కాని, ఎక్కువగా వినడం వల్ల) – అన్నది ఋషి వాణి. జ్ఞానం '**అనంతం నిర్వికల్పం**'. ప్రశాంతం కావడం వల్ల, శూన్యం కావడం వల్ల జ్ఞానం వ్యక్తం అవుతుంది. అపుడే సమస్యలు సమాప్తం అవుతాయి; ఎండుటాకుల్లా ప్రశ్నలు ఎగిరిపోతాయి.

సమాధానం సమాధి యొక్క శూన్యం నుండి వస్తుంది. ఈ జ్ఞాన కిరణం వెలికి రాగానే – జీవితంలో ఒక క్రొత్త దశ ప్రవేశిస్తుంది. ఈ భావ దశయే సమాధి.

ఇందుకోసం అడుగు. ప్రశాంతంలోనికి వెళ్లు. లోతయిన శూన్యతతో మునిగిపో. సమాధిలో సమాధానం రానివ్వు, ఫలించనివ్వు.


తరంగాలు లేని, వికల్పాలు లేని ఈ చిత్త స్థితిలో దర్శనం చెయ్యి–'ఏది ఉన్నదో, అది నేనే', అని. నిన్ను నీవు తెలుసుకోనిదే జ్ఞాన దాహం తీరదు. నిన్ను నీవు వెదకనిదే లోలోపలి మంట చల్లారదు. తనను తాను తెలుసుకోవడం జ్ఞానం. మిగతాదంతా సమాచారం. తిరిగే బౌద్ధికతను వదలి చిత్తం మౌనంగా, స్థిరంగా ఉన్న క్షణంలో 'సత్యమ్ జ్ఞానమనంతం బ్రహ్మ' యొక్క ద్వారం తెరుచుకుంటుంది. దిశాశూన్యమైన చేతన ప్రభువులో విలీనం అవుతుంది. ప్రభువు కలయికతోనే జ్ఞాన తృష్ణ అంతమవుతుంది.

★★★

**ప్రగతి అనే గూడు చిన్న చిన్న అలవాట్లు అనే గడ్డిపోచలతో తయారవుతుంది.**

# సద్గురు వచనామృతం

## లోచూపులోనే ప్రశాంతి



*మన దృష్టిని బయటనుంచి లోపలికి త్రిప్పాలి; అధ్యాత్మ మార్గాన్ని అనుసరించాలి. ప్రపంచంలో ఇటూ అటూ తిరుగాడే ప్రాణి ఈ చల్లటి నీడలో ప్రశాంతిని పొందుతాడు.*

*మాయకు వివిధ రూపాలయిన బయటి వస్తువుల పట్ల భ్రమను వదులుకుని అంతర్ముఖులం అయితే, లోచూపు అలవరచుకుంటే, ఆత్మచింతన జరిపితే – మన స్థలానికి మనం చాలా దూరం అయినట్లు మనకు తెలుస్తుంది. అవసరాలు ఎన్నటికీ తీరవు. మనం తీర్చడానికి ప్రయత్నిస్తూన్న కొద్దీ అవి మరింతగా పెరుగుతూ ఉంటాయి. మంటలో నేయి వేసిన విధంగా. కనుక ఆ నీడ వెంట పరుగులు తీయడానికి బదులు దానివైపు వీపు త్రిప్పాలి. మన ఇంటిలో అన్నీ సమృద్ధిగా ఉన్నపుడు గవ్వల కోసం ఎందుకు పరుగుతీయాలని మనం ఆలోచించాలి. లోపలికి చూచినప్పుడు, పరమాత్మ దగ్గరగా ఉన్నప్పుడు – సుఖ శాంతుల తరగని గనికి సూటి దారి దొరుకుతుంది.*

*తన వాస్తవిక స్థితిని తెలుసుకున్నపుడు ఆత్మ స్వరూపాన్ని గుర్తించినపుడు, సంసార స్వరూపం నిజంగా అర్థం అయినపుడు – మనిషిలో శాంతి చల్లని సెలయేరులా ప్రవహిస్తుంది. ఆ సెలయేరు ఒడ్డున అసంతృప్తి అనే మంట మండుతూ ఉండడం సాధ్యపడదు. అపుడు మనిషి ఆ ఎండమావిని వదులుకుంటాడు. నిజమైన సంతృప్తి అతడికి అందుతుంది. అపుడు అతడికి బయటి అవసరాలు కొద్దిగానే మిగిలి ఉంటాయి. కొద్దిగా కోరేవాడికి హెచ్చుగా అందితే – అతడికి ఆనందమే ఆనందం.*

★★★

# విషయ సూచిక

**ముఖచిత్రం : పరమవందనీయ మాతాజీ**


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం : | 1 |
| 2. | సద్గురు వచనామృతం | |
| | విషయ సూచిక | 2 |
| 3. | వేద మంత్రం | 3 |
| 4. | మాతాజీ సాక్షాత్తు అన్నపూర్ణ | 5 |
| 5. | మరుపురాని మాతాజీ స్మృతులు | 8 |
| 6. | శ్రేష్ఠ కార్యాలకై శక్తి సముపార్జనకు తరుణం | 10 |
| 7. | సృజనకు అధిదేవత విశ్వకర్మ | 12 |
| 8. | అమృత పుత్రుడు | 15 |
| 9. | మాతృమూర్తిగా మహిళ | 18 |
| 10. | ప్రకృతి నియమాల ఉల్లంఘన ప్రమాదభరితం | 21 |
| 11. | వ్యక్తిత్వ వికాసం ఒక ఆంతరిక ప్రక్రియ | 23 |
| 12. | అందరికీ అందుబాటైన సాధన – సేవ | 25 |
| 13. | లక్ష్యం లేని జీవితం తెగిన గాలిపటం | 28 |
| 14. | గాయత్రీ సాధకుడు కఠియా బాబా | 30 |
| 15. | మహాప్రాణముల, లఘుప్రాణముల పాత్రలు – 1 | 31 |
| 16. | సరిహద్దులను చెరిపిన వివాహం | 33 |
| 17. | అంతరాత్మ పిలుపు విన్న ఆదర్శమూర్తులు | 35 |
| 18. | ఆరోగ్యంగా, అవిశ్రాంతంగా, ఆనందంగా... | 38 |
| 19. | వానప్రస్థం – ఉత్తమం, మధ్యమం, కనిష్టం | 41 |
| 20. | స్వాతంత్ర్య యజ్ఞంలో ఆహుతి – 5 | 44 |
| 21. | యువతరానికి అందాలి దేవసంస్కృతి సౌరభం | 46 |
| 22. | సద్గురు లీలామృతం | 48 |


## హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రంలో విశిష్ట నవరాత్రి సాధనా శిబిరం

విశిష్ట నవరాత్రి సాధనా శిబిరం హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రం మరియు ధ్యాన మందిరంలో సెప్టెంబరు 23న ప్రారంభం అవుతుంది. అక్టోబరు 2న పూర్ణాహుతి జరుగుతుంది. సాధకులకు మహత్తర అవకాశం ఇది.

శిబిర అనుమతి పత్రాల కోసం ఇప్పటినుంచే దరఖాస్తులు పంపవలసిందిగా గాయత్రీ చేతనా కేంద్రం పరిజనులను ఆహ్వానిస్తోంది.

**స్వాధ్యాయమే వాణియొక్క తపస్సు – భగవద్గీత.**

# వేద మంత్రం

## మనస్సుతో ఇంద్రియాలను జయించు

**సుషారథిరశ్వానివ యన్మనుష్యాన్నే నీయతేభీశుభిర్వాజినఇవ ।**

**హృత్ప్రతిష్ఠం యదజిరం జవిష్ఠం తన్మే మనః శివసంకల్పమస్తు ॥** (యజుర్వేదం 34/6)

**భావార్థం** : ఓ మనుష్యులారా! ఏ విధంగా సారథి పది గుఱ్ఱాలను తన వశంలో ఉంచుకుని నడిపిస్తాడో, మీరు కూడా మీ మనస్సు ద్వారా పది ఇంద్రియాలను వశంలో ఉంచుకొనండి. ఇందుకు సంకల్పవంతులు కావాలి.

**సందేశం** : పరమ లక్ష్య ప్రాప్తిలో మన వాసనలే పెద్ద ఆటంకం. నిరంతరం విషయ వాసనలలో చిక్కుకుంటే, ప్రాపంచిక సుఖాల వెంబడి పరుగులు పెడుతుంటే – మనం వాటి దాసులైపోతాము. మనం ఎల్లప్పుడూ విషయ వాసనలనే ఆలోచిస్తూ ఉంటే – అవి మన మనస్సులను, ఇంద్రియాలను సంతుష్టిపరిచే పదార్థాలను పొందేందుకు ప్రేరేపిస్తాయి; మనం ఇంద్రియాలను అనేక ప్రకారాలుగా తృప్తి పరచుటలో నిమగ్న మవుతాము. మొదట మనసులో ఆలోచనలు కలుగుతాయి. ఏ విషయాలు ఆలోచన స్థాయికి చేరుకుంటాయో అవి క్రమక్రమంగా కర్మ స్థాయికి చేరతాయి. లాలస మనస్సులో ఉత్పన్నమవుతుంది, కర్మ బాహ్యంగా ప్రకటిత మవుతుంది.

వ్యక్తిగతంగా మనం ఇంద్రియ విషయాలను ఆలోచిస్తూ ఉంటాము. మానసికంగా వాటిని ప్రాప్తించుకోవాలని కోరుతుంటాము. కానీ, బాహ్యంగా మనం వాటి నుండి కాపాడబడాలని కోరుకుంటాము. ఇటువంటి వారిని మోసగాళ్లని అంటారు. ఇంద్రియ సుఖాల ఆలోచన మనసులో ఒకదాని తర్వాత మరొక లాలసను పుట్టిస్తుంది. మనుష్యుడు పాప కర్మలవైపు పయనిస్తూ పోతాడు. నియంత్రణ లేని ఇంద్రియ చింతన మనుష్యుని సంయమ, మర్యాదలను నాశనం చేస్తుంది. అతని ఆచరణ వివేకహీనం, అనైతికం, అహితకరం అవుతుంది. అతడు విషయ వాసన రొంపిలో చిక్కుకుపోతాడు.

వివేకవంతులైన పురుషులు ఈ విధంగా పతనమనే గోతిలో పడకుండా తమను రక్షించుకోవాలి. ఈ అనర్థానికి మూల కారణం మనస్సు ఇంద్రియ సుఖాలవైపు పరుగులు తీయుట. దీనికి ఒకే ఒక ఉపాయం ఆ మానసిక ప్రవృత్తిని నిరాకరించుటయే. శారీరిక రోగాల వైద్యాలలో మనం అనేక వస్తువులతో చికిత్స చేస్తాము; అదే విధంగా మానసిక ఆరోగ్యానికి కూడా. ప్రాపంచికతా రోగాన్నుండి కాపాడుకోవటానికి మనం ఇంద్రియ విషయాలను నిర్దయగా నియంత్రించాలి.

"సంసార దీర్ఘరోగస్య, సువిచారో మహౌషధమ్". ఈ ప్రపంచం దీర్ఘ రోగంతో నిండి ఉన్నది. దీనిలో నలువైపులా దోష – దుర్గుణాలు నిండి ఉన్నాయి. వాటి నుండి విముక్తికి సదాలోచనలనే మహౌషధం పని చేస్తుంది. మనస్సులో ఎల్లప్పుడూ శ్రేష్ఠమైన ఆలోచనలే రావాలి. ఇంద్రియాల పెత్తనాన్ని తొలగించుకోవాలి. ఇదే మన ధ్యేయం కావాలి. ఏ విధంగా సారథి ఒకే కళ్లెం ద్వారా పదేసి గుర్రాలను వశంలో ఉంచుకొని, ఏ దిక్కుకు కావాలంటే ఆ దిక్కుకు మళ్లిస్తాడో – అదే విధంగా మన మనస్సనే కళ్ళేన్ని కఠినంగా బిగించి పట్టుకొని, ఇంద్రియాలను సంయమించాలి. తద్వారా అవి ఎల్లప్పుడూ సత్కర్మల వైపు ప్రేరేపించబడతాయి. వివేకం, వైరాగ్యముల సహాయంతో మనం మన మనస్సును భౌతిక పదార్థాల నుండి మళ్లించాలి. మన వాస్తవిక శక్తికి తగిన జీవితం గడిపేందుకు నిజమైన కృషి చేయాలి.


అలా చేసేందుకు ఆత్మబలాన్ని, దృఢ ఇచ్ఛాశక్తిని వికసింపచేసుకొంటే, మనం మానవ జీవన లక్ష్యాన్ని ప్రాప్తించుకోగలం.

★★★

**తనను తాను మరచినవానిని భగవంతుడు కూడ మరుస్తాడు.**

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్

# ఓం




గాయత్రీ మంత్రంవల్ల ప్రభావితమయే శరీర కేంద్రాలు

– కె.పి.విఠల్

## ముఖచిత్ర కథనం

# మాతాజీ సాక్షాత్తు అన్నపూర్ణ

పరమపూజ్య గురుదేవుల జీవితం తెరచి ఉంచిన పుస్తకం. వారి జీవితాన్ని గురించి వారే చాలావరకు వ్రాశారు. ఇతరుల ద్వారా వారి జీవిత కథ చెప్పబడింది. కానీ గురుదేవుల జీవితానికి పూరకమై, శివశక్తిలా సగభాగం తానై ఉన్న పరమవందనీయ మాతాజీ జీవితం మాత్రం రహస్య గాథగా ఉంది. నీటిపై హిమఖండం (గ్లేషియర్) పై భాగం కనిపిస్తుంది. అంతకంటే ఎన్నో రెట్ల భాగం నీటిలోపల ఉంటుంది. అదే విధంగా – బాహ్యరూపంలో అతి సామాన్యంగా కన్పించే ఆమె వ్యక్తిత్వం అసాధారణమైంది. ఆమె సమీపంలో ఉన్నవారికి ఆమె ఎంత విశాలమైన శక్తిసాగరమో గోచరమౌతుంది. అలౌకికమూ, రహస్యమయమూ అయిన సిద్ధులను గురించి పాఠకులు చదివి ఉంటారు. ఇకముందు కూడ చదువుతారు. కానీ వ్యక్తిత్వమనేది ఎన్ని సుగుణాలతో నిండి ఉంటుంది, దాని పూర్ణ స్వరూపమేమిటి, వ్యావహారిక ఆధ్యాత్మికత జీవన చర్యలో ఎలా ఉంటుంది, ఒక విరాట్ హృదయం కలిగిన తల్లి ఏ విధంగా అందరికీ సమానమైన ప్రేమ స్నేహాలను పంచుతుంది – వీటన్నిటికీ సాకారమైన మాతృశక్తిని మనం పరమవందనీయ మాతాజీ జీవితంలో చూడగలుగుతాము.

పరమపూజ్య గురుదేవులు స్వాతంత్ర్య సంగ్రామ సేనానిగా ఇంటినుండి వెళ్లినపుడు, పరిస్థితులు చాలా విషమంగా ఉండేవి. ఒకపెద్ద జమీందారీనీ, వైభవోపేతమైన ఇంటినీ వదలివెళ్లేటపుడు, సదా ఆయన్ని రక్షించే సంరక్షక సత్తా ఇలా చెప్పారు – "స్వరాజ్యం వచ్చిన రోజున ఒక రాజులా ఏనుగుపైన కూర్చొని ఇంట్లోకి రావాలి". జన్మతోనే ఇటువంటి పనులకు తయారుగా ఉన్న, నిర్మోహ బైరాగి ఐన గురుదేవులు ఒక పళ్లెమూ, గ్లాసూ తీసికొని ఇంటినుండి బయలుదేరారు. మాతాజీతో వివాహమయ్యాక కూడా వారు ఇంట్లోనుండి డబ్బు తీసుకోలేదు. ఆగ్రా సమాచార దినపత్రిక "సైనిక్"కు సహాయ సంపాదకుడుగా వచ్చే జీతంతోనే మొదట ఆగ్రాలో, తర్వాత నెలకు పదిరూపాయల జీతంతో మథురలో, మూడుసార్లు ఇళ్లు మారాక ఇప్పటి అఖండజ్యోతి సంస్థానంలో నివాస మేర్పరచుకున్నారు.

1945 వ సంవత్సర మధ్యకాలం నాటి సంగతి. ఎన్నడూ ఖద్దరు చీరను కూడ ధరించని మాతాజీ ముతక కంట్రోలు వస్త్రంతో కాలం గడిపింది. అయినా ఆమె ముఖంపై ఏ విధమైన విచారపు నీడా ఉండేది కాదు. మథురలో ఇరుగుపొరుగువారు ఏవేవో మాట లనుకునేవారు. కానీ ధైర్యవంతురాలైన ఈమెను సూటిగా చూచేందుకు కూడ సాహసం చేయలేకపోయేవారు. చాలీచాలని డబ్బుతో కుటుంబాన్ని గడపడం అంత సులభం కాదు. ఎవరు వచ్చినా – గురువుగారు భుజం మీద చేయి వేసి, ఆప్యాయంగా ఇంటికి తీసికొని వచ్చేవారు. ఇంట్లో ఏవైనా ఉన్నాయా, లేదా అన్న ఆలోచన వారికి ఉండదు. పత్రిక చందాగానీ, ఏదైనా అంశదానం కానీ వస్తే, వారు దాన్ని మాతాజీ చేతిలో పెట్టేవారు. ఒక కంచమూ, గ్లాసూ మాత్రమే వారు మొదట మాతాజీకి ఇచ్చినవి. అతిథి సత్కారాలు ఎలా చేయాలన్నది మాతాజీయే చూడాలి. పూజ్య గురుదేవులకు తన గురుసత్తాపైన పూర్తి విశ్వాసముంది. గురుసత్తా ఎంపిక చేసిన సహధర్మచారిణి సామాన్య స్త్రీ కాదనీ, సాక్షాత్తూ అన్నపూర్ణేననీ గురువుగారి నమ్మకం. ఆమె తన ఆహారాన్ని తగ్గించుకునేవారు. ఉపవాసాలు ఉండేవారు. ఈ విషయం ఎవ్వరికీ తెలిసేది కాదు. వచ్చినవారికి ఎంతో ప్రేమతో కడుపునిండా భోజనం పెట్టి పంపేవారు.

నెలసరి ఖర్చుల లెక్కలు మాతాజీ స్వయంగా చూచుకునేవారు. అఖండజ్యోతిని చేతితో తయారు చేసిన

**నిర్మల హృదయమే దేవుని రహస్యాన్ని తెలుసుకోగలుగుతుంది.**

కాగితాలపైన చేతితో అచ్చు వేయడం, పుస్తకాల ముద్రణ, బైండింగు, ఇంటికి వచ్చే దగ్గర దూరపు బంధువులకు మర్యాదలు, వారి పిల్లల బాగోగులు, వారి చదువులు, ఖాళీ సమయాల్లో ఆ పిల్లల చేత కూడ పని చేయించడం, గురుదేవులకు వచ్చే ఉత్తరాలు చదవడం, గురుదేవులు వెనువెంటనే చెప్పే జవాబులు వ్రాయడం - ఇవన్నీ ఆమె దినచర్యలో భాగంగా ఉండేవి. నేడు పెద్దపెద్ద హోదాల్లో ఉన్న ఎందరెందరో ఆమెకు ఋణపడి ఉన్నారు. మాతాజీ వారిని స్వావలంబులుగా తయారు చేయకపోతే, వారిప్పుడు అంత గొప్ప పదవులలో ఉండేవారు కారు.

ద్రోణాచార్యుల కథ అందరికీ తెలిసే ఉంటుంది. ద్రోణాచార్యుడు భిక్షాటన చేసే బ్రాహ్మణుని స్థితిలో ఉన్నాడు. కుమారుడు అశ్వత్థామ పాలకోసం ఏడుస్తున్నాడు. ఆవుపాలు లేవు. ఆయన భార్య పిండిని నీళ్లలో కలిపి త్రాగించి కుమారుణ్ణి సంతుష్టి పరచింది.

ఇటువంటి సంఘటన ఈ కాలంలో పునరావృతమైంది. అతిథులు భోజనం చేసి వెళ్లిపోయాక మాతాజీ ఉప్పూ, కారమూ కలిపిన నీళ్లతో సగం రొట్టె తిని పడుకోబోయింది. ఆమె కుమారుడు, కుమార్తె అప్పటికి మేలుకొనే ఉన్నారు. వారు హల్వా కావాలని పట్టుబట్టారు. ఆ సమయంలో ఆమె సామాను ఎక్కడి నుండి తెస్తుంది? హల్వా ఎప్పుడు తయారుచేస్తుంది? ఆమె నవ్వుతూ ఇంట్లోకి వెళ్లి, పిండి, బెల్లం కలిపి తమ పిల్లలు శైలకూ, మృత్యుంజయకూ హల్వా తినిపించింది. అపుడు అక్కడే ఉన్న ప్రేమమతి ఇదంతా చూచి, 'మీరూ, మీ పిల్లలూ ఇంత సంతుష్టులుగా ఉంటారని నేనెప్పుడూ అనుకోలేదు. వేయించని, నెయ్యి, చక్కెర లేని హల్వాను నేను ఈ రోజే చూచాను' - అంది. మాతాజీ పిల్లల్ని నిద్రపుచ్చింది. ఇప్పటికీ ఆ పిల్లలిద్దరూ ఆ హల్వా రుచిని గుర్తుచేసుకుంటూ ఉంటారు.

కఠోరంగా ఖర్చులు తగ్గించుకుని సాదాగా జీవించేవాడు నిజమైన బ్రాహ్మణుడు. ఆ దంపతుల జీవితంలో అలాంటి బ్రాహ్మణత్వం స్థిరపడింది. వైభవం ఆ బ్రాహ్మణత్వానికి బలి అవుతూ వచ్చింది. పని చేసినందుకు తమ పిల్లలకు మాతాజీ బహుమతిగా ఒక్క పైస ఇవ్వడం మొదలుపెట్టారు. మరొకరయితే ఆ పైసలతో ఏదైనా మిఠాయో, ఐస్‌క్రీమ్‌లో కొని ఖర్చు చేసుకునేవారే. కానీ మాతాజీ శిక్షణ ఆ పిల్లలపై 24 గంటలూ పనిచేసింది. తల్లి ఇచ్చిన పైసలతో పిల్లలు మంచి పుస్తకాలు కొన్నారు; పెళ్ళిళ్లలో వేసుకునేందుకు దుస్తులు కుట్టించుకున్నారు. ఈ విధమైన శిక్షణ హరిద్వార్‌లో విశాలమైన శాంతికుంజ్ నిర్మాణం జరిగిన తర్వాత కూడ కొనసాగింది. అఖండజ్యోతి సంస్థానంలో వలెనే ఇక్కడ కూడ ఎవ్వరూ ఆకలితో తిరిగి వెళ్లడంలేదు. సాధనాలు కనీసంగా ఉన్నప్పటికీ, వ్యక్తి తన బ్రాహ్మణత్వం ఆధారంగా ఎలాంటి అవరోధాలనైనా దాటి ముందుకు సాగగలుగుతాడు. లోకకళ్యాణం కోసం పెద్ద పెద్ద నిర్మాణాలను చేయగలుగుతాడు. శాంతికుంజ్ గురుద్వారా యొక్క లంగర్ (అన్నసత్రం), బాపా జలరామ్ యొక్క భోజనాలయం ఇందుకు సాక్ష్యాలు. ఇక్కడ దేనికీ ఏ విధమైన కొరతా ఉండదు.

మాతాజీ సాక్షాత్తూ అన్నపూర్ణ. ద్రౌపది దగ్గర ఉన్నట్లుగానే మాతాజీ వద్ద కూడ అక్షయపాత్ర ఉండేమోనని అనుకోవడంలో ఏ విధమైన సందేహమూ రాదు. స్వాతంత్ర్య సంగ్రామం కోసం ఒక పళ్లెం, గ్లాసుతో బయలుదేరిన బ్రాహ్మణుడు భార్యకు వివాహ బహుమతిగా వాటిని ఇచ్చారు. చివరివరకు ఆమె వాటిని తనవద్దనే ఉంచుకున్నది. పరమార్థం కొరకు జీవనం గడిపేవారికి-వారు ఎంత పేదరికంతో బాధపడుతున్నా సరే - అనేక రెట్లు ధనసంపత్తి లభ్యమౌతుంది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ శాంతికుంజ్. ఇక్కడ మాతాజీకి సమర్పించబడే ఆహారవస్తువులూ, దుస్తులూ, బహుమూల్య వస్తువులూ ఈ విశాల కుటుంబంలో సమానంగా పంచబడతాయి. మరల అంతకంటే ఎక్కువగా లభ్యమవుతాయి.

ఒకసారి పరమపూజ్య గురుదేవులూ, పరమవందనీయ

**అన్యాయం చేసినవాడు దాన్ని సహించేవానికన్న మిన్నగా దుర్గతి పాలవుతాడు.**

మాతాజీ ఒక యజ్ఞం కోసం రాజకోట, భావనగర్‌కు వెళ్లారు. అది 1967-68 సమయం. గురుదేవులు వెళ్లిన చోటికి భక్తజనులు వచ్చారు. ఒకరి ఇంట్లో మాతాజీ స్వయంగా వంటగదిలోకి వెళ్లింది. అక్కడ 8-9 మందికి మాత్రమే భోజనం ఉంది. ఆ ఇంటి యజమాని ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. నమస్కరించడానికి వచ్చినవారు చాలా ఎక్కువ మంది ఉన్నారు. వారందరికీ భోజనం పెట్టకుండా అన్నపూర్ణ అయిన మాతాజీ ఎలా భోజనం చేస్తుంది. సందిగ్ధమైన పరిస్థితి. మాతాజీ గురువుగారి వంక చూచి చిరునవ్వుతో - వారందరి భోజనం అయ్యాక మనం భోంచేద్దాం - అని చెప్పారు. మాతాజీ వంటగదిలోకి వెళ్లి వంట పదార్థాలు ఉన్నచోట ఒక దీపాన్ని వెలిగించారు. ఇంటి యజమానురాలితో రొట్టెలు, కూర తయారు చేయాల్సిందిగా చెప్పారు. భోజనం తయారవుతోంది. ఆ పదార్థాలతో 200 మంది కంటే ఎక్కువ మంది భోంచేశారు. 8మందికి సరిపోయే భోజనం మిగిలిపోయింది.

ఈ లీలను ఏమంటారు? ఒక పేద కుటుంబం యొక్క మర్యాద నిలపడానికి లీలావతారం ద్వారా జరిగిన అద్భుతమా!

ఇదొక్కటే కాదు. ఇటువంటి సంఘటనలు చాలా జరిగాయి. సన్నిహితులందరికీ ఈ విషయం అవగతమే. శాంతి కుంజ్‌లోని ప్రతి కార్యకర్తకూ 1983-84 వరకు మాతాజీ స్వయంగా పంచిన ప్రేమను గురించి తెలుసు. ప్రతి ఒక్కరికీ జొన్నరొట్టెలు చేసి తినిపించడం, వారివద్దనే కూర్చొని భోజనం పెట్టి తృప్తి పరచడం, బొగ్గులపొయ్యి వద్ద కూర్చొని అప్పడాలు వేయించిపెట్టడం, అక్కడి పిల్లలకు ఇష్టమైన సెనగపిండి హల్వా చేసి తినిపించడం - ఇదంతా అందరికీ జ్ఞాపకం ఉంది. ఆమె వాత్సల్యం గుర్తుకు వచ్చి - అందరి మనస్సులూ కరిగిపోతాయి. తమ పూర్వజన్మ సుకృతం వల్ల మాతా అన్నపూర్ణకు ఇంత సమీపంలో ఉన్నాము - అని వారు అనుకుంటారు. ఆ స్మృతులన్నీ మా అందరికీ అమూల్య నిధులు. మా అందరికీ అవి మాతృసత్తా యొక్క అజ్ఞాత స్వరూపపు మెరుపులు. వాటిని చూచి, చదివి - ఎవరైనా అధ్యాత్మ సిద్ధి యొక్క మూలాన్ని అందుకోగలుగుతారు.

- అనువాదం : కె.అరవిందమ్మ

★★★

## ఫైర్‌మన్ దిల్‌బాగ్ సాహసం

1980లో ఫైర్‌మన్ దిల్‌బాగ్ సింగ్ ఫైర్ బ్రిగేడ్ సర్వీసులో చేరాడు. 21 సెప్టెంబరు 1993 నాటి విషయం. హాంపీలోని బోధారామ్ కాలనీలో సీవర్‌ను శుభ్రం చేస్తున్నారు. చాంద్‌రామ్, దేవా, జగదీశ్ అనే ముగ్గురు కార్మికులు సీవర్‌లోపల శుభ్రపరుస్తున్నారు. ఇంతలోనే వారిని విషవాయువులు చుట్టుముట్టాయి. బయట ఉన్న వారికి విషయం తెలిసి సహాయం కొరకు కేకలు వేయసాగారు. సహాయానికి ఫైర్ బ్రిగేడ్ కూడా వచ్చింది.

సాహసవంతుడైన దిల్‌బాగ్ సింగ్ తక్షణమే 'మేన్ హోల్'లోకి దిగిపోయాడు. సర్వవిధాలా ప్రయత్నించి దేవా, జగదీశ్‌లను స్పృహలేని స్థితిలో పైకి లాక్కొని వచ్చాడు. మూడవ కార్మికుడైన చాంద్‌రామ్‌ను రక్షించి పైకి తీసికొని వచ్చేందుకు మళ్ళీ వెళ్ళాడు. చాంద్‌రామ్ అక్కడ బురదలో ఇరుక్కొనిపోయి ఉన్నాడు. అతనిని బయటికి లాగేందుకు దిల్‌బాగ్ సింగ్ ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఐతే విషవాయువులు దిల్‌బాగ్‌ను చుట్టుముట్టాయి. అతను స్పృహ తప్పిపోయాడు. అతి కష్టం మీద జనులు అతనిని పైకి లాగారు. ప్రమాద స్థితిలో దిల్‌బాగ్‌ను రోహతక్ మెడికల్ కాలేజికి పంపారు. అక్కడ అతని పరిస్థితి కుదుటపడింది. ఈ ప్రమాదంలో చాంద్‌రాం ప్రాణాలను తాను కాపడలేకపోయినాడు. దిల్‌బాగ్ తన ప్రాణాల లెక్కచేయకుండా దూకటం ఇది మొదటిసారి కాదు. అనేక సందర్భాలలో తన కర్తవ్య నిర్వహణలో అతడు ఇలాగే చేశాడు. తాను ప్రమాదంలో పడి కూడా ఇతరుల ప్రాణాలను రక్షించాడు. ఇటువంటి కార్యకర్త ధన్యుడు.

**అపహాస్యానికీ, వ్యతిరేకతకూ జంకేవాడు ఎన్నడూ సంస్కర్త కాలేడు, కాబోడు.**

## ముఖచిత్ర కథనం - 2

# మరుపురాని మాతాజీ స్మృతులు

పరమవందనీయ మాతాజీ 1993వ సంవత్సరంలో మూడు పర్యాయాలు అశ్వమేధ యజ్ఞ నిర్వహణకై విదేశాలకు వెళ్లారు. ఒకసారి ఇంగ్లాండు, ఒకసారి కెనడా, ఒకసారి అమెరికా. అక్కడి కొన్ని స్మృతులను సంస్మరణ పుష్పాల రూపంలో సమర్పిస్తున్నాము.

లాస్ ఏంజిల్స్‌లో అశ్వమేధ యజ్ఞం జరిగింది. పరమవందనీయ మాతాజీ సేండియాగో (మెక్సికో దగ్గర)లో ప్రజ్ఞాపీఠ ప్రాణప్రతిష్ఠ చేయడానికి 400 మైళ్ల దూరం వెళ్లవలసి వచ్చింది. అశ్వమేధ సంచాలనం కోసం 10మంది శాంతికుంజ్ ప్రతినిధులు అక్కడ ఉన్నారు. మూడు అశ్వమేధ యజ్ఞాల్లో కూడ ఆమెను కలవడానికి గానీ, ఆమె దగ్గర ఉండడానికి కానీ వారికి వీలు కాలేదు. అందుకని అందరికీ కూడ - 3నెలల నుండి మాతాజీ స్నేహం మాకు కరవయింది, ఆమె స్నేహం మాకు కావాలి - అనిపించింది.

సేండియాగోకు మూడు కార్లలో వెళ్లడానికి నిశ్చయమైంది. కానీ మాతాజీ ప్రణవ పండ్యా గారితో, "ప్రణవ్, పిల్లలందరితో కలిసి ఒకే బండిలో వెళ్లే వ్యవస్థ ఏమీ లేదా? వీళ్లందరితో కలసి ఉండాలని నా మనస్సు ఆరాటపడుతోంది" - అన్నారు. అక్కడి పరిజనుడైన డాక్టర్ దిగ్యాంగ్ గారి పెద్దకారు మోటార్‌హోం (అందులో ఇంట్లోలా వసతులూ, స్థలమూ ఉంటుంది) ఏర్పాటు చేశారు. శాంతికుంజ్ పరిజనులు పదిమంది, స్థానిక పరిజనులు ఇద్దరూ కూర్చున్నారు. పరమవందనీయ మాతాజీ, శైల దీదీ, ప్రణవ పండ్యాలు మధ్యన కూర్చున్నారు. నాలుగువేపులా 15మంది పిల్లలు. 400మైళ్లు 5 గంటలలో వెళ్లేందుకు నిశ్చయమైంది. ప్రజ్ఞాగీతాలూ, అంత్యాక్షరీ, ఇతర గీతాలూ, వినోదాలూ మొదలైన వాటితో ప్రయాణం సరదాగా ఉంది. పరమవందనీయ మాతాజీ కూడ భావయుక్తమైన 5 పాటలు పాడారు. అప్పుడప్పుడూ శైల దీదీ, ప్రణవ్ పండ్యాలు కూడ పాడారు.

సేండియాగోలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. భోజనం తర్వాత తిరిగివెళ్లాలి. బండిలోని వెనుక గదిలో పరుపు పరచిఉంది. మాతాజీని అక్కడికి వెళ్లి విశ్రాంతి తీసుకొమ్మని అందరూ బలవంతం చేశారు. మాతాజీ అంగీకరించలేదు. కానీ అందరి బలవంతం మీద వెళ్లారు. శైల దీదీ కూడ వెంట ఉన్నారు.

అందరూ బయట చర్చించుకుంటున్నారు. పదినిమిషాల తర్వాత వెనక గది తలుపు తెరుచుకుంది. మాతాజీకి ఏమైనా కావాలేమోనని అందరూ పరిగెత్తుకుంటూ వెళ్లారు. మాతాజీ దిగులుగా బయటకు వచ్చారు. విశ్రాంతి తీసుకోకుండా ఎందుకు వచ్చారని అందరూ అడిగారు.

మాతాజీ ఇలా చెప్పారు - "నా పిల్లలందరూ బయట కూర్చున్నారు. నాకు వారి మధ్యలో నవ్వుతూ మాట్లాడడమే విశ్రాంతి. పిల్లలకు దూరంగా ఉంటే జైలులో ఉన్నట్లుంది. ఈ శరీరమున్నంత వరకు నాకు ప్రియమైన నా పిల్లల వద్దనే ఉంటాను. వాళ్లకు ప్రేమనందిస్తాను, వారి వీపు నిమురుతాను. శరీరాన్ని నిలుపుకోవడానికి నాకు ఇదే ఆధారం. వారితో కలసిమెలసి ఉండకపోతే, ఈ శరీరాన్ని నిలుపుకోవడం కష్టమౌతుంది. ఇష్టులైన వారి వియోగాన్ని దూరం చేయడానికి ఇదొక్కటే మార్గం."

లాస్ ఏంజిల్స్‌లో ఆమె చెప్పిన వాక్యాలు సత్యమనిపించాయి. చిత్రకూట అశ్వమేధ యజ్ఞం తర్వాత పిల్లల వియోగాన్ని ఆమె ఎలా సహించారా అన్నది అందరికీ అనుభవమైంది. తమ పిల్లల్ని కలవనందుకూ, వారికి స్నేహరసాన్ని పంచనందుకూ ఆమె ఎంత వ్యాకులత చెందారో!

లాస్ ఏంజిల్స్ (అమెరికా)లో అశ్వమేధ యజ్ఞం జరుగుతున్నది. పరమవందనీయ మాతాజీ ప్రవచనం హిందీలో ప్రారంభమయింది. ఐదువందల మంది అమెరికన్లు ధ్యానముద్రలో కూర్చున్నారు. ప్రవచనం పూర్తి అయ్యాక కొందరు పాత్రికేయులు అమెరికన్ల వద్దకు వెళ్లి, "మాతాజీ ప్రవచనం హిందీలో ఉన్నది కదా! మీరంతా చాలా శ్రద్ధగా ఎలా విన్నారు?" - అని అడిగారు. అమెరికన్లు ఇలా అన్నారు- "మాతాజీ సామాన్యమైన మదర్ కాదు. ఆమె స్పిరిచ్యుయల్ మదర్(ఆధ్యాత్మిక మాత). ఆమె మాకు భావనామయమైన భాషలోనే విషయాన్ని తెలియచెప్పారు. తల్లీ కొడుకుల మధ్య భావనాత్మకమైన సంబంధ ముంటుంది. ఆమె చెప్పినదంతా మాకు బోధపడింది." ఆమె ఏ విషయంపైన చెప్పారు, ఏమి చెప్పారని పాత్రికేయులు ఉత్సుకతతో అడిగారు. వారు

**లోభ, మోహాలను వదులుకున్నప్పుడే మనిషి తనను తాను వశపరచుకోగలుగుతాడు.**

అశ్రుపూరిత నయనాలతో మాతాజీ చెప్పిన ప్రవచనాన్ని మొత్తం తిరిగి చెప్పారు.

వాస్తవం ఏమంటే– పరమ వందనీయ మాతాజీ పరా – పశ్యంతి వాణి ద్వారా అందరిలో ప్రేరణను నింపుతారు; మార్గదర్శనం చేస్తారు; ఎల్లప్పుడూ స్నేహంతో కూడిన సంరక్షణ చేస్తూ ఉంటారు.

లీస్టర్ అశ్వమేధం తర్వాత మాతాజీ భారత్‌కు రావాలి. గెట్‌విక్ ఎయిర్ పోర్టులో ఆమెకు వీడ్కోలు ఏర్పాటు చేశారు. 500 మంది పరిజనులు అక్కడికి వచ్చారు. అందరి చేతుల్లోనూ పూలమాలలు మొదలైనవి ఉన్నాయి. ప్రణామ క్రమం నడుస్తోంది. ప్రణామ కార్యక్రమం తర్వాత ఎయిర్‌పోర్టు వెయిటింగ్ ఏరియాలో పూలు వెదజల్లబడి ఉన్నాయి. మాతాజీకి ఇది నచ్చలేదు. వెంటనే ఆమె ఇలా అన్నారు–"నా కారణంగా ఇక్కడ అవ్యవస్థ ఏర్పడింది. అపరిశుభ్రత ఉండడం మంచిది కాదు. పరిజనులు పూలు పారవేశారు. ఆ స్థలాన్ని శుభ్రపరచండి. ఈ స్థలం మొదట ఎంత శుభ్రంగా ఉందో అంత శుభ్రంగా ఉంచి వెళితే, నాకు సంతోషంగా ఉంటుంది."

పరిజనులందరూ వెదజల్లబడిన పూలనన్నింటినీ తీసివేసి ఆ స్థలాన్ని శుభ్రంచేశారు. ఆ స్థలమంతా మొదట ఉన్నట్లుగానే పరిశుభ్రంగా తయారయింది. కొంతమంది బ్రిటిష్‌వారు కూర్చొని ఈ దృశ్యమంతా చూస్తున్నారు. ఇంతటి క్రమశిక్షణప్రియులైన వారెవరో తెలుసుకోవాలన్న జిజ్ఞాస వారికి కలిగింది. పరిచయమయ్యాక 25 మంది బ్రిటిష్ పౌరులు మాతాజీకి ప్రణామం చేశారు. వారందరినీ మాతాజీ ఆశీర్వదించారు.

పరమవందనీయ మాతాజీ క్రమశిక్షణ ప్రియులు, వ్యవస్థాప్రియులు. అదే విధమైన అనుశాసనాన్ని ఇతరులు కూడ కలిగిఉండాలని వారు అభిలషించేవారు.

–అనువాదం: కె.అరవిందమ్మ

## చదువు, సంస్కారం

నాగరాణి గైడిన్‌లూ మంచు కొండలతో, అరణ్యాలతో కూడిన ప్రదేశంలో జన్మించింది. నాగాలలో కాంబాయి జనజాతిలో ఒక పురోహిత కుటుంబం ఆమెది. ఆ రోజులలో ఆ కొండ జాతుల వారిలో చదువుచెప్పేవారు లేరు. గైడిన్‌లూకి మొదటి నుండి చదువుకోవాలని ఆకాంక్ష ఉండేది. ఆమె తల్లి తన కుమార్తెను బడిలో చేర్పించింది.

అప్పుడు భారతదేశమంతటిలో సహాయ నిరాకరణోద్యమం ఉధృతమౌతోంది. నాగాలాండు కూడా ఉద్యమంలో పాలుపంచుకొంది. ఒక రోజున విద్యార్థులను సంబోధిస్తూ ప్రార్థనా సమావేశంలో ప్రధానాచార్యులు ఇలా చెప్పారు – 'భారతమాత దాస్య శృంఖలాలలో మ్రగ్గుతోంది. ఆమె ఈనాడు రక్త రంజితమై ఉంది. చిన్నారులారా! మీకు మన మాతృభూమి పట్ల ఏకొంచెం భక్తి ఉన్నా – ఆమె సంకెళ్ళను త్రెంచివేయండి. తిండి తినటం, పిల్లలను కనడం – ఇట్టి జీవితం పశువులు కూడా గడుపుతున్నాయి. కాని మానవులమైన మనం దేశం, జాతి, ధర్మం కోసం మన జీవితాలను త్యాగం చేయాలి. మానవ జన్మకు అప్పుడు సార్థకత ఏర్పడుతుంది.'

పదహారేండ్ల ఈడుగల గైడిన్‌లూ కోమలమైన హృదయంమీద ఈ మాటల ప్రభావం పడింది. వెంటనే ఆమె 10–15 మంది తోటి విద్యార్థులను చేర్చి ఒక సంఘాన్ని ఏర్పరచింది. కొండలోయల్లో నిలిచి ఈ వీరబాలికలు ప్రతిజ్ఞ చేశారు – 'మా శరీరాలలోని అఖరి నెత్తురు బొట్టు వరకు మేము మాతృభూమి స్వాతంత్ర్యం కొరకు పోరాడుతూనే ఉంటాము.'

తరువాత తరువాత ఈ సంఘం పెరిగి పెద్దదై నాగాలాండ్ అంతటికీ వ్యాపించింది. ఆంగ్లేయ ప్రభుత్వాన్ని వీరి బృందాలు అనేక చోట్ల ఎదుర్కొన్నాయి.

ప్రభుత్వానికి రాణి గైడిన్‌లూ కంటకప్రాయ మైపోయింది. ఆమెకు ఆజన్మ కారాగార శిక్ష విధించింది ప్రభుత్వం. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గైడిన్‌లూ దేశాభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసింది. చివరి క్షణం వరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆమె అమరజీవి అయింది.

విద్యాలయ వాతావరణంలో చదువుకునే బాల బాలికల కోమల హృదయాలపై ఎటువంటి ప్రభావ ముద్ర పడుతుందో గైడిన్‌లూ జీవితాన్ని చూస్తే తెలుస్తుంది. దేశభక్తులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రేరణనిస్తే, దాని పరిణామం ఎలా ఉంటుందో స్వాతంత్ర్య జ్వాలలను రగిలించిన గైడీన్‌లూ దృష్టాంతం తెలుపుతుంది.

**నిర్దోషి గుండెలో భయం ఉండదు.**

## నవరాత్రి అనుష్ఠానం

# శ్రేష్ఠ కార్యాలకై శక్తి సముపార్జనకు తరుణం

శుక్ల పాడ్యమి నుండి నవమి వరకు చైత్ర నవరాత్రులు జరుగుతాయి. నవరాత్రులు శక్తిసాధనకు సంధిపర్వములు. శక్తి సంపాదన, శక్తి సదుపయోగములతో శక్తి సాధన ఫలవంతమౌతుంది. లభ్యమైన శక్తి రెండు విధాలుగా ఉపయోగపడుతుంది - లోక కల్యాణం కోసం, ఆత్మ సంస్కరణ కోసం. నవరాత్రులలో విశిష్టమైన శక్తిధారలు ప్రవహిస్తాయి. ఈ శక్తిధారలను మహా తపస్సు ద్వారా ఆకర్షించుకోవాలి. వ్యక్తి యొక్క సాధన ననుసరించి - ప్రతి మంత్రంతో పాటు సాధకునిలో ప్రవేశించి, శక్తి అతని వ్యక్తిత్వానికి క్రొత్త ఆకారాన్ని ఇస్తుంది. కనుక ఈ తొమ్మిది రోజుల్లో సంయమనం అత్యవసరం అవుతుంది. తద్వారా లభ్యమైన శక్తిని నిలుపుకోవడానికీ, కోరిన విధంగా ఉపయోగించుకోడానికీ వీలవుతుంది.

నిష్క్రియుడయిన బ్రహ్మ క్రియాశీలుడు అయినపుడు - శక్తి ఆకారాన్ని స్వీకరిస్తుంది. ఈ ఆదిశక్తి సృష్టిరచన ప్రారంభించి, జడములను, జీవములను, మనుష్యులను సృష్టిస్తుంది. కనుక- ఈ విశ్వమంతా శక్తి సంధానం తప్ప మరేమీ కాదు. శక్తి భక్తుల సంయోగం సృజనశీలతకు దిశను నిర్ణయిస్తుంది. గెలుపు దానికే లభిస్తుంది. అది జరగకపోతే, శక్తి దురుపయోగమవుతుంది. శక్తిని భక్తితో సమన్వయ పరచినపుడు అనేకములైన మూర్తులను ఊహించుకుంటాము. వాటికి మనం అత్యంత ప్రియమైన మాతృ స్థానాన్ని ఇస్తాము. ఈ శక్తే గాయత్రి, దుర్గ, మహాలక్ష్మి, మహాకాళి రూపాలను ధరిస్తుంది. వీటి స్వభావాల్లో భిన్నత్వ మున్నప్పటికీ, వీటికి మూలం ఆదిశక్తే.

నవరాత్రుల యొక్క విశిష్ట క్షణాల్లో ఉపాసనా, సాధనల వలన శారీరిక ఆరోగ్యం, సత్ఫలితాలు, అభీష్టసిద్ధి మొదలైన దివ్య లాభాలు సమకూరుతాయి. ప్రజ్ఞావంతులు శక్తి సాధన యొక్క ఈ విశేష సమయాన్ని వృథా చేయరు.

మన దేశంలో శక్తిపూజ అనేక రకాలుగా ఉంది. ప్రజలు తమ తమ సంప్రదాయాల ప్రకారం ఈ తొమ్మిది రోజులను ఉపయోగించుకుంటారు. రామభక్తులు రామాయణాన్నీ, కృష్ణభక్తులు భగవద్గీతనూ, శ్రీమద్భాగవతాన్నీ పారాయణం చేస్తారు. దేవీ ఉపాసకులు దుర్గాసప్తశతీ పారాయణం, నవార్ణమంత్ర అనుష్ఠానం చేస్తారు. తాపసులు ఈ రోజుల్లో కఠోర తపమూ, ఉపవాసాలూ చేస్తారు. తంత్ర విధానంలో శవ సాధన, కుమారీ పూజ, కుండలినీ జాగరణ, చక్రవేధన మొదలైన రహస్యమయమైన సాధనలు విశేషంగా ఈరోజుల్లో జరుగుతాయి. ప్రజ్ఞా పరిజనులు గాయత్రీ జప లఘు అనుష్ఠానం 24వేల మంత్ర జపంతో చేస్తారు.

సాధారణంగా నవరాత్రుల్లో నవదుర్గ ఉపాసనను జోడించడం జరుగుతుంది. గాయత్రీ అనుష్ఠానంతో దీనికి సంబంధమేమిటనే సందేహం కలుగవచ్చు. తాత్వికంగా- దుర్గకూ, గాయత్రికీ ఏవిధమైన భేదం లేదు. రెండూ శక్తిధార యొక్క రెండు స్వరూపాలు. దుర్గామాత మానవునిలోని పాపమయ ప్రవృత్తులనూ, దోష దుర్గుణాలనూ, కషాయ కల్మషాలనూ రూపుమాపే మహాశక్తి. ఈ దుష్ప్రవృత్తులే మహిషాసురుడు. గాయత్రీమాత మానవుని ప్రవృత్తులను సాత్విక గుణాలవైపు మరల్చి, వికసింపచేస్తుంది. మానవునిలో పవిత్రతను ఉదయింప చేస్తుంది. దుర్గ సంహారక శక్తి. గాయత్రి సృజన శక్తి. దుర్గాదేవి ఉపాసన వలన దుష్ప్రవృత్తులు నశిస్తాయి. గాయత్రీ సాధనతో సత్ప్రవృత్తులు ఉదయిస్తాయి. జీవితంలో రెండు శక్తులూ ఆవశ్యకములే. సాధకులు అవసరాన్ని బట్టి ఉపాసనను ఎన్నుకుంటారు.

**స్వార్థం సమాప్తం అయినప్పుడే శోక, దుఃఖ, నిరాశలు తొలగుతాయి.**

శక్తిసాధన సాంప్రదాయం యుగ యుగాలుగా అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంది. కానీ మన స్థితి మాత్రం యథాతథంగా ఉంటోంది. ఒక్కోసారి ఇంకా దిగజారుపోతున్నది. దీనికి కారణం కర్మకాండలో లోపమా? కాదు. మరి పరిస్థితి ఎందుకిలా ఉంది? మన ప్రవృత్తులు ఎందుకు పరిష్కరించబడడం లేదు? పరిశీలనగా చూస్తే అవగతమయ్యేదేమిటంటే – శక్తి సముపార్జన జరిగింది; కానీ సంయమ లోపం వల్ల సంపాదించిన శక్తి అంతా రంధ్రాల గుండా బయటకు పోయి నష్టమైపోయింది. దేన్ని పొందామో దాన్ని పోగొట్టుకున్నాము. ఎలా పోతోందో కూడ తెలియలేదు. తొమ్మిదిరోజులూ ఉపవాసం చేశాము. అస్వాద భోజనం చేశాము. శరీరాన్ని కరకు నేలపై పరుండబెట్టాము. శక్తిని కూడ పొందాము. కానీ సంయమనం లేకపోవడంతో – మనస్సులోని కన్నాల గుండా దాన్ని బయటకు పంపేశాము. ఎంతో కష్టపడి సంపాదించిన శక్తి ఒక్క క్షణం కూడ నిలవలేదు. శరీరాన్ని తపింపచేశాము. కానీ మనస్సు కుతంత్రాలు చేస్తూనే ఉంది. సదుపయోగం కాకముందే శక్తి మంచులా కరిగిపోయింది.

నవరాత్రులు మహా తపస్సు చేయదగిన మహా పర్వదినాలు. శక్తి సముపార్జనా, దాని సదుపయోగమూ – ఈ రెండింటి సంయోగం లేకపోతే, తపస్సు యొక్క ప్రక్రియ పూర్తి కానట్లే. తమ తమ ప్రవృత్తుల సంస్కరణలోనూ, శ్రేష్ఠ కార్యాల్ని చేయడంలోనూ శక్తి సదుపయోగమవుతుంది. శ్రేష్ఠమైన కార్యాలు చేయడంవల్ల మనస్సు నిర్మలమౌతుంది. ప్రాణరహితులలో ప్రాణాన్ని నింపడంవల్ల కూడ శక్తి సదుపయోగ మవుతుంది. మనవద్ద ఉన్న శక్తిలోని ప్రతి కణాన్నీ శ్రేష్ఠతకు ఉపయోగించాలి. ఈ సమయంలో ఆర్జించిన తపోశక్తిని సత్కర్మల ద్వారా సత్ప్రవృత్తులను పెంపొందించడానికి వినియోగించాలి. మంచి విషయాలను గురించి ఆలోచించాలి. ఆ సదాలోచనలను జీవితంలో అమలు చేయాలి. తపస్సు అనగా సత్కర్మలద్వారా సత్ప్రవృత్తులను వికసింపచేయడం.

నవరాత్రులలోని తొమ్మిది రోజులూ శక్తి సముపార్జన కొరకు తపస్సు చేయాల్సిన అవశ్యకత ఉంది. ఈ తపస్సు యొక్క ప్రథమ చరణం – సంయమనం కోసం మహాసాధన. రెండవది– మానసిక ఏకాగ్రతతో శక్తిని పొందడం. మూడవది – శ్రేష్ఠత దిశలో శక్తిని సదుపయోగం చేయడం. చెడు అలవాట్ల వల్ల శక్తి క్షీణిస్తుంది. ఇందుకు ఎవరికి వారే బాధ్యులు. శక్తియొక్క దురుపయోగం వల్ల మనం శక్తిశూన్యులమై, పతనావస్థలో పడిపోతాము.

నవరాత్రిలో తీసుకొనే సంకల్పంలో – ఈ పీడనూ, పతనాన్నీ నివారించగల శ్రేష్ఠ భావనను నింపుకోవాలి. తత్పరతతో దాన్ని పూర్తి చేయగల సాహసాన్ని కలుగచేసుకోవాలి. అలాంటపుడే నవరాత్రి సాధన సంకల్పం పరిపూర్ణమవుతుంది. ఫలశృతి కానవస్తుంది. మహా తపస్సు యొక్క సుగంధం మనస్సులోనూ, భావనలోనూ నిండి – విశిష్టమైన ఈ తొమ్మిది రోజుల్లో వ్యక్తిత్వం ఎంతో శక్తివంత మవుతుంది. చైత్ర మాసంలో వచ్చే నవరాత్రుల వరకు ఈ శక్తి ఉంటుంది.

ఇప్పుడు మన ప్రజ్ఞా పరిజనుల మనస్సు ఎంత దృఢంగా తయారయ్యిందంటే – వారు కర్మకాండకు ప్రాధాన్య మివ్వక, దాని కీలకం వైపు ఆకర్షితు లవుతున్నారు. మనమందరమూ శరీరం కొరకు అస్వాద వ్రతాన్నీ, మనస్సు పవిత్రత కొరకు సదాలోచననూ, భావన కొరకు సేవావ్రతాన్నీ సంపూర్ణంగా నిర్వహించి సాధన చేయాలి. సంపూర్ణమవడానికై – ఆర్జించిన శక్తిని సదుపయోగం చేయాలని పూర్ణాహుతి రోజున మరల సంకల్పం చేయాలి.

అనువాదం– కె.అరవిందమ్మ

★★★

**జాతి హితంకోసం శ్రమిస్తూ ఉండడమే దేవతల ఉపాసన.**

విశ్వకర్మ జయంతి వ్యాసం

# సృజనకు అధిదేవత విశ్వకర్మ

మహత్తరమైన శ్రమ సాధన, మహోదాత్తమైన సమర్పణ బుద్ధి – వీటి అద్భుత సంగమం విశ్వకర్మ జీవనం.

విశ్వకర్మ తన శ్రేష్ఠ కార్యాల ద్వారా శ్రమను సార్థకం చేశాడు. శ్రమయే యజ్ఞం. సాధనాలు, పరిశోధన దానికి ఉపకరణాలు. కౌశల్యం ఈ సాధన వల్ల వచ్చే ఫలితం. "**యోగః కర్మసు కౌశలమ్**". అనగా – పరిశ్రమ ద్వారా లభించే కౌశల్యమే యోగం.

సిద్ధిర్ భవతి కర్మజా. అనగా – శ్రేష్ఠమైన కర్మ చేయడం వల్ల సిద్ధి లభిస్తుంది. విశ్వకర్మ అతిశ్రేష్ఠమైన గుణాలకు ప్రతిరూపం. తపస్సు, సమర్పణ ఆయన జీవితంలో అంతర్భాగాలు.

## విశ్వకర్మ చూపిన సమాజ నిష్ఠ

విశ్వకర్మ కుమారుడు విశ్వరూపుడు (త్రిశిరుడు) తెలివిగలవాడు, బలవంతుడు, విద్వాంసుడు. అతడిని గురువుగా ప్రతిష్ఠించాలని దేవతలు అనుకున్నారు. విశ్వరూపుని పేరు ప్రతిష్టలు పెరగడంతో, ఇంద్రునికి అతనిపట్ల అసూయ కలిగింది. ఇంద్రుడు అతడిని మాయోపాయం ద్వారా చంపించాడు. విశ్వకర్మకు కోపం వచ్చింది. కసి తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో ఆయన ఘోర తపస్సు చేశాడు. ఫలితంగా – వృత్రుడు జనించాడు. అతడు బలశాలి, మహాయోధుడు. అయితే అసుర స్వభావం కలిగినవాడు. వృత్రాసురుడుగా పేరుపొందాడు. అతడి ఆగడాలను భరించలేక, దేవతలు బృహస్పతిని పరిష్కారం సూచించమని కోరారు. మహాతపస్వి అయిన దధీచి మహర్షి తన ఎముకలను దానం చేయాలనీ, వాటితో వజ్రాయుధం నిర్మాణం కావాలనీ, ఆ ఆయుధంతోనే వృత్రాసురుడి సంహారం సాధ్యపడుతుందని ఆయన చెప్పాడు.

అయితే, ఆ వజ్రాయుధాన్ని విశ్వకర్మ మాత్రమే నిర్మించగలుగుతాడు. దేవతలు దధీచినీ, విశ్వకర్మనూ కలిశారు. ఇద్దరూ ఆయా పనులకు తమ అంగీకారం తెలిపారు. ఆ విధంగా – విశ్వకర్మ తన కుమారుణ్ణి సంహరించే వజ్రాయుధాన్ని తానే నిర్మించాడు. సమాజ హితం కోసం తన పుత్ర ప్రేమను బలి ఇచ్చాడు. అలా – తన వివేకాన్నీ, కర్తవ్య నిష్ఠనూ నిరూపించాడు.

## విశ్వకర్మ యొక్క భౌమేన అవతారం

విశ్వకర్మ వివిధ యుగాలలో, వివిధ మన్వంతరాలలో అవతరించాడు. ఆయన ప్రముఖ అవతారం భౌమేన (భూమికి సంబంధించిన) అవతారం.

బ్రహ్మకు మానస పుత్రుడు ధర్మదేవ మహర్షి. ఆయనకు ఎనిమిదిమంది సంతానం – అష్ట వసువులు. వీరిలో ఎనిమిదవ వసువు ప్రభాసుడు. ఆయన కుమారుడు (భౌమేన) విశ్వకర్మ. విశ్వకర్మ తల్లి పేరు వరస్త్రీ. ఆమెను అంగిరా, భువనా అని కూడా పిలుస్తారు. ఆమె దేవగురువు బృహస్పతి సోదరి, అంగిరా ఋషి కుమార్తె.

భక్త ప్రహ్లాదుని కుమార్తె విశృతతో విశ్వకర్మ వివాహం జరిగింది.

## శిల్ప శాస్త్రానికి జన్మదాత

విశ్వకర్మ శిల్ప శాస్త్రానికి జన్మదాత.

కుబేరుని రాజధాని లంకను నిర్మించినవాడు విశ్వకర్మయే. ఆ తర్వాత రావణుడు లంకాపురాన్ని కుబేరుని నుండి లాగికొన్నాడు. కుబేరుడు అలకాపురిని రాజధానిగా చేసుకున్నాడు.

విశ్వకర్మ ఆగ్నేయాస్త్రాన్ని నిర్మాణం చేశాడు. ఇంద్రుని రాజధాని అమరావతిని సుమేరు పర్వతం మీద నిర్మించాడు.

**నిర్మలమైన బుద్ధితో చేసే స్వార్థరహిత కార్యమే యజ్ఞం.**

నందనవనాన్ని నిర్మించాడు.

త్రేతాయుగంలో విశ్వకర్మ కుమారులు నలుడూ, నీలుడూ లంకకు సేతువును నిర్మించారు.

ప్రాచీన ఇతిహాస గ్రంథాలలో విశ్వకర్మను ప్రజాపతి అనీ, ఆదిత్య దేవుడనీ, శిల్పి అనీ, త్రిదశాచార్య అనీ పిలిచారు.

విశ్వకర్మ వైదిక దేవతలలో ఒకరు (ఋగ్వేదం 10-122). పురాణాలు విశ్వకర్మను స్వాయంభువ మన్వంతరానికి శిల్ప ప్రజాపతిగా పేర్కొన్నాయి.

వేలాది సంవత్సరాల చరిత్ర ఉంది విశ్వకర్మకు. మరి - ఒక వ్యక్తి ఇన్నివేల సంవత్సరాలు ఎలా జీవించాడనే ప్రశ్న వస్తుంది. సమాధానం ఏమంటే - విశ్వకర్మ ఒక వ్యక్తి మాత్రమే కాదు; ఒక నిర్మాణాత్మక స్వరూపం, సమాజ హితం కోరే ఒక పరంపర.

బ్రహ్మదేవుని కోరిక మేరకు విశ్వకర్మ వివిధ సమయాలలో క్రొత్తక్రొత్త ఆవిష్కరణలు చేశాడు, నవీన ఉపకరణాలను తయారు చేశాడు. సౌరశక్తిని వినియోగించే శాస్త్రాన్ని నిర్మించాడు. ఆయన విష్ణుమూర్తి కోసం సుదర్శన చక్రాన్నీ, శివుని కోసం త్రిశూలాన్నీ, ఇంద్రుని కోసం విజయం అని పేరు కలిగిన రథాన్నీ, పుష్పక విమానాలనూ నిర్మాణం చేశాడు.

## విశ్వానికి మొట్టమొదటి ఇంజనీరు

విశ్వకర్మ మహా శిల్పి మాత్రమే కాదు. ఆయన విశ్వంలోని మొట్టమొదటి ఇంజనీరు; వాస్తు స్థాపత్య శాస్త్రాల నిర్మాత.

విశ్వకర్మ ప్రతిభ బహుముఖమైనది. ఆయన ఇంద్రలోకాన్నీ, పాతాళాన్నీ, కృష్ణ పరమాత్మకు ద్వారకా నగరాన్నీ బృందావనాన్నీ, ఇంద్రప్రస్థాన్నీ, హస్తినాపురాన్నీ నిర్మించాడు.

స్వావలంబన, సమృద్ధి కలిగిన గ్రామాలను నిర్మించే శాస్త్రాన్ని విశ్వకర్మ ఆవిష్కరించాడు.

మహాభారతం విశ్వకర్మను ఇలా వర్ణించింది-

**విశ్వకర్మన్ నమస్తేస్తు, విశ్వాత్మన్ విశ్వ సంభవ ।**
**అపవర్గోసి భూతానాం, పంచానాం పరతః స్థితః ॥**

(శాంతిపర్వం 47/85)

అనగా-

సృష్టిలోని అలౌకికమైన సృజన శక్తిని వ్యక్తీకరించే పరమ అద్వితీయ విరాట్ శక్తి స్వరూపానికి ప్రతీక విశ్వకర్మ.

నిర్గుణ రూపం నుండి ప్రకృతిలోని సృజనాత్మక శక్తి యొక్క వికాస ప్రక్రియనే 'విశ్వకర్మణ శక్తి' అని పేర్కొన్నారు. సగుణ రూపంలో ఈ శక్తి వివిధ యుగాలలో, మన్వంతరాలలో దేవ, మనుష్య, రాక్షస, గంధర్వ మున్నగు జన్మలుగా అవతరించింది.

భగవాన్ విశ్వకర్మ ప్రతిభ అలౌకికం.

## ప్రతిష్ఠానపుర నిర్మాణం

త్రేతాయుగం చివరలో భూగోళం జలమయం అయింది. అగస్త్య మహర్షి భూగోళాన్ని ఆ సముద్రం నుండి వెలికితీశాడు. భూమిమీద క్రమంగా వనస్పతులు (వృక్షాలు) పెరిగాయి. ఆనాడు భూమండలానికి మహారాజు సంవరణుడు. అతడి రాజధాని ప్రతిష్ఠానపురం (నేటి ఝూన్సీ, ప్రయాగ). సంవరణ మహారాజు బహుళ త్రయోదశి శుక్రవారం నాడు ప్రతిష్ఠానపురం వచ్చాడు. ఆయన విశ్వకర్మ సహకారంతో అయిదు యోజనాల (20 మైళ్ళు) వరకు విస్తరించిన భూభాగంలో ప్రతిష్ఠానపుర నగరాన్ని నిర్మించాడు. దాని శిథిలాలు ఉల్టా కిలా అనే పేరుతో త్రివేణీ సంగమం వద్ద నేటికీ కనిపిస్తాయి.

ఇతిహాస గ్రంథాలలోని మరో గాథ. శ్రీకృష్ణుని కుమారుడు సాంబునికి దూర్వాసుని శాపం వల్ల కుష్ఠు రోగం వచ్చింది. అతడు ఋషుల ఆశీస్సులతో మిత్రవనం (నేటి

**తనవంతు పనిచేయకుండా భోజనం కోరేవాడు దొంగ.**

ముల్తాన్ - పాకిస్తాన్‌లోనిది)లో సూర్య దేవాలయాన్ని నిర్మింపజేశాడు. ఆ ఆలయంలో సూర్య భగవానుని విగ్రహాన్ని విశ్వకర్మ నిర్మాణం చేశాడు. సూర్యుని కృపవల్ల సాంబుని రోగం నయమయింది.

## ప్రస్వాపన అస్త్ర నిర్మాణం

మరో పురాణ గాథ. భీష్ముడు తన తల్లి సత్యవతి కుమారుల కోసమై కాశీరాజు కూతుళ్లను జయించి తెచ్చాడు. వారిలో అంబ తన మనస్సులో భీష్ముడిని పతిగా స్వీకరించింది. ఆమె వివాహ ప్రస్తావన తెచ్చింది. భీష్ముడు నిరాకరించాడు. భీష్ముని గురువు పరశురామునికి అంబ ఫిర్యాదు చేసింది. అంబను పెళ్లి చేసుకో; లేదా, నాతో యుద్ధం చెయ్యి - అన్నాడు. పరశురాముడు భీష్మునితో. భీష్ముడు యుద్ధానికే సిద్ధపడ్డాడు. కురుక్షేత్ర మైదానంలో గురు శిష్యుల మధ్య యుద్ధం సాగింది. 23వ రోజున భీష్ముడు "ప్రస్వాపన అస్త్రాన్ని" సంధించాడు. బ్రహ్మాండం అంతా తల్లడిల్లిపోయింది. నారద మహర్షి వచ్చి యుద్ధాన్ని ముగింపజేశాడు. పరశురాముడు ఓటమిని అంగీకరించాడు. భయంకరమైన ఆ అస్త్రాన్ని నిర్మించిన వ్యక్తి విశ్వకర్మ.

## కపి ధ్వజ నిర్మాణం

ఇంద్రుని ఆజ్ఞ మేరకు - విశ్వకర్మ అర్జునుని రథానికి పెద్ద ధ్వజాన్ని నిర్మించాడు. దానిమీద హనుమంతుని చిత్రం ఉంది. ఆ ధ్వజం వల్ల రథం బరువు పెరగదు. ప్రయాణంలో చెట్ల కొమ్మలకు అది చిక్కుకోదు. మగధ రాజుకు గరుడ ధ్వజాన్ని కూడ విశ్వకర్మ నిర్మించాడు.

## సూర్యతేజంతో సుదర్శన చక్రం

విశ్వకర్మ కుమార్తె సంజ్ఞ సూర్యునికి భార్య. వారికి సంతానం ముగ్గురు - మను, యమ, యమి. కొంతకాలం తర్వాత సూర్యుని వేడిని భరించలేక సంజ్ఞ తపస్సు కోసం వనానికి వెళ్లిపోయింది. ఛాయను భర్త సేవకు నియమించింది. సూర్యుడు ఛాయను సంజ్ఞ అని అనుకున్నాడు. వారి సంతానం- శని, మను,తపతి. ఛాయ నిజం చెప్పేసరికి, సూర్యుడు సంజ్ఞను తిరిగి తెచ్చుకున్నాడు. సూర్యుని తేజస్సును శాంతింపజేయవలసిందిగా సంజ్ఞ తన తండ్రి విశ్వకర్మను కోరింది. విశ్వకర్మ అలా చేశాడు. అయితే ఆ తేజంలో ఎనిమిదవ వంతు మాత్రమే తగ్గించగలిగాడు. ఆ ఎనిమిదవ వంతు సూర్య తేజంతో విశ్వకర్మ సుదర్శన చక్రాన్నీ, త్రిశూలాన్నీ, కుబేరుని విమానాన్నీ, కార్తికేయుని శక్తినీ నిర్మాణం చేశాడు. విష్ణుపురాణం 2-11 శ్లోకాలలో ఈ గాథ వర్ణించబడింది.

విశ్వకర్మ లక్ష్మీదేవికి సమస్త ఆభరణాలనూ తయారు చేశాడు.

## కర్మయోగి

కృష్ణ పరమాత్మ భగవద్గీతలో ప్రబోధించిన నిష్కామ కర్మకు ప్రత్యక్ష ఉదాహరణ విశ్వకర్మ జీవితం. ఆయన అందరి కోసం నగరాలనూ , ఉపవనాలనూ, ఆభరణాలనూ, అస్త్రాలనూ నిర్మాణం చేశాడు. తన కర్తవ్యాన్ని పాటించాడు. తాను నిర్మాణం చేసినవాటిమీద రవంతయినా ఆసక్తి చూపలేదు. దేవతల ఆదేశాల మేరకు ఆయా నిర్మాణాలు చేయడం, ముందుకు పోవడం - ఇదే ఆయన జీవన క్రమం. ఇన్ని అద్భుత వస్తువులను నిర్మాణం చేశాననే అహంకారం ఆయనకు లేదు. ఆయన చేసినదంతా ఇతరుల కోసమే, తన కోసం కాదు.

## సృజనకు దేవత

విశ్వకర్మ సృజనకు దేవత. వికాసం, సృజన కొనసాగుతూన్నంతవరకు విశ్వకర్మ యొక్క మానసపుత్రులు మానవతా వికాస చరిత్రను లిఖిస్తూ ఉంటారు; మానవ సమాజం ఆయనకు ఋణపడి ఉంటుంది.

-అవధ్ కిశోర్

★★★

**పాండిత్య దర్పాన్ని వదలి పసివానిలా సరళంగా ఉండేవాడే బ్రాహ్మణుడు.**

## బోధ కథ

# అమృత పుత్రుడు

మన మృత్యువును మనమెవ్వరం చూడలేదు. చనిపోయినవారి శవాలను ఒకటి, రెండు అందరం చూసే ఉంటాము. శవయాత్రలో పాల్గొని ఉంటాము. కాని అతను మృత్యు తాండవం చూసాడు. ఆ మహా తాండవం అతనిని దాదాపు పిచ్చివాణ్ణి చేసింది.

అప్పుడు అతను ఒక యువకుడు. ఇప్పుడు కూడా యువకుడే. కాని అతని శరీరం మీద కన్నా మనసు మీద పడిన ప్రభావం వలన అతని వెంట్రుకలు పండిపోయాయి. ఇప్పుడు అతను ప్రౌఢ వ్యక్తిగా కనిపిస్తున్నాడు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కాక ముందు అతను ఒక కాలేజ్‌లో సైన్స్ విద్యార్థి. యుద్ధం ప్రారంభంకాగానే దేశంలోని యువకులందరూ తప్పనిసరిగా సైన్యంలో చేరాలని ఆదేశాలు వచ్చాయి. పుస్తకాలను వదిలి భుజాల మీద తుపాకీలు పట్టవలసి వచ్చింది. అతనిలాంటి వారిని కొందరిని ఒక నావలో ఇంగ్లండ్ తీరం నుండి యూరోప్ ముఖ్యభూమిలో దించారు.

ఉత్తేజం పొందటానికి ఒకే ఒక సహాయం. దేశభక్తి గీతాల శ్రవణం. పగలు, రాత్రి ఎండలో పరిగెత్తటం. తుపాకి గుండ్ల పొగలు, వాసన. ఆకాశంలో ఎగిరే విమానాల గరగరలు. వీటి మధ్యలో ఏదో ఒకటి కడుపులో పడేసుకోవటం. రాత్రిళ్ళు లోయల్లోని క్యాంప్‌లో కొంచెం సేపు కళ్ళుమూసుకోవటం – ఇవి వాళ్ళకి అలవాటయ్యాయి. పడుతూ లేస్తూ, ఆయుధాలు శుభ్రం చేస్తూ, తుపాకి నింపుతూ, లేకపోతే మార్చ్ చేస్తూ నవ్వుకోవటం, ఒకరిని ఒకరు ఆటపట్టించటం చేసేవారు. సమయం దొరికినప్పుడల్లా స్వదేశంలో తమకోసం ఎదురుచూస్తున్నవారికి ఉత్తరాలు వ్రాసేవారు.

అతను ఒక శిబిరం నుండి ఇంకో శిబిరానికి మారుతూ ఉండేవాడు. యుద్ధంలోకి వెళ్ళటానికే వచ్చాడు, అలాగే వెళ్ళాడు. శత్రువులు ఎక్కడున్నారో, ఎటువైపు ఉన్నారో తెలీదు. ఎత్తైన, లోతైన పొదలు ఉన్న అరణ్య ప్రాంతం అది. బాంబులు ప్రేలుతున్నాయి. తుపాకీలతో కాల్పులు జరుగుతున్నాయి. ఇటునుంచి కూడా రైఫిళ్లు మెషన్‌గన్‌లు నిరంతరంగా మంటలు వెలువరిస్తూనే ఉన్నాయి.

అతని సహచరుని చేయి బాంబు విస్ఫోటనంలో పోయింది. ఇంకో సైనికుని చెవికి తుపాకి తగిలి అతను చెవిటి వాడయ్యాడు. యుద్ధ సమయంలో ఇవన్నీ చూడటానికి అవకాశం ఉండదు. వారు పొదలను అడ్డం పెట్టుకొని ముందుకి వెళ్ళసాగారు. ఒక్కోసారి ప్రాకటం, లేచి పరిగెత్తటం, కొంచెంసేపు పడుకోవటం చేసేవారు.

ఒకసారి శత్రువులు పారిపోయారని తోచింది. ఎవరూ పరిగెత్తుతూ కనిపించలేదు. ఎదుటి నుండి కాల్పులు జరగకపోవటం వలన, ముందుకు వెళ్ళటానికి అవకాశం దొరకటం వలన శత్రువులు పారిపోయారని అనిపించింది. శత్రువులు ఎవరినీ తను ఎప్పుడూ చూడలేదు. ఏ పరిచయమూ లేదు. వారు తనకి ఏ అన్యాయం చెయ్యలేదు. కాని వారు ఇప్పుడు ఘోరమైన శత్రువులు ఎలా అయ్యారు? అసలు అలా ఆలోచించటం కూడా దేశద్రోహమే.

శత్రువులు కొంత విరామం ఇచ్చారు. ఇటువైపు నాయకులు కొన్ని ఆలోచనలు చేసారు. రెండు ట్రక్కుల నిండా మరో దళం సైనికులను తెచ్చారు. వాళ్ళు రోజంతా ఆ ప్రాంతంలో ఏం చేస్తున్నారో అర్థం కాలేదు. సన్నని కాలువలు త్రవ్వారు. కొన్ని త్రాళ్ళు కట్టడం, ఇంకా ఏదో చేయసాగారు. కాని అవన్నీ తెలుసుకోవడానికి, చూడటానికి అవకాశం కాని అధికారం కానీ లేదు, ఆసక్తి కూడా లేదు. రైఫిల్ దగ్గర పెట్టుకోడానికి కూడా అతనికి అనుమతి లేదు. చెవుల్లో నిరంతరం గుండ్లు పేలిన శబ్దం, వాటినుండి వచ్చే పొగ – అంతే.

**మానవ జీవితానికి పరమ పురుషార్థం – నికృష్ట మనస్తత్వాన్ని వదులుకోవడం.**

రాత్రి చీకటి పడింది. లోయల్లో మోకాళ్ళ మీద బురదలో నిలబడాల్సి వస్తోంది. దోమలు నరకం చూపించాయి. ఒక్కోసారి బయటకు వచ్చి శత్రువులను ఎదుర్కోవాలని ఆదేశాలు వస్తే ఎంతో సంతోషపడేవాడు. ఎందుకంటే అతనికి ఈ జీవితంకంటే మరణమే ఇష్టంగా ఉంది.

బహుశా శత్రువులకు వారి గురించి సమాచారం అంది ఉంటుంది. శత్రువుల నుంచి కాల్పులు ఎక్కువవసాగాయి. శత్రుసైనికుల శబ్దాలు వినిపిస్తున్నాయి. బహుశా వారు ముందులోయని ఆక్రమించి ఉంటారు. కొన్ని నిముషాల తర్వాత శత్రువులలో ఒక భాగం వీరి లోయకు దగ్గరగా వచ్చింది. అక్కడ రెండు వైపులవారూ ఇష్టం వచ్చినట్లు కాల్పులు జరిపారు.

"నీళ్ళు! రెండు చుక్కలు నీళ్ళు! హెన్రీ" – అంటూ దీనస్వరం అతనికి దగ్గరగా వినపడింది. అతను వంగి నీళ్ళసీసా తీసి క్రిందకు చూసాడు. గుండు తగలటంతో అతని తోటివాడు లోయలో బురదలో పడి ఉన్నాడు. నీళ్ళ కోసం తపిస్తున్నాడు.

మొత్తం భూమి కంపించిన ట్లనిపించింది. అతని అరుపుతో దిక్కులు పిక్కటిల్లాయి. లోయ బయట నుండి తుపాకీ గుండ్ల వర్షం అతని తల మీదుగా పోసాగింది. మొత్తం డ్రస్ అంతా వెచ్చటి జిగురు పదార్థంతో తడిసిపోయింది. ఎవరికైతే అతను నీళ్ళివ్వటానికి వంగాడో, అతను దాహపు హద్దులు దాటిపోయాడు. లోయలోని ఇతర సైనికులకు అతని ఆలోచనే లేదు. వాళ్ళు రైఫిల్ బయటకు తీసి ఒక వైపుకి పరిగెత్తారు.

చీకట్లో శవాలు తలగటం. రక్తంతో కలసిన బురద. తెగి చెల్లాచెదురుగా శరీర భాగాలు కాలికి తగలటం... కాని రాత్రి కంటే దారుణంగా ఉంది పగటి వెలుతురు. ఆ వెలుతురులో అతను చూసింది... చుట్టూ మాంసపు గుట్ట. కనుచూపు మేరలో అంతా రక్తం. అందులో పురుగులు. రైఫిల్స్, మెషన్‌గన్‌లు చెల్లా చెదురుగా పడిఉన్నాయి. చెవుల్లో ఆక్రందనలు మారుమ్రోగుతూనే ఉన్నాయి.

అతను పిచ్చివాడయ్యాడు. అతని దగ్గర సామాగ్రి ఉన్నంతవరకు ఆ ఆక్రందనల దగ్గరికి వెళ్ళి భయపడుతూనే వాళ్ళ మృత్యుబాధను శాంతింపచేస్తూ వెళ్ళసాగాడు. మొత్తం మైదానం అంతటా శవాలు పడి ఉన్నాయి. స్వపర భేధం ఎక్కడిది? అందరి శరీర భాగాలు ఉన్నాయక్కడ. అతని దగ్గర సామాగ్రి అయిపోయింది. అతను ముందుకు పడి, క్రిందపడి మూర్ఛపోయాడు.

దీర్ఘమూర్ఛ నుండి ఒక ఆస్పత్రిలో కోలుకున్నాడు. అతనిని యుద్ధభూమి నుండి వైద్యశాలకు, అక్కడి నుండి ఇంగ్లండ్‌కి పంపించారు. వాళ్ళు అతనిని పిచ్చివాడుగా ప్రకటించారు. కావున అతను కారాగారంలో గడపవలసి వచ్చింది. యుద్ధ సమయాల్లో మతి తప్పిన వారిని – ఎలాంటి విషయాలు బయటకు చెప్తారో అని – స్వతంత్రంగా వదలరు. కాని యుద్ధం పూర్తయిన తర్వాత అతనికి ఇంటికి వెళ్ళటానికి స్వతంత్రం లభించింది.

"నాకు చావాలని లేదు. వాళ్ళు అందరినీ చంపేస్తారు. నన్ను కాపాడండి. నాకు మృత్యువు నుండి బయటపడే మార్గం చెప్పండి" – ఇదే హెన్రీ పిచ్చి. సైన్యం మళ్ళీ యుద్ధం చేస్తుంది; తాను చూసిన బీభత్సం నగరంలో కూడా జరుగుతుంది – అనుకుంటున్నాడు. ఇప్పుడు అమరత్వాన్ని అతనికి ఎవరిస్తారు?

మృత్యువు నుండి బయటపడే మార్గం చెప్పమని అనేక చర్చిల చుట్టూ తిరిగాడు. లార్డ్ బిషప్‌ను కూడా ఏడుస్తూ అడిగాడు. కాని అతని మాటలు ఎవరూ వినలేదు. పిచ్చివాడి మాటలు ఎవరు వింటారు? విన్నా ఎవరైనా ఏం చేయగలరు? మృత్యువు నుండి బయటపడే మార్గం ఎవరి దగ్గరుంది?

"మృత్యువు నుండి బయటపడే మార్గం ఉంది." ఒక భారతీయ కాషాయవస్త్రధారి ఈ మాటలు చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆ సాధువు సభలో ఏదో చెప్పటానికి నిలబడి ''అమర పుత్రులారా'' అని సంబోధించగానే, హెన్రీ పరిగెత్తుకుంటూ స్టేజి మీదకు వెళ్ళి ఆ సాధువు చేతులు పట్టుకున్నాడు. ఆర్ద్రమైన స్వరంతో, "నాకు మృత్యువు నుండి బయటపడే మార్గం చెప్పండి. ఆ ఉపాయం మీ దగ్గర ఉందా?" అని అడిగాడు. "నువ్వు భారతదేశానికి రావలసి ఉంటుంది" –

**వైఫల్యం నేరం కాదు. ఉద్దేశ్యం వంకరగా ఉండడం నేరం.**

అని ఆ సాధువు చెప్పాడు. ఆయన రామకృష్ణ మిషన్‌కు చెందినవాడు. ఆయన అతనిని తన గురువు స్వామి బ్రహ్మానంద దగ్గరకు తీసుకుని వెళ్ళాలనుకున్నారు.

"నేను ఎక్కడికైనా వస్తాను. ఏం చెయ్యమన్నా చేస్తాను" – అని హెన్రీ దృఢంగా అన్నాడు. సాధువు ఆదేశం మేరకు స్టేజి దిగి నిశ్శబ్దంగా ప్రవచనం వింటూ కూర్చున్నాడు. ప్రసంగం పూర్తికాగానే హెన్రీ సాధువు వెంటబడ్డాడు. ఇప్పుడు అతను సాధువుని ఎలా వదిలి పెట్టగలడు? నివాసస్థానానికి రాగానే సాధువు హెన్రీని అడిగాడు – నీవెవరు ?

"నేను హెన్రీ విల్సన్" – అని సూటిగా సమాధానం చెప్పాడు. "కానీ హెన్రీ విల్సన్ ఎవరు?" సాధువు అర్థమయ్యేలా "నీ వ్రేలు కోస్తే ఆ కోసిన వ్రేలు కూడా హెన్రీ విల్సనేనా" అని అడిగాడు.

"అది కేవలం హెన్రీ విల్సన్ వేలు అవుతుంది." హెన్రీ సైన్సు విద్యార్థి. శరీరం హెన్రీ విల్సన్ కాదని, అది కేవలం హెన్రీ విల్సన్ శరీరం మాత్రమే అని అతను వెంటనే అర్థం చేసుకున్నాడు.

"శరీరం హెన్రీవిల్సన్‌ది కాదు" సాధువు కొత్త మాట లేవనెత్తాడు. తెలివైన హెన్రీ ఆశ్చర్యపడ్డాడు. కొంచెం సేపటిలోనే అది కూడా అర్థం చేసుకున్నాడు. రొట్టెలు బియ్యం, వెన్న మొదలైన వాటితో తయారైన ఈ శరీరం బాల్యంలో ఒక రకంగాను ఇప్పుడు ఒక రకంగాను ఉన్నది. తనదెలా అవుతుంది?

"ప్లేట్‌లో పెట్టిన వెన్న వెన్న. అది పొట్టలోకి వెళ్ళగానే హెన్రీ విల్సనా?" సాధువు అడిగాడు, "అయితే మరుగుదొడ్లో పొట్టలో నుండి వచ్చే చెడు కూడా హెన్రీ విల్సనే. అవునా? కాదా?"

"నేను పెద్ద మూర్ఖుడిని" – అని పగలబడి నవ్వాడు హెన్రీ. ఆ మతి తప్పినవాడు గంతులు వేయసాగాడు.

"ఏది హెన్రీ కాదో, ఏది హెన్రీది కాదో దాని చావు బ్రతుకుల గురించిన బాధ హెన్రీకి ఎందుకు?" సాధువు ముఖ్య ప్రశ్న దగ్గరికి వచ్చాడు. అది మరణిస్తుంది. దానిని మృత్యువు నుండి రక్షించలేము.

"దానిని చావనీ" – హెన్రీ ప్రసన్నంగా చెప్పాడు. అతని ప్రసన్నత క్షణికం కాదు. మృత్యు భయం నుండి తనకు తాను ముక్తి పొందాడు అతను.

'హెన్రీ విల్సన్‌కి మృత్యువు నుండి రక్షిస్తానని మాట ఇచ్చాను. ఆ మాటమీదే నిలబడతాను' – సాధువు తీక్షణంగా అన్నాడు.

"మీరు హెన్రీకి మృత్యువు నుండి బయటపడే మార్గం చెప్పండి" – అన్నాడు హెన్రీ.

"హెన్రీ ఎప్పటికీ చావడు. అతనిని ఎవరూ చంపలేరు. అతను అమృతపుత్రుడు." – సాధువు చెప్పాడు.

"అమృత పుత్రుడా" హెన్రీకి అర్థంకాలేదు. అది అంత సామాన్యమైన సరళమైన విషయం కాదు కదా వెంటనే అర్థం చేసుకోవటానికి.

"హెన్రీ ఎవరు?" కొన్ని క్షణాలు ఆగి హెన్రీయే అడిగాడు. అతను గంభీరంగా ఉన్నాడు. ఆలోచిస్తున్నాడు. "వద్దు. ఈ రోజు నన్ను ఆలోచించనివ్వండి. నేను మళ్ళీ మీ దగ్గరకు వస్తాను." సాధువుని మాట్లాడనివ్వలేదు. అతను లేచి నిలబడ్డాడు. వెళ్ళబోతూ "మీరు నిజమే చెప్పారు. నేను భారతదేశానికి వెళ్ళవలసిందే. అమరత్వ సందేశం ఏ భూమి నుండి వచ్చిందో అక్కడే దానిని పొందగలుగుతాను." – అన్నాడు.

హెన్రీ భారత్‌కు వచ్చాడు. అతను సాధువుని కలవలేదు. కాని ఉత్తరాఖండ ప్రాంతంలో అతను ఒక సాధారణ భారతీయ సాధువు వేషంలో కనిపించాడు. ఎల్లప్పుడూ ప్రసన్నంగా సంతోషంగా కనిపిస్తున్నాడు. అతను "అమృత పుత్రుడు" కదా!

– అనువాదం : ఎమ్.సుజాత

★★★

**దేవతకు ఇవ్వగలిగే వస్తువు ఒకే ఒకటి – దేవత్వం.**

## మహిళా జాగరణ

# మాతృమూర్తిగా మహిళ

### యత్ర నార్యస్తు పూజ్యంతే రమన్తే తత్రదేవతాః

ఎక్కడ స్త్రీలను పూజిస్తే అక్కడ దేవతలు సంతోషిస్తారని అర్థం. ఏ కుటుంబంలో, ఏ దేశంలో, ఏ జాతిలో స్త్రీలను గౌరవిస్తారో అక్కడ దేవతలు సంతోషిస్తారన్నమాట! ఒక మూలికలో ఎన్నో ఓషధీ గుణాలున్నట్లు – సంస్కృతంలో ఒక పదానికి అనేక అర్థాలుంటాయి. రమ్ ధాతువునకు సంతుష్టులగుట, ప్రసన్నులగుట, ఆడుట, భోగించుట, ఉండుట అని అర్థం చెప్పుకోవచ్చు. అపుడు స్త్రీలు గౌరవించబడిన చోట దేవతలు సంతృప్తి పడతారు, లేక దేవతలు ఉంటారు, దేవతలు ప్రసన్నులౌతారు, దేవతలు క్రీడిస్తారు – ఇలా చెప్పుకోవచ్చు. మానవులే కాక దేవతలు కూడా సంతోషించారంటే ఆ స్త్రీ ఎంతటి సౌజన్యశీల, సుగుణాల బాల. వందనీయ స్త్రీమూర్తి మన కళ్లముందు సాక్షాత్కరించక మానదు. అసలు నారి అంటే శత్రువులు లేనిదని చెప్తారు. అంటే అజాత శత్రువన్నమాట. అలాగే నారీ శబ్దానికి సార్థకురాలని కూడ చెప్పుకోవా లిక్కడ.

పై వాక్యంలో 'పూజ్యంతే' అన్నాడు మనువు. మనం భగవంతుని పూజించేటపుడు ఎలాటి భక్తి శ్రద్ధలు, ఆరాధనాభావం కలిగి ఉంటామో స్త్రీలయందు అలాంటి భావం కలిగి ఉండాలని, మనకు శుభం కలగాలని, కలిగిస్తాదని, భగవంతుని ఎంత విశ్వసిస్తామో, అంత విశ్వాసం స్త్రీ ఆరాధనా సమయంలో చూపాలని కూడా మనం గ్రహించాలి. కాని పూలు పత్రితో పూజించటమని కాదిక్కడ. పూజలందుకొనుటకు అర్హురాలు. అంతటి అర్హత ఆరాధనా భావం కలిగించే స్త్రీ, అందరిచేత పూజింపబడే స్త్రీ ఎంతటి ఉత్కృష్టురాలు అని వివేచన చేయగల్గితే ఆ సుగుణాలు దర్శించగలిగితే – అసంకల్పంగా చేతులు జోడించకుండా ఉండలేం!

### స్త్రీతత్త్వం పాంచభౌతికం

అసలు స్త్రీ అంటే సత్వరజస్తమో గుణాలతో కూడి ఆకారం దాల్చిన మూర్తే కాదు. మూల ప్రకృతికి ప్రతి రూపం కూడా. "ఏకోహం బహుసామ్య" అని వేదవాక్యం. ఒకటి నుండి అనేకం అనేమాట సృష్టి మూలం నుండి ఉంది. పరమాత్మ మొదట మూల ప్రకృతిని సృష్టించి ఒకటి నుండి అనేకం సృజించే శక్తిని కల్పించాడు. తనలాంటి తత్త్వాలను తయారు చేసే శక్తిని త్రిగుణాత్మకంగా చేసి తన సత్ చిత్ ఆనంద తత్త్వాలకు ప్రతీకగా చేశాడు. పరమేశ్వరుడు సర్వశక్తి సంపన్నుడు. అంటే ఏ పనైనా చెయ్యగలడు. అయినప్పటికీ సృష్టి పాలన విషయంలో ప్రకృతి మాధ్యమంగానే చేయబూనాడు. ప్రకృతి నుల్లంఘించి ఏదీ చెయ్యలేదు. సృజనశీలయైన ప్రకృతి నుండే త్రిభువనములు, పధ్నాలుగు లోకములు, అఖిల బ్రహ్మాండం ఆవిర్భవించాయి. అటువంటి మూల ప్రకృతి యొక్క అద్భుత స్వరూపమే నారి. త్రిగుణాత్మకమైన స్త్రీ తమోగుణము నుండి సృజనశక్తి, రజోగుణముతో పాలన పోషణ, సత్త్వగుణము నుండి సంస్కారారాధనలు కలిగి ఉంది. ప్రకృతి వలె ఆమె తన నుండి అనేక రూపాలను సృష్టించగలదు. ధారణ పోషణాదులు భారతీయ స్త్రీ యొక్క ఉత్కృష్ట గుణాలు. ఈ సుగుణాల వల్ల ధర్మస్వరూపిణిగా చెప్పబడింది. పంచభూతాల శబ్ద స్పర్శ రూప రసగంధాదిక తత్త్వాలను గ్రహించిన స్త్రీ భూమి యొక్క ధర్మము వెలుగు, వాయువు వలన ప్రాణాధారము, జలము నుండి జీవన నిర్వహణ, ఆకసము నుండి సర్వవ్యాపకత్వము అన్ని లక్షణాలను కలిగి ఉంది. పంచభూతాలు వాటి ధర్మాన్ని క్షణకాలం ఏమరితే సృష్టిలో కల్లోలమైనట్లే – పంచభూతాల తత్త్వాన్ని గ్రహించిన స్త్రీ కూడా తన ధర్మాన్ని త్యజిస్తే జనత కల్లోలమవక తప్పదు.

**స్వర్గం దృక్పథంలో ఉంది. ఆలోచించే ఒక పద్ధతి అది.**

"వాయుఃవాతి యద్భయాత్

సూర్యఃతపతి యద్భయాత్"

అన్నమాట ప్రమాణంగా - సూర్యచంద్రాదులు, భూమ్యాకాశాలు ధర్మనిష్ఠతో చరిస్తున్నాయి. 'నీరు పల్లమెరుగు' అన్నది దాని ధర్మం. మనం దాన్ని పైపులతో బంధించి పైకెక్కించినా, విద్యుత్తు ఉన్నంతవరకే అది పని చేస్తుంది. ఆ తర్వాత పల్లంలోనికి జారిపోతుంది. అలాగే చల్లదనం దాని సహజగుణం. ఎంత మరిగించినా కొంతసేపటికి తిరిగి శీతలత్వాన్నే పొందుతుంది. అలాగే స్త్రీ కూడా తన సహజ సౌశీల్య గుణాలతో, ధర్మనిష్ఠతో పూజనీయగా చెప్పబడింది.

## మాతృస్థానంలో స్త్రీ

మన సంస్కృతిలో మాతృశబ్దానికి మహత్తరమైన విలువ ఉంది. 'మాతృదేవోభవ' అంటూ వేదాలు 'నమాతుః పరదైవతమ్' అంటూ శాస్త్రాలు తల్లికి దైవత్వాన్నిచ్చి శ్లాఘించాయి. అంతే కాదు. ప్రపంచ దేశాలన్నింటిలోనూ ఒక్క భారతదేశంలో మాత్రమే మాతృభూమి అని పిలుస్తున్నాం. అంటే దేశాన్ని కూడా స్త్రీ మూర్తిగా, కన్నతల్లిగా భావించే సంస్కృతికి వారసులం మనం. జన్మనిచ్చిన తల్లిని, జన్మించిన భూమిని స్వర్గము కంటే మిన్నగా చెప్పుకోవటం మన సంప్రదాయం.

తల్లి ఒడిలో తలదూర్చిన సుఖము, జన్మభూమి ఒడిలో తలవాల్చిన తృప్తి స్వర్గ భోగాలకంటే మిన్నగా భావించే సంస్కారం మనకుంది. అలాగే మాట్లాడే భాషను మాతృభాష అంటాము. ఇలా సంస్కృతిలో సాహిత్యంలో కూడా విశిష్టతను సంతరించుకున్న మాతృస్థానం మహిళకు పెట్టని ఆభరణం. అందుకే ప్రతి స్త్రీని అమ్మా అని పిల్చుకోవటం మన సంప్రదాయం. బిడ్డను కూడా తండ్రి అమ్మా అనే పిలుస్తాడు. అక్క, చెల్లి, వదినె అందరూ కన్నతల్లి ప్రతిరూపాలే! అంతే కాదు

గురుపత్నీ రాజపత్నీ జ్యేష్ఠపత్నీ తథైవ చ ।

పత్నీమాత స్వమాత చ పంచైతాః మాతరఃస్మృరితా ॥

అన్నారు. అంటే గురువు భార్య, రాజు భార్య, అన్న భార్య, భార్యతల్లి, తనతల్లి, ఈ ఐదుగురూ కన్నతల్లులుగా గౌరవించవలసినవారని అర్థం. అంతే కాదు. సృష్టిలో ప్రతిప్రాణిని తల్లిగా అభిమానించటం పరిపాటి. గోమాత, భూమాత, గంగామాత అంటూ ఉంటాం మరి.

మాతృ స్థానానికి అంత విశిష్టత ఎలా వచ్చిందంటే ఆమె సుగుణ ఖని కనుక. స్నేహం దయ కరుణ ప్రేమ త్యాగం లాంటి సుగుణాలామెకు సహజాతములు. స్వయంప్రేరకాలు. ఇవి ఒకరు చెప్తే, లేక ఇతరులు నేర్పితే వచ్చేవి కావన్నది సుస్పష్టం. అందుకు మన పురాణేతిహాసాలే నిదర్శనం.

భారతంలో త్యాగానికి ప్రతీకగా కుంతి, సహనానికి పరాకాష్టగా ద్రౌపది కనిపిస్తారు. లక్క ఇల్లు నుండి బయటపడిన పాండవులు ప్రచ్ఛన్న వేషాలతో ఏకచక్రపురంలో భిక్షాటనతో కాలం గడుపుతున్న సమయంలో ఆ ఊరిని బకాసురుడనే రాక్షసుడు పీడించసాగాడు. అతని కాహారంగా రోజూ ఒక్కో ఇంటి నుండి ఒక వ్యక్తి, బండెడన్నము, రెండు దున్నపోతుల్ని పంపించే విధంగా నియమ మేర్పరచుకున్నారు. ఒకరోజు వంతు ప్రకారం తమ ఒక్కగానొక్క పుత్రుణ్ణి పంపలేక దుఃఖిస్తున్న బ్రాహ్మణ దంపతుల్ని చూసిన కుంతి, వారిని ఊరడించి, మీ పుత్రునికి బదులుగా నా కుమారుని పంపుతాను. మీకు ఏకైక సంతానం కనుక అతని ఎడబాటు సహించలేనిది. నాకు ఐదుగురు సంతానం కనుక ఒకరిని మీ కుమారునికి బదులుగా బకాసురుని కాహారంగా పంపుతాను. నా కుమారుడతడిని చంపితే మీ ఊరిపీడ వదిలిపోతుంది. లేదంటే నాకు నలుగురు కుమారులు అనుకుంటాను - అంటుంది వారితో. "పరార్థక ఫలాగుణాః" అన్నారందుకే! ఇతరులకు మేలు చేయటం వల్ల కలిగే తృప్తినే ఫలితంగా కోరుతుంది కాని అన్య ఫలాపేక్ష లేని త్యాగమామెది.

**ఆంతరిక స్థాయిని సంస్కరించుకోవడమే మహత్తర తప సాధన.**

అలాగే ఉపపాండవుల మరణ వార్త విని దుఃఖిస్తున్న ద్రౌపదితో అశ్వత్థామను హతమారుస్తానంటాడు పాండవ మధ్యముడు. నాకు కలిగిన పుత్రశోకాన్ని మరొకరికి కలిగించటం సహించలేను, వద్దని వారిస్తుంది ద్రౌపది. ఎంతటి సహనశీలి! అప్పుడెప్పుడో కాదు ఈ యుగంలో కూడా ఉన్నారలాంటి త్యాగ సహనమూర్తులు. వారిలో దాసి పన్నా కథ తెలియని వారుండరు.

మేవాడ్ రాణి కర్మావతి అంతరంగిక దాసి పన్నా. రాకుమారుడైన ఉదయ్‌సింగ్‌ను తన కన్నబిడ్డ చందన్‌తో సమానంగా పెంచుతున్నది. మేవాడ్ సింహాసనా న్నధిష్టించిన రాణా విక్రమాదిత్య కోపిష్టి, అహంభావి కావటంతో మంత్రులు సేనాయోధులు వలసపోతున్నారు. ఆ సమయంలో బహదూర్‌షా దండయాత్ర సాగించాడు. అపుడు రాణి కర్మావతి అందరిని సమావేశపరచి, దేశం కోసం, ధర్మం కోసం మీరంతా కత్తిపట్టండంటూ ప్రబోధించింది. రాజపుత్ర వీరులంతా యుద్ధానికి సిద్ధపడ్డారు. అయితే యుద్ధం చేస్తున్న సమయంలో రాణా విక్రమాదిత్య అక్క దుండకూడదని షరతు పెట్టారు. అపుడు రాణి కర్మావతి విక్రమాదిత్యను, ఉదయ్‌సింగ్‌ను పన్నావెంట బుందీ ప్రాంతానికి పంపింది. పన్నా తన కొడుకు చందన్‌తో బాటు ఉదయ్‌సింగ్‌ను కంటికి రెప్పలా కాపాడుతోంది. లక్షల సైన్యంతో వచ్చిన బహదూర్‌షా ముందు, మేవాడ్ సైన్యం గెలవలేకపోయింది. ఆ అవమానాన్ని భరించలేక రాణి కర్మావతి ఆత్మాహుతి చేసుకుంది - తన బిడ్డల రక్షణ బాధ్యత పన్నా కప్పగించానన్న తృప్తితో. బహదూర్‌షా సంపదనంతా దోచుకుని కోట వదలిపోయాక పన్నా విక్రమాదిత్య, ఉదయ్‌సింగ్, చందన్‌లతో మేవాడ్ చేరింది. ఇంత జరిగినా రాణా బాధ్యతలు పట్టించుకోలేక తన తండ్రి రాజ్య బహిష్కరణ చేసిన బన్‌వీర్‌ను తిరిగి రాజ్యానికి రప్పించాడు. కుటిలుడైన బన్‌వీర్ ఒకరోజు రాత్రి రాణా విక్రమాదిత్యను మభ్యపెట్టి తన మందిరంలోకి తీసుకువెళ్లి హత్య చేశాడు. యువరాజు ఉదయ్‌సింగ్‌ను కూడా హతం చేస్తే శత్రుశేషం ఉండదని అదే కత్తితో అతివేగంగా పన్నా ఉంటున్న భవనంవైపు బయల్దేరాడు. మరోదాసి ద్వారా ముందుగా ఈ విషయం తెలుసుకున్న పన్నా ఎలాగైనా మేవాడ్ యువరాజును రక్షించాలనుకుంది. కాని అంత తక్కువ సమయంలో ఎలా బయటపడాలో తోచలేదు. వేగంగా ఆలోచించి నిలువెత్తు పండ్లబుట్టలను రెండింటిని తెప్పించి ఒకదానిలో అడుగున ఉదయ్‌సింగ్‌ను కూర్చోబెట్టి పైన పండ్లు కప్పింది. ఆ బుట్టలను రహస్య మార్గం గుండా నమ్మకస్తులైన సైనికులకు ఇచ్చి పంపించింది. ఉదయ్‌సింగ్‌కు కప్పిన పట్టుదుప్పటి తీసి తన కుమారుడైన చందన్‌కు కప్పింది. ఆవేశంగా వచ్చిన బన్‌వీర్ మంచంపై ఉన్న బిడ్డను కత్తికెర వేసి వికటంగా నవ్వుకుంటూ వెళ్లిపోయాడు. తన కళ్ల ముందే తన కొడుకును నరికివేస్తుంటే బాధతో విలవిలలాడుతున్న పన్నా మనసు నదిమి పట్టుకుని నిశ్శబ్దంగా ఉండిపోయింది. తనేడిస్తే చంపింది తన కొడుకునని తెలిస్తే అతను యువరాజు కోసం గాలిస్తాడేమోనని మౌనంగానే రోదించిందా తల్లి మనసు. ఆ తర్వాత ఆ బిడ్డను పెంచి పెద్ద చేసి, అణువణువునా దేశభక్తి నూరిపోసి, కణకణాన స్వతంత్ర భావాన్ని నింపింది. కనుకనే అతడు మేవాడ్‌కు స్వాతంత్ర్యం సాధించగలిగాడు. స్వామిభక్తి కోసం కన్నబిడ్డనే బలి ఇవ్వగలిగిన త్యాగశీలి పన్నా! సుగుణాలకు పేద గొప్పా చిన్నా పెద్దా తేడాలుండవని నిరూపించిన నిర్మలహృదయి. అందుకే-

నాస్తి మాతృసమో స్నేహః నాస్తి మాతృసమో సుఖం ।
నాస్తి మాతృసమో దైవం, ఇహలోకే పరత్ర చ ॥

అన్నారు. ఈ లోకములో పరలోకములో కూడా తల్లిని మించి ప్రేమించేవారు లేరు. తల్లి చెంత ఉండటం కంటే వేరే సుఖం లేదు. తల్లితో సమానమైన దైవము లేదు - అని అర్థం. దైవం కంటే తల్లే గొప్పదట. నిజమే. మన కాపదలు వచ్చినపుడు దైవం కాపాడాలనుకుంటాం. కాని తల్లి అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుతుంది.

★★★

**ఆదర్శాల అనుశాసనంలో తనను తాను బంధించుకున్న వ్యక్తి నిజమైన కర్మయోగి.**

మనం - మన ఆరోగ్యం

# ప్రకృతి నియమాల ఉల్లంఘన ప్రమాదభరితం

భగవంతుడు మానవ శరీరాన్ని నిర్మించదలచి నప్పుడు ముందుగా దానికి కలిగే కష్ట నష్టాల గురించి ప్రత్యేక శ్రద్ధ చూపించాడు. అందుకు బుజువుగా దానికి విలక్షణమైన శక్తి యుక్తులను ప్రదానం చేశాడు. ఈ దేహంలో జరిగే మార్పులను, సమస్యలను దేని మీదా ఆధారపడకుండా తానే స్వయంగా పరిష్కరించుకోగల రకరకాల తంత్రములను, సామర్థ్యములను ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలోనే శరీరానికి ఆయన శక్తివంతమైన, సర్వసమర్థత గల రక్షణా తంత్రాన్ని కూడా పొందుపరచాడు. దీనివలన అనేక రకాల జీవాణు - రోగాణువుల నుండి అది తన్ను తాను రక్షించుకొంటూ ఆరోగ్యంగా, రోగరహితంగా మనగలుగుతుంది. ఈ వ్యూహ ప్రక్రియ విలక్షణమైనది. ఇందులో ఒక ముఖ్యమైన రక్షణా ప్రణాళికకు అంతర్గతంగా అనేక చిన్నా-పెద్ద రక్షణ శాఖలుంటాయి. ఎందుకంటే రోగమనే శత్రువు ఒకదాని నుండి తప్పించుకున్నా మరొకదాని వలలో చిక్కక తప్పదు. దానివలన అది శరీరానికి ఏ విధమైన నష్టం కలిగించలేదు.

ఈ రక్షణా వ్యూహం-ఇమ్యూన్ సిస్టమ్ - బిడ్డ గర్భంలో ఉన్నప్పుడే ఆరంభ మవుతుంది. బిడ్డ జన్మించే సమయానికి దాని వ్యాధినిరోధక సామర్థ్యం ఎంతో అభివృద్ధి చెంది క్రియాశీలక దశకు చేరుకుంటుంది. కాని కొంతమంది శిశువుల ఇమ్యూన్ సిస్టమ్ అభివృద్ధి లేకుండా, అశక్తతతో ఉండడం చూస్తాము. అటువంటి బిడ్డలు సామాన్యంగా కఫం, జ్వరంలతో బాధపడుతూ ఉంటారు. పుట్టిన తర్వాత కొంతకాలం బిడ్డలు తల్లినుంచి లభించిన యాంటీబాడీస్‌తో కాలం గడుపుతారు. కాని ఇవి ఎక్కువ కాలం నిలువవు. త్వరలోనే ఇవి కూడా నశించిపోతాయి. ఇక అప్పటి నుండి బాలుని ఆరోగ్య విషయం పెద్ద సమస్యగా మారుతుంది. బిడ్డకు తన్నుతాను రక్షించుకోగల ఉపాయములు వెతుక్కోవలసి వస్తుంది. అవసరమైన రక్షకదళం లేనందున శిశువు రోగాణువులనే శత్రుదాడికి లొంగిపోతాడు. ఫలితంగా రోగగ్రస్తు డవుతాడు.

ప్రకృతి నియమాలను ఉల్లంఘించనంతవరకు మనం ఏ విధమైన వ్యాధులకు గురికాము. శరీరంలో అనేక చిన్నా-పెద్దా ఉపతంత్రములున్నవి కదా. వీనిలో అన్నిటికన్నా సశక్తమైన రక్షణ ప్రణాళిక యాంటీబాడీస్. ఇది ఒకరకమైన ప్రొటీన్. ఇది రక్తంలో కలిసిపోయి ఉంటుంది. దీని మీదనే శరీరమంతటికి కావలసిన రక్షణ వ్యవస్థ మంచిచెడులు ఆధారపడి ఉంటాయి. శరీరంలో ఈ విధమైన యాంటీబాడీస్ శక్తివంతమైనవి. ఇవి వ్యాధినిరోధక శక్తికి సంబంధించిన అత్యంత మహత్తు గల రక్షక సేనానులు. ఇవి మూలతః ప్రొటీన్ తత్వాల సమూహాలు. ఇవి మూత్ర పిండాలలో తయారవుతాయి. ఉత్పన్నమవుతూనే రక్త ప్రవాహంలో కలిసిపోయి క్రియాశీలమౌతాయి. ఈ ప్రొటీన్లను తొమ్మిది రకాలుగా లెక్కిస్తారు. రక్త సంచారంలోకి వస్తూనే ఇవి రోగక్రిములపై విరుచుకుపడి వాటిని అంతం చేయ నారంభిస్తాయి.

ప్రసిద్ధ ఇమ్యునోలాజిస్ట్ రాబర్ట్ గుడ్ చెప్పినదానిని బట్టి - మన సంపూర్ణ శరీరంలో ప్రత్యేకమైన జిగురుగల గ్రంథులు కనబడతాయి. ఈ గ్రంథులు రెండు కోశముల కలయికతో తయారవుతాయి. ఒకటి, టి-లింఫోసాయిట్, రెండవది, బి-లింఫోసాయిట్. ఏవైనా నిజాతీయ తత్వాలు శరీరంలో ప్రవేశిస్తే ఈ కోశికలు క్రియాశీలమై శత్రువు ఆగమన సూచన వెన్వెంటనే గ్రంథులకు అందిస్తాయి. సందేశము బి-కోశమునకు అందడంతోనే అది తక్షణం ప్లాజ్మా-సీల్‌గా

**మన పూజలన్నింటిలో గొప్పది సమాజసేవ.**

పరిణితమై యాంటీబాడీస్‌ను తయారుచేయడం ఆరంభిస్తుంది. అవి పుడుతూనే రక్తంతో కలిసి విజాతీయ తత్వాల పని పడతాయి. ఒకవేళ ఈ సంపర్కం టి-కోశముతో జరిగితే అది అతి ఉగ్రమైన ఆక్రామక లింఫోసాయిట్‌గా పరివర్తన చెంది సంక్రమిత రంగముపై దండయాత్ర మొదలుపెడుతుంది.

ఇవికాక శరీరంలో ప్రిమెటివ్ సెల్స్ ఉంటాయి. ఇవి మరోవైపుగా రక్షణ సహాయం అందించే పాత్ర పోషిస్తాయి. మైక్రోస్కోపుతో చూసినప్పుడు ఈ సెల్స్ రక్తంలో అటూఇటూ తిరుగుతూ కానవస్తాయి. రోగాణువుల క్రిములే వీటికి ముఖ్య ఆహారం. ఈ విధంగా శరీరపు శుచి, రక్షణ రెండు పనులూ ఇవి చేస్తాయి. ప్రిమెటివ్ సెల్స్‌కి సంబంధించినవే మరొక రకము తెల్ల రక్తకణాలు. వీటిని గ్రైనులోసాయిట్స్ అని కూడా అంటారు. వీటి జన్మస్థానం ఎముకలలోని మూలగ. ఇవి పూర్తిగా వికసితమౌతూనే రక్తంలో కలిసిపోతాయి. కాపలా పనిని అతినేర్పుగా నిర్వహిస్తుంటాయి. వీటిలో కొన్ని కాపలా పని చేస్తుంటే మరికొన్ని రోగాణువులు అనే శత్రువుల మీద దృష్టి కేంద్రీకరించి ఉంటాయి. ఇదికాక వీటికి మరొక పని కూడా ఉన్నది. దానిని మైక్రోఫైజ్ అంటారు. ఈ కోశములు గ్రైనులోసాయిట్స్ కంటే ఎక్కువ బలమైనవి. డెబ్బయ్ కిలోల బరువున్న వ్యక్తులలో ఈ గ్రైనులోసాయిట్స్ లేదా మైక్రోఫోసెస్‌ల సంఖ్య షుమారుగా ఒక కోటీ ఇరవైయారు లక్షలుంటుంది.

ఈ విధంగా యాంటీబాడీస్, కాంప్లిమెంట్ సెల్స్, ప్లాజా సెల్స్, టీ మరియు బి - లింఫోసాయిట్ ఇవన్నీ కలసి అతి సమర్థవంతమయిన రక్షణ తంత్ర రూపొందింది. ఎవరి శరీరంలోనైనా వీటి సంబంధంలో సామరస్యం లేకపోవడం కాని, లేదా వీటిలో ఏదో ఒకటి ఉండకపోవడం కాని, వాటి శక్తి సన్నగిల్లడంకాని జరిగితే - ఆ శరీరంలోని రోగనిరోధక శక్తి క్షీణిస్తుంది. సంఘర్షణలో రోగాణువులే గెలుపొందుతాయి. దానితో రోగాలతో తీసుకుని కాలం తీరకముందే కాలగర్భంలో కలసిపోతారు.

★★★

## పరుగు పందెంలో ఒక్కడే

1908 నాటి సంగతి. లండన్ ఒలింపిక్ క్రీడలు ఏర్పాటు చేయబడ్డాయి. ఎథ్లెటిక్స్‌లో పరుగు పందాలు ప్రారంభం కాబోతున్నాయి. పురుషుల నాలుగు వందల మీటర్ల పరుగు పందెం ఫైనల్స్‌కు చేరుకుంది. మైదానంలో నలుగురు క్రీడాకారులు ఉన్నారు. వారిలో ముగ్గురు అమెరికన్లు, ఒక్కడే ఆంగ్లేయుడు.

నలుగురూ ఆ కాలంలో పరుగు పందెంలో ప్రసిద్ధులు. అమెరికా క్రీడాకారులలో ఎవరో ఒకరు గెలుస్తారని ప్రేక్షకులు భావిస్తున్నారు. అమెరికన్లు ముగ్గురు, ఆంగ్లేయుడు ఒక్కడు ఉండడమే దీనికి కారణం. నలుగురూ పరుగుపందెంలో పాల్గొన్నారు. పరుగెత్తే సమయంలో అమెరికన్ క్రీడాకారులకు ఒక దుర్బుద్ధి పుట్టింది. ఆ ముగ్గురూ ఆంగ్లేయ క్రీడాకారుణ్ణి మూడువైపులలో చుట్టుముట్టి పరిగెత్తసాగారు. అమెరికన్ క్రీడాకారుడు జైసీ కార్పెంటర్ బ్రిటన్ క్రీడాకారుడు హాల్స్‌వేల్‌కు ముందుగా పరుగెత్తసాగాడు. బ్రిటన్ అధికారులు నియమ విరుద్ధమైన ఈ పరిస్థితిని గమనించి అభ్యంతరం తెలిపారు. వాదోపవాదాలు జరిగాయి. తదనంతరం పరుగుపందెం ఆపి తిరిగి ప్రారంభించేందుకు నిర్ణయింపబడింది. జైసీని పరుగుపందెం నుండి బహిష్కరించారు.

ఈ నిర్ణయం విని మిగిలిన ఇరువురు అమెరికన్ క్రీడాకారులు కూడా రంగం నుండి వైదొలిగారు. ఇప్పుడు హాల్స్‌వేర్ ఒక్కడే ట్రాక్‌లో ఉన్నాడు. అతను పరుగుపందెం పూర్తి చేశాడు. అవరోధాల నడుమ ధైర్యం కోల్పోకుండా పరుగెత్తి మొట్టమొదటి స్వర్ణపతకాన్ని సాధించాడు. ఒలింపిక్ క్రీడలలోనే ఇది ప్రథమం. రజత, కాంస్య పతకాలకు పోటీదారులే లేరు.

**నిరహంకారిలోని మొదటి గుర్తు - పలుకులో తీయదనం.**

వ్యక్తి నిర్మాణం

# వ్యక్తిత్వ వికాసం ఒక ఆంతరిక ప్రక్రియ

వ్యక్తిత్వమనే మాట చాలా సుపరిచితమూ, చర్చనీయాంశమూ అయింది. తమ వ్యక్తిత్వం ఆకర్షణీయంగా, ఇతరులను ప్రభావితం చేసేదిగా ఉండాలని అందరూ కోరుకుంటారు. ఈ కోరికను కొద్దిమంది మాత్రమే నెరవేర్చుకోగలుగుతారు. చాలామంది తమ ఈ కోరిక తీరకుండానే ఈ ప్రపంచంనుండి నిష్క్రమిస్తారు. వ్యక్తి తన జీవితంలో కొన్ని స్వర్ణిమ సూత్రాలను పాటిస్తే - విఫల జీవితంలోని దుర్ఘటనలను పరిహరించి, జీవితాన్ని సార్థకంగా, సుఖవంతమైన అనుభూతిగా మార్చుకోగలుగుతాడు.

ఇందులో సర్వప్రథ మైంది - మన శక్తికి ఆధారం భగవంతుడనే విశ్వాసం. స్వామి వివేకానంద ప్రతి జీవీ భగవంతుని అంశయే అని ఉద్ఘోషించి, విశ్వాసమనే బీజాన్ని నాటి, అనేకమంది యువకులకు మార్గదర్శనం చేసారు. ఈ విశ్వాసమే మానవునిలో దైవత్వం జాగృతవడానికి మొదటి మెట్టు. జీవి ఈశ్వరుని అంశ కనుక, అతనిలో ఈశ్వరుని యొక్క సమస్త శక్తులూ, సద్గుణాలూ బీజరూపంలో ఉన్నాయి. వాటిని తెలిసికొని, వెలిసితీసి, వికసింపచేయాలి. వ్యక్తిత్వంలోని వివిధ అంగాలనూ, సమస్యలనూ అవగాహన చేసికొని, సదుపయోగం చేయడానికి శ్రమించినపుడే వ్యక్తిత్వ వికాసం సాధ్యమౌతుంది. ఆలోచనాపరులైన వ్యక్తులు అమూల్యమైన వ్యక్తిత్వం కోసం శ్రమనూ, మనోబలాన్నీ, శక్తినీ కొంతవరకు వినియోగిస్తారు. దీనిని గురించి ఆలోచించే సమయమే తమవద్ద లేదనుకుంటారు కొందరు. అటువంటివారి కల్పనలు కేవలం స్వప్నాలకే పరిమితం. వారి జీవితం చరితార్థమయ్యే సమయం ఇంకా రాలేదనే చెప్పాలి.

వ్యక్తిత్వ నిర్మాణం కోసం జాగరూకులై సక్రమంగా పని చేసేవారి కల్పనలు సాకారమవడం సునిశ్చితం. వ్యక్తిత్వం యొక్క బాహ్యపక్షం శరీర సంయమం. తేలికగా జీర్ణమయేదీ, పౌష్టికము అయిన ఆహారం, ప్రతినిత్యమూ చేసే వ్యాయామం, యోగాభ్యాసం, కఠోరశ్రమ మానవుని ఆరోగ్యవంతునిగా చేస్తాయి. శరీరం ఉత్సాహవంతమూ, శక్తివంతమూ ఐనపుడు వ్యక్తిత్వ నిర్మాణానికి సోపానం తయారవుతుంది.

ఈశ్వరుని పవిత్ర అంశగా తనను గుర్తించినప్పుడు వ్యక్తికి ఇంద్రియ నిగ్రహం యొక్క విలువ తెలుస్తుంది. ఆత్మసంయమం, ఆత్మగౌరవముల కాంతిచేత వ్యక్తిత్వం సహజంగానే సౌందర్యవంతమౌతుంది. సంయమము శక్తిక్షీణతను నిరోధించి పవిత్రత అనే సౌందర్యానికి సాధనమౌతుంది. వ్యక్తిత్వ సౌందర్యానికి ప్రముఖ ద్వారం ఇదే. ఆత్మవిశ్వాసం, ధైర్యశౌర్యాలూ మొదలైన సద్గుణాలన్నీ ప్రస్ఫుటమై వికసిస్తాయి. ఏ వ్యక్తి యొక్క ఆలోచనలు సకారాత్మకమై, నిరాశా నిస్పృహను పోగొట్టి ఆశావాదిగా చేస్తాయో, ఆ వ్యక్తి వలన అతని కుటుంబమూ, సమాజమూ అభివృద్ధి పొందుతాయి. కర్తవ్యనిష్ఠతో అతడి వ్యక్తిత్వం వృద్ధిపొందుతుంది. అటువంటప్పుడు పరిసరాల, పరిస్థితుల సమన్వయం సరళమవుతుంది.

పటిష్ఠమైన ఆత్మనిష్ఠ ఈశ్వర విశ్వాసానికి పర్యాయపదం. ఈ ఆత్మనిష్ఠ తన లోనివేకాక ఇతరులలోని శ్రేష్ఠగుణాలను కూడ దర్శింపచేస్తుంది. ఇతరులలోని సద్గుణాలను దర్శించినపుడు వ్యక్తి సద్భావనలతో నిండిపోతాడు. అతనిలో సంశయమూ, ఈర్ష్య, ద్వేషమూ, అసహ్యమూ అంతరిస్తాయి. విశ్వాసమూ, సకారాత్మక ఆలోచన, ఉదారత, సహిష్ణుత మొదలైన సద్గుణాలతో అంతఃకరణ నిండిపోతుంది. ఈ సద్గుణాలు బాహ్యంగా ప్రకటితమై, అతని మంచి నడవడిక పరిసరాలను ప్రభావితంచేస్తుంది. సద్భావపూరితమైన అంతరంగం ఎప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుంది. వ్యక్తిత్వ వికాసం జరిగి, అంతర్జీవనమును గురించిన దృష్టి వికసించి, జీవితాన్ని గురించి తెలుసుకోగలిగే శక్తి వ్యక్తికి లభిస్తుంది.

ఈశ్వర అంశయే తానన్న భావనవల్ల

**యజమాని 12 గంటలు, నౌకరు 8 గంటలు, దొంగ 4 గంటలు పనిచేస్తారు.**

అంతర్జీవనములోని రహస్యం అవగాహన అవుతుంది. జీవితమనేది ప్రాణముగల ఒక పుస్తకంగా అవగతమౌతుంది. పరిసరాలూ, కుటుంబమూ, సమాజమూ, దేశమూ, విశ్వమూ, ప్రకృతి, పర్యావరణమూ, బ్రహ్మాండమూ అన్నీ అధ్యయనం చేయవలసినవేనని తెలుస్తుంది. అధ్యయనమూ, స్వాధ్యాయమూ, చింతన, మననమూ అనే ప్రక్రియలవల్ల వ్యక్తిత్వం వికాసం పొందుతుంది.

క్రమంగా మొత్తం జీవితాన్ని ఒక ప్రయోగశాలగా, ఒక పుస్తకంగా, ఒక రంగస్థలంగా గుర్తిస్తాము. గంభీరంగా అధ్యయనం చేయదగిన పరిశోధించదగిన వస్తువుగా జీవితాన్ని గుర్తిస్తాము. శారీరిక సువ్యవస్థ, సంయమము, శిష్టాచారమూ, సద్వ్యవహారమూ మొదలైన వాటితో వ్యక్తిత్వం వికాస దిశగా ముందుకుసాగుతుంది. జీవితంలోని సామర్థ్యాల జాగరణకు కలిగే విఘ్నాలు చాలా సూక్ష్మమైనవని తెలుస్తుంది. వ్యక్తిత్వ నిర్మాణం యొక్క అసలైన ప్రక్రియ బాహ్యజీవన అలంకారం కాదు. అంతరిక జీవనాన్ని వ్యవస్థితం చేయడంలోనే ఉంది ఆ ప్రక్రియ.

వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియ లోతుకు పోయే కొలదీ స్థిరంగా, ప్రశాంతంగా అంతర్ముఖమౌతుంది. ప్రవృత్తుల చంచలత్వమూ, అస్థిరతా తగ్గిపోయి, ధారణశక్తి వికసిస్తుంది. వ్యక్తిత్వ యథార్థ నిర్మాణం ధ్యానము యొక్క పరిపక్వతతోనే సాధ్యపడుతుంది. ఎందుకనగా – మూల సమస్యలూ, గ్రంథులూ గూఢచిత్తంలో అచేతనంగా ఉంటాయి. ధ్యానమనే వెలుగుతో చీకటిలో పడి ఉన్నవాటిని కనుగొని ప్రకాశింపచేయాలి.

ఈ విధంగా మనం మన అస్తిత్వంలోనికి ఎంత లోతుగా వెళ్తామో వ్యక్తిత్వ నిర్మాణం అంత దృఢంగా, ప్రాణవంతంగా, ప్రభావశాలిగా తయారవుతుంది. చరమదశలోనికి వెళ్లినపుడు క్షుద్ర స్వార్థమూ, అహంకారమూ మొదలైన వాటిని ఈశ్వరుని పాదాలవద్ద సంపూర్ణంగా సమర్పించి వ్యక్తిత్వం ముందుకుసాగుతుంది. స్వావలంబన ప్రక్రియలో ఇప్పటినుండే మనమెందుకు భాగస్వాములం కాకూడదు! ఆత్మశ్రద్ధ అనే బీజాన్ని సంయమమూ, స్వాధ్యాయమూ, సాధన, సేవ అనే ఎరువువేసి, నీరుపోసి పోషించి ఒక సఫలమైన సార్థకమైన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకుందాము.

– అనువాదం: కె. అరవిందమ్మ.

★★★

## సేవయే ధర్మం

గత శతాబ్దంలో శ్రీ సంఖారాం మ.దేవుస్కర్ పేరుగాంచిన రచయిత, పత్రికా రచయిత. ఆయన ఒక పర్యాయం తన మిత్రులతో కలసి స్వామి వివేకానందను దర్శించడానికి వెళ్ళాడు. మాటల నడుమ వారిలో ఒక వ్యక్తి పంజాబు ప్రాంతనివాసి అని స్వామీజీకి తెలిసింది. ఆ రోజులలో పంజాబులో కరవు ఉంది. స్వామీజీ కరవుబాధితుల విషయంలో విచారం ప్రకటించారు. బాధితుల సహాయార్థం తీసుకుంటున్న చర్యలను గురించి వివరాలు అడుగుతున్నారు. అనంతరం విద్య, నైతిక శిక్షణ సమాజ సంక్షేమం మొదలైన వానిని గురించి మాట్లాడారు. స్వామీజీ దగ్గర సెలవు తీసుకుని వెళ్ళేటప్పుడు ఆ పంజాబీ గృహస్థుడు వినయకపూర్వకంగా అడిగాడు – 'స్వామీజీ! ధర్మాన్ని గురించి ఉపదేశిస్తారనే ఆశతో నేను తమ వద్దకు వచ్చాను. మీరు సాధారణ విషయాలను గురించి మాత్రమే చర్చించారు. మీ నుండి మాకు విశేషమైన జ్ఞానోపదేశం లభించలేదు.'

స్వామీజీ కొన్ని క్షణాలు మౌనంగా ఉండి గంభీర స్వరంతో చెప్పారు – 'సోదరా! మనదేశంలో ఒక పసిబాలుడు సైతం ఆకలితో అలమటిస్తుంటే, అతని ఆకలిని తీర్చడం, అతనిని సంరక్షించడం ఇదే నిజమైన ధర్మం. ఇది కానిదంతా మిథ్యా ధర్మం. ఆకలితో అలమటిస్తున్న వారి ముందర ధర్మపన్నాలు వల్లిస్తే అది దంభాచారమే అవుతుంది. మొదటి వారికి తినడానికి ఇంత రొట్టెముక్క పెట్టే ప్రయత్నం చేయాలి.'

**మన అంతరాత్మ మనల్ని నిందించే ఏ పనినీ మనం చేయకూడదు.**

సేవా ధర్మం

# అందరికీ అందుబాటైన సాధన - సేవ

జీవితాన్ని తరింపచేసుకోవడానికి ఎన్నో మార్గాలున్నాయి. ఎన్ని తెలిసినా ఆ మార్గంలో వెళ్లడానికి మనిషి మనసు ఓ పట్టాన అంగీకరించదు. "బుద్ధిః కర్మానుసారిణి" అంటారు. జీవితాన్ని సాఫీగా నడుపుకోవడానికి సాధనలను గుర్తించడం, వాటిని వాడుకోవడం పూర్వజన్మ సుకృత ఫలమే! మొదట్లో పిల్లవాడు పాఠశాలకి వెళ్లి చదువుకోవడానికి ఎంతో మొరాయిస్తాడు. తల్లి దండ్రులు నయానా భయానా చెప్పి తీసుసువెళ్లి స్కూలులో కూచోపెట్టి వస్తారు. అలాగే మన మనస్సుని కూడా మంచి మార్గంలో పెట్టుకోవడానికి శ్రమపడాల్సివస్తుంది.

చీమ దగ్గిర నుంచి ఏనుగు దాకా – ప్రాణులన్నీ కష్టం వస్తే ఉపశమనం పొందుదామని, ప్రాణాన్ని రక్షించుకొందామని ప్రయత్నం చేస్తూనే ఉంటాయి. ఒకప్పుడు వాటికి అలవికాని పరిస్థితి వస్తే, మరో ప్రాణి సహాయం ఆశిస్తాయి. ప్రాణం తీపి ప్రాణికి తెలుస్తుంది. అందుచేత ఉత్కృష్టమైన జన్మ ఎత్తిన మానవుడు తన తోటి ప్రాణికి సేవ చేయడాన్ని జీవన ధ్యేయంగా, కర్తవ్యంగా భావించాలి. ఒక సామెత ఉంది "ఈ ఊరికి ఆ ఊరెంత దూరమో ఆ ఊరికి ఈ ఊరు అంతే దూరం" అని. అలాగే, మనం ఒకరికెంత చేస్తే, వారు మనకు అంత చేస్తారు – అనే దృక్పథంలో నడవాలి. తపస్సు, సాధన, ఉపాసన – ఇవేవీ ఇవ్వలేని ఫలితాన్ని మానవసేవ ఇస్తుంది అని పెద్దలు చెపుతారు. భోగ భాగ్యాలూ రాగానుబంధాలూ విడిచి సన్యాసి అయిన బుద్ధుడ్ని ఈ సేవ తిరిగి మానవ ప్రపంచంలోకి లాక్కువచ్చి పడవేసింది. జోరాస్టర్, ఏసు, మహమ్మద్, రామకృష్ణ పరమహంస, గాంధీ, దయానంద సరస్వతి, ఋషులు, మునులు – ఇలా ఎందరికో సేవ మంత్రమయింది. జీవన లక్ష్యాన్ని చేరుకోవాలంటే – సేవ అనే మెట్లపై ఎక్కితేనే గాని చేరుకోలేం గదా! జ్ఞానం, భక్తి, తపస్సు, యోగం – అన్నిటికంటే సేవా మార్గం ఉత్తమమైంది. సేవ చేయడానికి పండితులు కానక్కరలేదు – సేవాభావం ఉంటే చాలు; ఎదుటివారు కష్టపడుతూంటే చూచి ఉద్విగ్నులయే స్పందన ఉంటే చాలు.

కౌస్తుభ ముని అని ఒకాయన ఉండేవారు. ఆయన ఏం నియమం పెట్టుకొన్నారంటే – రోజూ ఒక బీద వ్యక్తికి అన్నం పెడితేనేగాని తను తినకూడదు అని. అలాగే చాలా కాలం గడిచింది. ఒకరోజు మాత్రం భోజనం పెట్టడానికి ఎవరూ గుమ్మంలోకి రాలేదు. ఎవరికీ పెట్టకుండా ఆయన ఎలా భోంచేస్తాడు! ఆయనకు చాలా దుఃఖం వచ్చింది. వెతుకుతూంటే ఆయనకు దూరంగా చెట్టుకింద ఒక కుష్ఠురోగి కనిపించాడు. ఈశ్వరుడు దయచూశాడు, ఈయన్ని చూపించాడు అని సంతోషపడి, అతడి దగ్గిరకి వెళ్లి, "మా ఇంటికి వచ్చి భోజనం చేయండి" – అని ఆహ్వానించాడు. "అయ్యా! నేను శూద్రుణ్ణి, పైగా కుష్ఠురోగిని. మీ ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించే తాహతు నాకు లేదు" – అని అతడు అన్నాడు. కౌస్తుభ ముని సర్వశాస్త్ర పారంగతుడు. ప్రతి ప్రాణిలోనూ ఈశ్వర సాక్షాత్కారం కలుగుతుం దాయనకి. శూద్రుడు – బ్రాహ్మణుడు అనే భావనలే ఆయనకు రావు. ఆయన ఆ కుష్ఠురోగిని తీసుకువెళ్లి, ఉచితాసనం వేసి, గొప్ప వ్యక్తికి భోజనం పెట్టినట్లుగా పెట్టి, మర్యాదగా సాగనంపి, తరువాత తాను భోజనం చేశాడు.

జీవన ధ్యేయాన్ని పూర్తి చేసుకొనేందుకు, అంతరాత్మని సంతుష్టిపరచేందుకు, లోకకళ్యాణం కోసం పాటుపడేందుకు, ఈశ్వరుణ్ణి సంప్రీతుణ్ణి చేసేందుకు, మానవత్వపు శిఖరాలను వెలిగింపచేసేందుకు, మన పేరు సత్పురుషుల జాబితాలో ఓ మూల చూసుకొనేందుకు, భారతీయ ధర్మం, సంస్కృతుల, గౌరవాన్ని నిలబెట్టేందుకు ప్రయత్నించాలంటే, కృతకృత్యులు కావాలంటే – సేవామార్గం ఒకటే రాజమార్గం. ఈ మార్గంలో నడవడమే మన కర్తవ్యం.

**పగటికీ పగటికీ మధ్య ఉండేది రాత్రి; ఈ దేహానికీ రాబోయే దేహానికీ మధ్య ఉండేది చావు – రమణ మహర్షి**

సేవ అంటే ఇతరుల మంచిని కోరడం. అంతే! అవసరాన్ని బట్టి ఎదుటివారికి ఏ పని చేస్తే లాభం – సంతోషం కలుగుతాయో ఆ పని చేయగలగడం.

నదులు నిండు నీటితో ప్రవహిస్తాయి. వాటి కోసమా? అవి ఒక్కచుక్క నీరు తాగవు. ఇతరుల దాహం తీర్చడం కోసమై ప్రవహిస్తాయి. చెట్లు ఒంటినిండా కాయల్ని పండిస్తాయి. ఒక్కటయినా తింటాయా! తుంటరివాళ్లు కొట్టే రాళ్లదెబ్బలు తిని కాయలు కింద రాలుస్తాయి. ఇతరుల కోసమే అవి కాస్తాయి. అలాగే – సేవా భావం ఉన్న వాళ్ల శక్తి, ధనమూ ఇతరుల కోసమే ఉపయోగపడతాయి.

నదులు, చెరువులు, సముద్రం, చెట్లు, పక్షులు, గడ్డి, సూర్యుడు, చంద్రుడు సేవాధర్మం కోసం నియతి తప్పకుండా పని చేస్తుంటే – అన్నీ తెలిసిన మానవుడు సేవ అనగానే మొఖం తిప్పుకోవడం భావ్యంగా ఉంటుందా! వాళ్లని చూసయినా మనం ఆ బాటలో నడిచి జీవితాన్ని ధన్యం చేసుకోవచ్చు కదా! సేవామార్గంలో నడిచిన వాళ్ల పేర్లు చరిత్రలో చిరస్థాయిగా లేవూ!

మథుర దగ్గిర ఓ కుగ్రామంలో ఒక బాల వితంతువు రోజూ కూలీకి తిరగలితో పిండి విసిరిపెట్టి, రెండు అణాలు సంపాదించేది. అందులో రెండు పైసలు ఏదైనా ధర్మ కార్యానికి వినియోగించాలని దాచేది. ఏ అవసరం వచ్చినా ఆ డబ్బులు మాత్రం తియ్యకుండా దాస్తే, వృద్ధావస్థ వచ్చేసరికి ఆ డబ్బు వెయ్యి రూపాయ లయింది. ఆ డబ్బుతో మథుర – ఢిల్లీ రహదారిలో ఒక నుయ్యి తవ్వించింది. ఆ శీతల జలధార అంతా తాగేవారు. "పిండి విసిరే అవ్వ నుయ్యి" – అని అందరూ చెప్పుకొనేవారు. ఇప్పుడు చెప్పండి – సేవ చేయాలంటే లక్షలు లక్షలు రూపాయలుంటేనే సాధ్యమా! సేవాభావం ఉంటే చాలదా! ఆవిడ ఉదార స్వభావానికి వేల వేల నమస్కారాలు.

దినచర్యలో సేవకికూడా కొంత సమయం నిర్ధారణ చేసుకుపెట్టుకోవాలి. రోజూ అభ్యాసం అవుతుంది. ప్రతి పనీ విశ్వాస పూర్వకంగా, జగన్మంగళం కోసం చేయాలి. ఇతరులని సుఖపెట్టడం, వారి దుఃఖ కారణాలు వినడం, వెనకబడినవారికి సహాయ మందించి ముందుకు తీసుకురావడం, మనోవాక్కాయ కర్మలతో చేయగలిగినంత సేవ చేయడం – ఇదే సేవ.

సేవకి కొంత సమయం వినియోగించడం, మాట తప్పకుండా జీవన పర్యంతం విడవకుండా సేవ చేయడం. ఒకోసారి సేవా కార్యక్రమం ఆగిపోతే వెంటనే దానిని పునరుద్ధరించడానికి ప్రయత్నం చేయడం – ఇదీ చేయవలసిన పని. మనం ఎంత చేయగలిగితే అంత మన చుట్టుపక్కల వాళ్ల పరిస్థితిని అవగాహన చేసుకొని చేయాలి.

అమృతలాల్ థక్కర్ అనే ఆయన ఇంజనీరు. అస్పృశ్యులకు సేవా కార్యక్రమాలు చేసేవారు. బీదతనం, రోగాలు, రొచ్చులు – వాళ్ల దశ దయనీయంగా ఉండేది. థక్కర్ ఉద్యోగం చేస్తూ మిగిలిన సమయంలో వీరి సేవ చేసేవారు. వాళ్ల పరిస్థితులు కొంచెం మెరుగయినట్టు కనిపించాయి. ఈ కాస్త చేస్తే వీళ్ల బ్రతుకుల్లో మార్పు కనపడుతోందే – ఉద్యోగం సొంతం మానేసి వీళ్లకే సేవ చేస్తే వీళ్లంతా బాగుపడతారు కదా అనిపించి – ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. గాంధీగారితో కలసి హరిజన సంస్కరణ ఉద్యమం దేశవ్యాప్తంగా చేసారు. అజరామరు డయారు.

సేవ అంటే వ్రత దీక్ష పూనడమన్నమాట! సేవ చేయాలనుకోవాలి కాని – ఎక్కడేనా ఎలాగైనా చేయగలరు. దీనికి డిగ్రీలు – ఇనప్పెట్టినిండా ధనం ఉండ నవసరం లేదు. సేవ చేయా లనుకొంటే – ఎంత ఎక్కువ పనులతో సతమతమవుతున్నా సరే సేవా కార్యక్రమాలకు సమయం సంపాదించుకోగలం. సేవకి కావసింది ఉన్నత ఆశయం, ప్రబలమైన కాంక్ష. ముందు కొంచెం కొంచెంగా సేవా కార్యక్రమాలలో పాల్గొంటే, తరువాత అదే పెద్ద కార్యక్రమంగా మారిపోతుంది. రోజుకో గంట వినియోగిస్తే చాలు. వినోదాలకి, విలాసాలకి, విహార యాత్రలకి సమయం వెచ్చించగలిగేవాళ్లు సేవా కార్యక్రమాలకి సమయం లేదంటే ఎలా నమ్ముతాము? సేవ చేయడానికి నిశ్చితమైన చోటు అక్కర్లా. మరొకరి మెప్పుకు,

**ఒక్క మనిషికి సాయపడడానికి ఇరవై వేల జన్మలైనా ఎత్తగలను** – రామకృష్ణ పరమహంస.

గొప్పకు సేవ చేయ నవసరం లేదు. సేవే మన కర్తవ్యం అనుకోవాలి.

ఎవరికో సేవచేస్తే మనకేం లాభం! అనుకొంటే పప్పులో కాలేసినట్లే! సేవ చేయడం వల్ల ఆత్మ తృప్తి, విశాలత్వం నలుగురితో కలిసి గడపడం, మనకున్నది ఇంకొకరికి ఉపయోగపడిందనే ఆనందం – ఇలా ఎన్నో మనకి లభిస్తాయి. ఉదారత్వం, దయ, క్షమ, కరుణ, ప్రియ వాక్కు – ఇలా ఎన్నో సద్గుణాలు కలిగి, మన వ్యక్తిత్వంలో మెరుపు వస్తుంది. గమ్యం చేరడానికి ఇతరులకంటే మన అడుగులు వడివడిగా పడతాయి. సేవ ఉంటేనే వ్యక్తికి గౌరవం పెరుగుతుంది. సేవా–నిష్ఠ, సత్యపరిపాలనలే కదా మోహన్‌దాస్ కరంచంద్ గాంధీని మహాత్మా గాందీగా మార్చివేసాయి.

అన్ని విధాలా ఉన్నతి పొందేందుకు సేవ సహకరిస్తుంది. సేవామార్గం ఎంచుకోవడమే పరమ కర్తవ్యం. సేవలో మునిగినప్పుడు జాతి, కుల, మత ద్వేష భావాలను మరచిపోవాలి. దీనులకీ, దుఃఖితులకీ సేవచేసే వ్యక్తి పరమేశ్వ స్వరూపుడు అవుతాడు. నిస్వార్థంగా చేసే సేవ అమృత ఫలాల నిచ్చి దైవత్వాన్ని ప్రసాదిస్తుంది.

బాబాసాహెబ్ ఆమ్టే ఒక మామూలు న్యాయవాది. ఆయన జీవనం గడుపుకోటానికి ఏ విధమైన లోటూ లేదు. కాని ఆయన అంతఃకరణ ఆయన్ని మామూలుగా కూర్చోనియ్యలేదు. వికలాంగులకి, కుష్ఠురోగులకి నివాస సౌకర్యం కల్పించాలనే తపనతో జీవితమంతా శ్రమించారు. కుష్ఠురోగుల సేవలో ఆయన కుటుంబ సభ్యులు చేయూత నిచ్చారు. రోగులకి అందరూ సేవచేసి, వారివారి పనులు చేసుకొనే యోగ్యత కల్పించారు. ఆశ్రమం నడుపుకొనేందుకు కావలసిన ఆర్థిక సంపదా స్వావలంబులైన కుష్ఠురోగులే సమకూరుస్తున్నారు. బిచ్చమెత్తుకొంటూ సందు సందు తిరిగే వీళ్లకి ఆమ్టే దేవదూతగా సాక్షాత్కరించారు.

సద్భావాల దొంతర ఎవరి మదిలో ఉంటుందో, వాళ్లు సేవ చేయకుండా నిలవలేరు. ఎట్టి పరిస్థితు లెదురైనా ముందుకుసాగి కార్యనిర్వహణ చేస్తారు. వారికి సదాశయాలే శ్రీరామరక్ష.

– అనువాదం: టి. జ్ఞానప్రసూన

## పారిపోవద్దు, ఎదుర్కో

స్వామి వివేకానందుడు పరివ్రాజక వేషంలో కాశీలోని ఒక దేవాలయ ప్రాంగణంలో నడుస్తున్నాడు. అల్లరి కోతులు కొన్ని వెనుక నుండి ఆయన మీదకు లంఘించాయి. వాటి నుండి తప్పించుకునేందుకు స్వామీజీ పరిగెత్తారు. కోతులు కూడా వెంటపడ్డాయి. వదలి పెట్టలేదు. స్వామీజీ వేగంగా పరుగెత్తుతున్నకొద్దీ కోతులు కూడా గంతులు వేస్తూ ఆయనని సమీపిస్తున్నాయి. అక్కడి ఒక పూజారి ఈ దృశ్యాన్ని చూశాడు. కేక పెట్టి స్వామీజీతో ఆ పూజారి అన్నాడు – 'పరుగెత్తవద్దు, ఎదిరించు.' ఇది వినగానే స్వామీజీకి ఒక వెలుగు వెలిగినట్లయింది. ఆయన వెంటనే వెనుకకు తిరిగి నిల్చున్నారు. స్వామీజీ తమ ఎదుట నిల్చుండటం చూచి కోతులు ఆగిపోయాయి. ఇప్పుడు స్వామీజీ నిర్భయంగా కోతులకు ఎదురు నడిచారు. కోతులు వెనుకకు పోయాయి. చివరికి తమ దోవన తాము పోయినాయి. మళ్ళీ వెనుకకు తిరిగి చూడలేదు.

ఇది కేవలం ఒక సంఘటనకు సంబంధించిన విషయం కాదు. జీవించటానికి అవసరమైన ప్రేరణ ఇచ్చే వాక్యం – 'పారిపోవద్దు, ఎదిరించి నిల్చో.' మనం ఎన్నో విషయాల నుండి పారిపోతుంటాము. పారిపోకుండా మనం ఎదుర్కొని నిలిస్తే ఆపదలు, ఆటంకాలు అన్నీ దూరమైపోతాయి.

స్వామీ వివేకానందుడు ఈ మంత్రాన్ని ఆధారం చేసుకొని లేచారు. ముందుకు నడిచాడు. అలా ముందడుగు వేస్తూ వెళ్ళారు. లక్ష్యాన్ని సాధించే వరకు అలాగే చేశారు.

**యజ్ఞం పంచ భూతాలను సమతూకంలో ఉంచుతుంది.**

## జీవన సాధన

# లక్ష్యం లేని జీవితం తెగిన గాలిపటం

**ఓం భూర్భువః స్వః । తత్ సవితుర్వరేణ్యం**
**భర్గోదేవస్య ధీమహి । ధియోయోనః ప్రచోదయాత్ ॥**

– (ఋగ్వేదం 3/62/10, యజుర్వేదం 3/35, సామవేదం 14/62)

ప్రాణస్వరూపుడు, దుఃఖనాశకుడు, సుఖస్వరూపుడు శ్రేష్ఠుడు, తేజస్వి, పాపనాశకుడు, దేవస్వరూపుడయిన పరమాత్మ ఎవరైతే ఉన్నారో వానిని మన అంతరాత్మలో ధారణ చేద్దాం. ఆ పరమాత్ముడు మన బుద్ధిని సన్మార్గం వేపు నడిచేటందుకు ప్రేరేపిస్తాడు.

గాయత్రీ మంత్రం లక్ష్యసాధనకు, లక్ష్య పరిశోధనకు సహాయపడటమే కాక– సారరూపిణియైన ఆ మంత్రమే మనకు లక్ష్యం అని గ్రహించాలి. భగవంతుణ్ణి, పాప నాశకుణ్ణి తన హృదయ కమలంలో ప్రతిష్ఠింప చేసుకొని ప్రారంభిస్తేనే మానవునికి లక్ష్య సాధన, లక్ష్య ప్రాప్తి కలుగుతాయి. మానవునికి లక్ష్యమంటూ ఒకటి లేకపోతే – అతని జీవితం తెగిన గాలిపటం అయిపోతుంది. దారి తప్పిన బాటసారిలా అతడు అటూ ఇటూ తిరుగాడుతూ ఉంటాడు. సాధకునికి తన స్థానం ఏమిటో తెలియనంతవరకు ప్రయాస అర్థహీనం అవుతుంది. ప్రతి మానవుని అంతరంగం ఒక శక్తి ఖండం. తనలోని శక్తిని ఎలా బహిర్గతం చేయాలో, దాని మార్గాన్ని ఎటుగా నిర్దేశించాలో తెలియకపోతే – మానవ జీవితం అయోమయంలో పడిపోతుంది. ఆశలు రూపం దాల్చకముందే వడలిపోతాయి.

అలా జరగకూడదంటే – ముందే లక్ష్య నిర్ణయం జరగాలి. లక్ష్య నిర్ణయం చేయాలన్నా, లక్ష్య సాధన చేయాలన్నా అంతరంగాన్ని సంప్రదించాలి. దాని నుంచి ఉద్భవించే ఆలోచనలే, సలహాలే మన జీవన లక్ష్యాలకు ఆధారభూతములు అవుతాయి. అంతరంగాన్ని పరిశీలిస్తే మనలో నిండిన ప్రతిభ మనకు గోచరిస్తుంది. అంటే – మనలో ఇబ్బడి ముబ్బడిగా పడి ఉన్న విశేష ప్రవృత్తులు, భావాలు ఒకటి తరువాత ఒకటి బయటికి రావడానికి గుంపుగా తోసుకొంటూ ఉంటాయి లోపల. రెండో విషయం ఏమిటంటే – ఊహ తెలిసినప్పటి నుంచి మనల్ని కదలించే చైతన్యాన్ని, స్ఫురణను తెలుసుకోగలుగుతాం. ఆ స్ఫురణని ఎందుకు తెలుసుకోవాలంటే – మనలో ఉండే ప్రేరణ ఏమిటి! ఎలాటిది? మాటిమాటికి మనసును స్పృశించి స్పందింప చేస్తున్నదేమిటి అని గుర్తించడానికి. మన దారిలో అడ్డుగా నిలబడి మాటిమాటికీ బెదిరించే సవాళ్లు ఏమిటి? ఈ సవాళ్లను లోతుగా పరిశీలించి, జల్లెడ పట్టి, వాటిని అధిగమించకపోతే లక్ష్యసాధన మార్గంలో మనం అడుగు పెట్టలేం. మనలో కలసిపోయిన మన జీవన మూల్యాల్ని కనిపెట్టాలి. నిలబెట్టుకోవాలి. అవే మనకు ఉత్తమ భావాలుగా – ఉత్తమ కర్తవ్యాలుగా వెంట ఉంటూ వస్తున్నాయి. వాటిని మనం వదలలేం. అయిదోదేమిటి? ఇవన్నీ మన దగ్గర మూల ధనంలా ఉండి లక్ష్య సాధనలో అవసరమైనప్పుడు ఉపయోగపడతాయి. ఆరవది – మంచి అవకాశాలు. అవి మనకు నిష్ఠ వలన సంప్రాప్తించినవి. వీటన్నిటినీ సమగ్రంగా పరిశీలించిన తరువాతనే మన లక్ష్య సాధనకు, లక్ష్య నిర్ణయానికి ఉపక్రమించాలి.

ఈ ఆరు విషయాలని మించి ఉత్కృష్టమైన విషయం ఏదైనా ఉందా అంటే – ఎప్పటినుంచో హృదయ కుహరంలో ఇంద్ర ధనుస్సులా రంగులీనుతున్న మన ఆశలు, కలలు. కలలు కనని మనసే ఉండదు. అవి నిజ మవుతాయని నమ్మకం ఉంటుంది. అప్పుడే మన కల ఒక ప్రణాళిక రూపం పొందుతుంది. అద్భుతాన్ని సృష్టిస్తుంది.

ఉద్యోగపరమైనది కాని, ఆర్థికపరమైనది కాని, మానసిక సంబంధమైంది కాని, ఆధ్యాత్మిక జగత్తు గురించి

**ఆశను వదులుకుంటేనే అంతఃకరణలో ఉల్లాసం.**

కాని – ఏ రకమైన లక్ష్యమైనా సరే బాగా ఆలోచించి నిర్ధారణ చేసుకొన్న తరువాత దాన్ని మార్చడం మంచిది కాదు. కుజ గ్రహంలోకి వెళ్లి జీవించాలనుకొన్నా– సూర్యుణ్ణి భూమిపైకి దింపాలన్నా, అవి మనం చేయగలిగే పనులు కావు. సుగమము అయిన లక్ష్యాన్ని ఎన్నుకొన్న తరవాత వెనకకు తగ్గకూడదు. సాధన తీవ్రతరంగా చేస్తే సాధనాలు వాటంతట అవే వచ్చిపడతాయి.

లక్ష్య నిర్ణయం జరిగాక సఫలీకృతం కావడానికి ఏకాగ్రత అత్యవసరం. సంపూర్ణ ఏకాగ్రత అంటే – లక్ష్యసాధన కోసం వ్యక్తిత్వాన్ని అందులో రంగరించిపోయాలి; లక్ష్యసిద్ధి అయిన తరువాత మన వ్యక్తిత్వం అందులో ప్రస్ఫుటంగా కనిపించాలి. దృఢత్వం, భక్తి, నిష్ఠ– ఈ మూడూ కలిపి పనిచేస్తే లక్ష్యసాధన ఎందుకు కాదు! తప్పకుండా అవుతుంది. అసంభవం అనుకొన్న పనులన్నీ సంభవిస్తాయి ఆశ్చర్యంగా. లక్ష్యం దిశగా నడిచే నడక తనంత తాను వేగం పుంజుకుంటుంది. అవకాశాలు చుక్కలవలె ఆకాశాన్నంటకుండా కరతలామలకం అయిపోతాయి. ఫలితాలు వరసకట్టి కనపడతాయి.

లక్ష్య పరిశోధన పూర్తి కాగానే ఎవరైతే పరిపూర్ణ విశ్వాసంతో ముందుకు నడుస్తారో, వారు నిశ్చయంగా విజయం పొందుతారు. ఇటువంటి సమయాలలో స్వామీ వివేకానందుని తల్చుకోవడం మన కర్తవ్యం. ఆయన జీవితాన్ని తల్చుకొంటే హృదయస్పర్శి ఘటన లెన్నో కనిపిస్తాయి.

"శ్రీ పరమహంస దేవుని దేహావసానం అయాక మనమంతా ధనహీనులము, గృహం లేనివారము, సాధన విహీనులము అయిపోయాం. ఎలాటి పరిస్థితి అంటే తిండి తినడానికి కూడా సరియైన ఏర్పాట్లు లేవు. అలాటి స్థితిలో కూడా మన లక్ష్యం మన ఎదుట స్పష్టంగా ఉంది. మన లక్ష్యం ఎంత పవిత్రమైనదో, ఎంత విస్తృతమైనదో మనకు తెలుసు. ఆ విషయమై మనకు సంపూర్ణ విశ్వాసం ఉంది. భరతమాత గౌరవాన్ని, భారతీయ సంస్కృతిని తిరిగి తేవాలనే దృఢ ప్రశ్నే మనలో ఉంది. ఈ మహా లక్ష్యాన్ని ఎలా సాధిస్తాం? దైవ సహాయం వల్లనే ఇది జరుగుతుంది. భగవంతునిపై నమ్మకం ఉంచి, ఆయన మనకు సహాయం చేస్తాడు అనే విశ్వాసం కుదుర్చుకొంటే–మన శక్తి తిరిగి మనకు వస్తుంది. గరుడపక్షిలాగా రెక్కలు విప్పి వినీలాకాశంలో ఎగురగలం. అలసిపోకుండా పరుగెత్తగలం. నీరసపడకుండా నడుస్తూ ఉండగలం.

"మస్తిష్కంలో ఎప్పుడైతే దైవీశక్తి ఆవిర్భవిస్తుందో అప్పుడు అద్భుతమైన శాంతి లభిస్తుంది. అది అనుభవేకవేద్యమే కాని వర్ణనాతీతం. ఎప్పుడైనా లక్ష్య సాధనలో ఒంటరితనం ఆవరిస్తే ఏసుప్రభువు మాటలు గుర్తుకు వస్తాయి – "భయభీతుడవు కాకు – నిరాశపడకు – నేను నీ దేవుణ్ణి, నీ ఈశ్వరుణ్ణి – ఎప్పుడూ నీ వెంటే ఉన్నాను. ఇక్కడే కాదు ఈ మహాప్రపంచంలో నువ్వు ఎక్కడెక్కడికి వెళ్లినా అక్కడక్కడ నేను నీ వెంటే ఉంటాను".

దైవ సహాయమూ, దైవీ అనుభూతి కలిగి శక్తి నిచ్చిన క్షణాలు ఉత్తమమైన లక్ష్యప్రాప్తికి, పవిత్ర కార్యాలకి సహాయం ఇస్తూనే ఉంటాయి. మన లక్ష్య రూపం విరాట్ స్వరూపం అయితే అంచె లంచలుగా మన లక్ష్యం పూర్తి చేసుకోవాలి. సంవత్సరం, నెల, పక్షం – ఇలా సమయాన్ని విభజన చేసి ఉద్దేశ్య పూర్తి మెల్లమెల్లగా చేసుకోవాలి. దృఢత్వం, భక్తి, శ్రద్ధ – ఈ మూడింటిని మరువకుండా వెంటపెట్టుకొనే ఉండాలి. పరమేశ్వరుడు సహాయం చేస్తాడు. స్వయంగా గాయత్రీ మహామంత్రం బలప్రదర్శనం చేస్తుంది. ఈ బలమే లక్ష్యసిద్ధికి దాటవలసిన దూరం దాటేందుకు అపూర్వమైన క్షమాగుణాన్ని ప్రసాదిస్తుంది. కాని – లక్ష్యసిద్ధి కోసం చేసే మహాయానంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదనే విషయం మర్చిపోవద్దు.

– అనువాదం: టి.జ్ఞానప్రసూన

★★★

**ఆచరణలేని విజ్ఞానం దీపంముందు కళ్లు మూసుకోవడం.**

సాధు సంత్‌ల జీవితాలు

# గాయత్రీ సాధకుడు కరియా బాబా

పవిత్ర బృందావన నగరంలో కొన్ని దశాబ్దాల క్రితం ఒకగొప్ప సిద్ధుడుండేవాడు. ఆయన పేరు రామదాసైనా 'కరియాబాబా'గానే ఆయన అందరికీ సుపరిచితుడు. కొయ్యపుల్లలతో అల్లిన చాపతో తయారు చేసిన అంగవస్త్రాన్ని ఆయన ధరించడమే అందుకు కారణం. (హిందీలో 'కర్' అంటే కొయ్య). సిద్ధులను ఆయనెలా పొందారో ప్రజలు తెలుసుకోగోరారు. ఆ సిద్ధుడు తన కథ నిలా వివరించారు-

"గురుకులంలో విద్య పూర్తి చేసుకుని ఇంటికి చేరగానే, నాకు గాయత్రీ మంత్ర 'సాధన'లో పరిపూర్ణత పొందాలనే గాఢ సంకల్పం కలిగింది. మా తోటలోని పెద్ద మర్రిచెట్టు క్రింద ఈ మంత్ర జప అనుష్ఠానాన్ని ఆరంభించాను. డెబ్బది ఐదువేల సార్లు మంత్రజపం పూర్తయిన వెనుక - సాధన పరిపూర్ణతకు జ్వాలాముఖి పర్వత మందిరానికి వెళ్లాలని నాకు మార్గదర్శనం చేస్తూ అశరీరవాణి వినిపించింది. నాలో సహజంగా ఆనందం కలిగింది.

"మా గ్రామానికి 35, 40 మైళ్ల దూరంలో జ్వాలాముఖి పర్వత మందిరం ఉంది. చాలా ఉత్సాహంతో నా ప్రయాణ మారంభించాను. సుమారు నా వయస్సువాడే అయిన నా మేనల్లుడు నాకు తోడుగా వచ్చాడు. తేజస్వియైన సన్యాసినొకనిని మార్గమధ్యంలో కలిశాము. అతని వద్దనుండి వైరాగ్యదీక్ష (పవిత్రమైన సన్యాసి జీవితం స్వీకరించడం) ను పొందాను. నా మేనల్లుడు నన్ను ఈ మార్గాన్ని అనుసరించకుండా చేయాలని ప్రయత్నించి విఫలుడైనాడు. అందువలన అతడు మా గ్రామానికి వెళ్లి మా తండ్రిగారిని తీసుకొని వచ్చాడు. మాతండ్రి నన్ను సన్యాసి దుస్తులలో చూచి, కలత చెంది, ప్రాపంచిక జీవన విధానంలోకి తిరిగి రమ్మని కోరారు. నన్ను మార్చడానికి సర్వవిధాలా ప్రయత్నించా రాయన. ప్రేమ, కోపం, ఆవేశపూరిత మేధో ప్రక్షాళన మొదలైన ప్రక్రియలన్నింటినీ ఆయన ఉపయోగించినా - నేను నా నిర్ణయం మార్చుకోలేదు. అప్పుడు ఆయన మా గురువుగారిని నేను నా గ్రామానికి దగ్గరలోనే సన్యాసిగా ఉండేందుకు అనుమతి కోరారు. గురువుగారి అనుమతితో, నేను తిరిగి వచ్చి, దగ్గరలో ఉన్న అడవిలోని మర్రిచెట్టు క్రింద ఏకాగ్రతతో సాధన ప్రారంభించాను. పగలూ రాత్రీ గాఢంగా గాయత్రీమంత్ర జపంలో నిమగ్నమయాను. ఒకనాటి రాత్రి దివ్య తేజస్సుతో గాయత్రీ మాత సాక్షాత్కరించింది. దేవమాత నాకు వరాలననుగ్రహించదలచింది. ఆమె పాదాలవద్ద పూర్తి విశ్వాసంతో ఆత్మ సమర్పణ గావించుకొని, వైరాగ్యా న్ననుసరించిన నాకే కోరికలూ లేవని, ఆమె అనుగ్రహం మాత్రమే ప్రసాదించమని విన్నవించుకున్నాను. 'అట్లే అగు గాక' - అని దీవించి, ఆ దేవమాత అదృశ్యమైంది".

గాయత్రీ సాధన తర్వాత కరియా బాబాకు మరే కోరికలు గాని, చీకాకులు గాని, సమస్యలు గాని మిగలలేదు. అన్ని బంధనాల నుండి ఆయన విముక్తుడైనాడు. ఆయనకు తెలియనిదంటూ ఏదీ లేదు. పంచేంద్రియములూ గుర్తించలేని సంఘటనలను, వస్తువులను ముందుగా గుర్తించగలిగే ఉన్నత మేధోశక్తులైన సిద్ధులు ఆయనలో ఈ మంత్రం ద్వారా మేల్కొన్నవి. ఏ సమస్యతోనైనా తనదగ్గరకు వచ్చే ఎవరికైనా, తన శిష్యులకైనా భక్తులకైనా, వారికి వచ్చే కష్టాలను, వ్యతిరేకతలను ఆయన తొలగించగలిగేవారు. ఆయన వాక్కు పరిపూర్ణమైన నిజాన్ని పలికే సిద్ధిని పొందింది. ఆయనేమి చెప్పినా అది నిజమే అయ్యేది. దేనినైనా సృష్టించగలిగే శక్తి ఉన్నా, వినయంతో, కఠోర నియమ నిష్ఠలతో నిజమైన సన్యాసిగానే ఆయన జీవించారు. తన కొయ్య కచ్చడం లోపల మాంత్రిక సాధనాలో, బంగారు నాణాలో ఆయన దాచి ఉంచారని దురాశాపరులు, అజ్ఞానులు అనుకునేవారు. ఆ రహస్య నిధిని దోచుకోవాలనుకునే దురాశాపరులు శిష్యులసేవా బృందంలో చేరి, బాబాను చంపాలనే ప్రయత్నం చేసారు. పదిగ్రాముల విషాన్ని మూడు సందర్భాలలో ఇచ్చినప్పటికీ, బాబాపై విష ప్రభావమేమీ కనిపించలేదు. దాంతో ప్రతి ఒక్కరి కళ్లూ తెరుచుకున్నాయి. ఈ సామాన్య యోగి నిజమైన సిద్ధుడని జనం తెలుసుకున్నారు. ఈ గాయత్రీ భక్తుని చుట్టూ ప్రకాశించే కాంతి వలయాన్ని దర్శించడమే ఒక వరంగా ప్రజలు భావించేవారు.

- అనువాదం : బాసంగి శ్రీరాములు

ధర్మాచరణ వల్లనే మనిషి పశువుకన్న భిన్నుడు.

ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం- 15

# మహాప్రాణముల, లఘుప్రాణముల పాత్రలు - 1

వస్తుతః ప్రాణము యొక్క కార్యము జీవనమును గడుపుట. గుండె కొట్టుకొనుట జీవనమునకు ప్రతీక. గడియారంలో మెయిన్ స్ప్రింగు ఆధారంగా గడియారం నడుస్తుంటుంది. అది చెడిపోతే గడియారం నడవదు. ప్రాణము ద్వారా హృదయ చలనము కలుగుతుంది. అందువలన రక్త ప్రసరణ జరుగుతుంది. శ్వాస ప్రక్రియ జరుగుతుంది. దానితో శరీరములో అన్య క్రియలన్నీ జరుగుతూ ఉంటాయి.

ప్రాణము శిధిలమైతే జీవన శక్తి తగ్గిపోతుంది. పూర్తిగా పోతే హృదయ స్పందన ఆగిపోతుంది. సమాధిలోనికి వెళ్లగలిగిన మహాత్ములకు ప్రాణం మీద అధికారం ఉండటం వలన వారు దీర్ఘ కాలం నిస్తబ్దులుగా ఉండి కోరినంతనే శరీరమందు ప్రాణ స్పందన పెంపొందించుకుని, హృదయ స్పందన ప్రారంభింపచేసి, జీవన యాత్ర ప్రారంభిస్తారు. ఎంత కాలము వారి ప్రాణము లాగబడి బ్రహ్మాండమందు సంచితమగునో అంతకాలము గుండె కొట్టుకొనదు. శరీరం మృతతుల్యంగా ఉంటుంది. దీర్ఘకాలం సమాధి సుఖము లభిస్తుంది.

ప్రాణముపై అధికారము లభించకపోతే దీర్ఘకాలము స్థిర సమాధిలో ఉండటము కుదరదు. ప్రాణముపై అధికారము పొంది దీర్ఘకాలము జీవనము స్థిరముగా ఉంచి ఇచ్ఛా మరణమును పొందుట సంభవము. ఒక మనుష్యుడు ఇంకొకరి శరీరమందు ప్రవేశించి అతనికి జీవనము, మనోబలము కలిగించవచ్చు.

అపానము యొక్క కార్యము స్థూలమును సరిగా విసర్జింపజేయుట. దేహమునందు ఎల్లప్పుడూ తయారగుచుండు మలము, మూత్రము, చీము, కఫము, పుసి, విషము, విజాతీయ పదార్థము మొదలైన విసర్జింపదగిన పదార్థములు అనేక ఛిద్రముల (రంధ్రముల) ద్వారా బయటకు పోవుచుండును. అపానము అట్టి పని చేయనిచో శరీరమందు మలము బయటికి పంపబడు శక్తి తగ్గిపోయి అజీర్ణము, జలుబు మొదలయిన అనేక వ్యాధులు ఉత్పన్నమవుతాయి.

ఇదిగాక - అపానము యొక్క సూక్ష్మ క్రియ జననేంద్రియ మందు జరుగుతుంది. కామ వాసన యొక్క ఆధారం దీనిలోనే ఉన్నది. అపానము ఉత్తేజితమైనంతనే మనస్సుని మత్తునొందించు, చిత్తమును అధీరము నొనర్చు, వ్యగ్రతను, ఆతురతను పెంపొందించు వాసనలు ఉత్పన్న మగును. ఇది శిధిలమైనచో - యౌవ్వనవంతుడైనను నపుంసకు డగును. సంతానము యొక్క సౌందర్యము, స్వాస్థ్యము, బుద్ధి, పరాక్రమము, స్వభావములు అపానముతో చాల ఎక్కువ సంబంధము కలిగి ఉంటాయి. అపానమునకు సహవర్తి అయిన కూర్మమను లఘుప్రాణము సుషుప్తి యందున్న యెడల - శారీరిక దృష్టిలో సంపూర్ణ ఆరోగ్యము కలిగి ఉన్నను గర్భస్థావన జరుగనేరదు.

స్త్రీ పురుషు లెవరియందు అపాన సామ్యముండునో వారికి కామ సేవనమందు అసాధారణ ఆనందము కలుగును. రూప సౌందర్యములపై గాక, కామతృష్ణ అపానము యొక్క సామ్యముపై నిర్భరమై ఉండును. పురుషుల యందు అపానము, స్త్రీల యందు కూర్మము ప్రధానములు. రెండును పరస్పరం కలసిన ఒక ప్రాణ ప్రవర్తన జరిగి, అనేక శారీరిక మానసిక అభావములను పోగొట్టును. అపానముపై అధికారమును పొందు పద్ధతి తెలియకపోయినా, హఠపూర్వకముగా బ్రహ్మచర్య మవలంబించినా - రోగగ్రస్తులగుదురు.

**అవినీతిపరునికి మిగిలేవి ఆవేదన, అవమానం.**

నేడు విధురుల యందును, వితంతువుల యందును అధికాంశము ఆరోగ్యము భంగమగుచున్నట్లు విశదమగుచున్నది. జనాభా శాఖవారి రిపోర్టు ప్రకారము గృహస్తులకన్నా విధురుల (భార్యపోయినవారు) మరణ శాతం ఎక్కువగా ఉన్నది. అపానము నందు సమానత్వము కలిగినవారు కారణము లేకుండానే ప్రాణమిత్రు లగుదురు. వారిద్దరు కలసి ఉన్నప్పుడు ఇద్దరు మనశ్శాంతి కలిగి ఉంటారు. వారిని ప్రాణసఖులు అంటారు. అందు ఒకరి వియోగము రెండవ వారికి మరణాంతకమై బాధిస్తుంది.

సమాన ప్రాణము ఉదరమందును నాభి క్రిందుగా వసిస్తుంది. జీర్ణ ప్రక్రియ దీని ముఖ్య కార్యము. వేడి, ఉష్ణత, పిత్తము సమానమునకు ప్రతీకలు. శరీరమందు చాంచల్యము, స్ఫూర్తి, ఉత్సాహము, సన్నని అందమగు శరీరము కలిగి యుండుట వంటి ప్రకాశవంతమగు లక్షణములు దీనిమీద ఆధారపడి ఉంటాయి. చర్మము యొక్క మృదుత్వము, కోమలత్వము, కాంతి మొదలగు వానియందు కృకల ప్రాణము యొక్క అస్తిత్వము పరిలక్షితమవుతూ ఉంటుంది. బాగా ఆకలి కావడం, అధికంగా భుజించడం, త్వరగా జీర్ణం కావడం, జలుబు చేయకపోవడము మొదలగువాని యందు ''సమానము'' యొక్క విశేషము ఇమిడి ఉండును. ఎవనియందు ''సమానము'' సమానముగా ఉండదో (తక్కువయగునో) అతడు చలిని భరించలేడు. శీతాకాలమందు అతని దేహము మొద్దుబారిపోతుంది. చెవులు, చేతివేళ్ళు, పాదములు చలికి కొంకర్లు పోతాయి. శీతాకాలంలో చన్నీళ్ల స్నానం చేయడం వారికి అలవికాని పని. ఎక్కువ దుస్తులు ధరించినప్పటికీ చలి తీవ్రత తగ్గదు.

అట్టివారికి కొలదిగా భుజిస్తేనే కడుపు నిండుతుంది. వేడి పదార్థములను తినవలెనని కోరిక, ఎండలో తిరగవలెనని కోరిక ఉంటుంది. అట్టి మనుష్యుడు తన దౌర్బల్యము కారణంగా వేడిని సహించలేడు.

కానీ వేసవి కాలము అతని ప్రకృతికి అనుకూలముగా ఉంటుంది. "సమానము" యొక్క న్యూనత కారణమున శరీరము నందలి వేడిమి తగ్గిపోతుంది. పూర్తి వేడిమి వేసవి కాలంలోనే కలుగుతుంది. అటువంటివారియందు నాడి దుర్బలంగా ఉంటుంది.

సమాన ప్రాణమునకు, ఆరోగ్యమునకు ఘనిష్ఠ సంబంధమున్నది. ఇంద్రియములకు గల రసానుభూతి "సమానము" పై ఆధారపడి హెచ్చు తగ్గులను కలిగి యుండును. స్వాదిష్ట పదార్థములు, మనోరమ దృష్టి, మాధుర్య ధ్వని, సుఖ స్పర్శ, సురభిళ సుగంధములను చక్కగా గ్రహించుట, ఆనందించుట, సమాన ప్రాణముగల వారి యందే చూస్తాము. సమానము కోల్పోయినవాడు అన్ని విధముల సుఖద పరిస్థితులను కలిగి గూడ ఖిన్నుడై, అసంతుష్టుడై విసుగు చెందుతూ ఉంటాడు. శరీరంలో ఏదో ఒక భాగము రోగగ్రస్తమై బాధిస్తూ ఉంటుంది. అట్టివారికి సన్నిపాతము, పక్షవాతము మొదలైన రోగములే కాక జలుబు, దగ్గు, పొట్టలో బరువు, తలనొప్పి, పంటినొప్పి, చూపు మందగించుట, ఒడలు పగులుట, అలసట మొదలయిన వ్యాధులు కలుగుతాయి. ఒకటి తగ్గినా రెండవది తయారుగా ఉంటుంది.

సమానము పిత్తమునకు ప్రతీక. కృకలము కఫమునకు ప్రతినిధి. రెండును కలిసి వాత మవుతుంది. ఈ మూడింటి ఎక్కువ తక్కువల వలన వ్యాధి-ఆరోగ్య చక్రము తిరుగుతూ ఉంటుంది. అందువలననే చైతన్య చక్రము పొట్టలో ఉంటుందని అంటారు. దీని భావము - నాభి చక్రమందుగల "సమానము", కృకలము మన ఆరోగ్యమునకు అధిపతులు. దీనిపై అధికారము వల్ల చిరస్థాయి స్వాస్థ్యముపై ఆధిపత్యము ప్రాప్తము కాగలదు.

★★★

**శరీరమే నేను అని అనుకోవడం భ్రమ.**

## ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-2

# సరిహద్దులను చెరిపిన వివాహం

సనాఢ్య బ్రాహ్మణులకూ, గౌడ బ్రాహ్మణులకూ వివాహం జరిపించడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఈ వివాహం జరిపించింది గురువుగారు మాత్రమే. నేను నిమిత్తమాత్రుడిని. గురూజీ ఆలోచనలలో ఒక మహత్తర శక్తి ఉంది. ఇదంతా ఆ శక్తి ప్రభావమే - అని నేను ఆ గుమాస్తా గారితో చెప్పాను. ఆయన ఒక కోరిక కోరారు. తనకు ఒక చదువుకున్న కుమార్తె ఉన్నదనీ, ఆమెకు వివాహం చేయడం కష్టంగా ఉన్నదనీ, కట్నం ఇచ్చుకోలేననీ గురూజీకి విన్నవించమన్నారు. గురూజీకి ఉన్న శక్తితో ఈ సమస్య పరిష్కారమవుతుందని నేను ఆయనకు నచ్చజెప్పాను. ఆ గుమాస్తాగారి యజమానికి ఒక కుమారుడు ఉన్నాడు. ఆయన గూడా గురూజీ సాహిత్యాన్ని చదివారు. ఆ యజమాని ఆలోచనా విధానం గురూజీ ఆలోచనలకు దగ్గరగా ఉంది. కాని ఆయన కుటుంబ సభ్యులు మారటం కష్టం. కొన్ని రోజులు కష్టపడి వారిని కూడా ఒప్పించగలిగాము. గురూజీ ఆలోచనల శక్తి అది. కట్నం తెచ్చే ఆడపిల్లలు గర్వంగా ప్రవర్తిస్తారని, మాట వినటం కష్టమని ఆ కుటుంబ సభ్యులకు నచ్చజెప్పాను. గుమాస్తాగారి అమ్మాయి అందమైనదనీ, విద్యావతి అనీ అణకువ కలిగిన మంచి వధువు అనీ అత్తమామలను, ఆడబిడ్డలనూ ఆదరించే స్వభావం కలదనీ, అందరినీ గౌరవిస్తుందనీ నచ్చజెప్పాను. వివాహంలో ఆడంబరాలకు విలువ లేదనీ, అవి వృధా ధన వ్యయం అనీ, శ్రేష్ఠత ముఖ్యమనీ నచ్చజెప్పాను. చివరకు ఆదర్శ వివాహానికి సన్నాహాలు జరిగాయి. ఆకర్షణీయమైన వాతావరణంలో వేదసమ్మతమైన ఆదర్శ వివాహం జరిగింది. వివాహానికి విచ్చేసిన అతిథులు ఈ ఆదర్శ వివాహానికి ఆశీస్సులు తెల్పారు. కట్న పిశాచిని నిరసించారు. ఆ సేఠ్‌జీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని హర్షించారు. ఛాందసవాదులకు ఇది ఒక చెంపదెబ్బ. నాకు ఇది మహా సంతృప్తిని కలిగించింది. ఈ వివాహాన్ని గూర్చి గురుదేవులు 'యుగనిర్మాణ పత్రిక'లో ప్రచురించారు. దీన్ని శ్లాఘించారు.

నేను ఒకసారి మథుర వెళ్లినపుడు గురూజీతో బాటు మాతాజీ ఉన్నారు. మాతాజీ ఉత్తరాలు చదువుతున్నారు. గురువుగారు సమాధానాలు వ్రాస్తున్నారు. నేను వెళ్లేసరికి, గురూజీ 'నీ గురించే అనుకుంటున్నాము. దాత్రాలో నీవు చేసిన పని ఇతర ప్రదేశాల్లో కూడా జరగాలి. నాకు చాలా సంతోషం కలిగింది" - అన్నారు. వివాహ వివరాలన్నీ మరొకసారి నా ద్వారా విన్నారు. మాతాజీ సంతోషంతో 'నీవు నాకు ప్రియ పుత్రుడివి' - అన్నారు. గురూజీ ఆశీర్వదిస్తూ, 'నా పనిచేసే వ్యక్తులతో నేను ఎల్లప్పుడూ ఉంటాను. ఊరికే నన్ను పూజిస్తూ, జపమాల త్రిప్పుతూ, ఆశీర్వచనాలు ఆశించేవారు అవసర సమయంలో తప్పుకుంటారు. వారు నావారు కారు. నావారుగా మారాలంటే - శ్రద్ధతో, సమర్పణ భావంతో ఉండాలి. ఆధ్యాత్మికత వట్టి పూజా కార్యక్రమాలతో రాదు' - అన్నారు.

### వేదానువాదానికి వినోబాజీ ప్రశంస

మాతాజీ, గురూజీ ఉండే అఖండజ్యోతి సంస్థానానికి ఒకసారి నేను వెళ్లినపుడు, గురూజీ నాతో, "నాలుగు వేదాల అనువాదం పూర్తి అయింది. నాలుగు వేదాల అయిదేసి ప్రతులు నీవు తీసికో. ప్రజలు వేదాన్ని మరచారు. ఈ వేదాలు ప్రతి ఇంటికీ చేరాలి'- అన్నారు. అలాగే నాలుగు వేదాల్ని అయిదేసి ప్రతులు తీసుకున్నాను. గ్వాలియర్ వెళ్లాను. ఆ సమయానికి వినోబాజీ గ్వాలియర్ వచ్చారు. మురార్‌లో విడిది చేశారు. నేను మురార్ వెళ్లి, వారికి పాదాభివందనం చేసాను. నాలుగు వేదాల ఒక్కొక్క ప్రతిని వారికి బహూకరించాను. వారు 'ఆ ప్రతులు అక్కడ ఉంచి రేపు రా' - అన్నారు. వాటిని తాము చదువుతామని చెప్పారు. వారి ఆదేశానుసారం మరుసటి రోజు ఉదయం వారి వద్దకు వెళ్లాను. ఆరోజు గ్వాలియర్‌లో తమ ఉపన్యాసం ఉన్నదనీ, తాను పిలిచినపుడు వేద ప్రతులతో అక్కడకు రమ్మనీ చెప్పారు. వారు చెప్పిన ప్రకారం గ్వాలియర్‌లోని వారి ఉపన్యాస ప్రదేశానికి, వారు ప్రసంగించే సమయానికి

**నీకు అర్హత ఉంటే - అంతా దానికదిగా నీముందుకు వస్తుంది.**

వెళ్లాను. దగ్గరగా నిలబడి ఉన్నాను. 'మురార్‌లో నాకు వేదాలని బహూకరించాలని వచ్చిన వ్యక్తి వేదిక మీదకు రావా'లని పిలిచారు. నేను వేదిక మీద నాలుగు వేదాల ప్రతులు వారికి బహూకరించాను. వారు వాటిని తలపై ఉంచుకుని ఆనందంతో, ''నేను ఈనాలుగు వేదాలను అనువదించిన ఋషికి పాదాభివందనం చేస్తున్నాను. ప్రతి ఒక్కరూ ఈ వేదాలను చదవాలి. చాలా సులభ శైలిలో ఈ అనువాదం సాగింది. నేను దీన్ని చదివాను'- అన్నారు. నేను వేదిక దిగి రాగానే, వేదాల గూర్చి అడగటం ప్రారంభించారు అక్కడి జనసమూహం. నా దగ్గర కొద్ది ప్రతులు మాత్రమే ఉన్నాయి. కొద్ది సమయంలోనే ఆ ప్రతులు అమ్ముడైనాయి. వెంటనే మథుర బయలుదేరాను. వినోబాజీ మరో నాలుగు రోజులు అక్కడ ఉపన్యసిస్తారు. అఖండజ్యోతి సంస్థానం నుండి ఒక వంద సెట్లు వేద ప్రతులను తీసుకున్నాను. గ్వాలియర్‌లో ఆ ప్రతులన్నీ ఒక్క రోజులో అమ్ముడైనాయి. మరో రెండువందల సెట్లు ఉన్నా అమ్ముడుపోయి ఉండేవి. కొన్ని రోజుల తర్వాత "ఘియామండీ"లో గురూజీని, మాతాజీని కలిశాను. గురూజీ నవ్వుతూ, 'ఆ వందసెట్లు ఏమైనాయి' - అన్నారు. అవి అన్నీ రెండు గంటలలో అమ్ముడైనాయని తెల్పాను. మరో రెండువందల సెట్లైనా అమ్ముడుపోయేవని చెప్పాను. వినోబాజీ ఉపన్యాస వివరాలన్నీ చెప్పాను. ''నీలాంటి పుత్రులు మరికొంతమంది ఉంటే ప్రపంచవ్యాప్తంగా నా ఆలోచనలు ప్రవహించేవి" - అన్నారు గురూజీ. ఆరోజు నుండీ మథుర వెళ్లినపుడల్లా గురూజీ సాహిత్యాన్ని తీసుకుని వస్తూ ఉండేవాడిని. దాత్రా నుండి ఉత్తరాలు వ్రాసి గురుదేవుల సాహిత్యాన్ని తెప్పిస్తుండేవాడిని. ప్రతిరోజూ ఆ సాహిత్యాన్ని పఠిస్తుండేవాడిని. అలా చదవకపోతే నాకు తోచేది కాదు. అది చదువుతుంటే - గురూజీ ప్రక్కన కూర్చుని నాతో మాట్లాడుతున్నట్లు అనిపించేది. ఈనాడు గురుదేవులు, మాతాజీల ఫోటోలకు దండలు వేసి, పూజ చేసి, జపం జేసి వెళ్లేవారిని గురూజీ సాహిత్యం చదవమని అడిగితే, వారు మాకు సమయం లేదని అంటారు. వారి ఆలోచనల్ని చదవగలిగేవారే వారికి నిజమైన అనుయాయులు.

★★★

## ప్రేరణా స్రోతస్సు - బా

మహాత్మా గాంధీ స్త్రీలను సత్యాగ్రహోద్యమంలో పాల్గొనేందుకు సిద్ధపరుస్తున్నారు. కస్తూరిబా తన సంసిద్ధతను కూడా వ్యక్తం చేసింది. ఉత్సాహంతో ఇలా చెప్పింది, 'మీరు అందరినీ జైలుకు వెళ్ళమని చెపుతున్నారు. నాతో మాటవరుసకు కూడా చెప్పలేదు. నాలో ఉన్న లోపం ఏమిటి ? నాకు జైల్లో ఉండే అర్హత లేదని భావిస్తున్నారా?'

'నీలో ఏ లోపమూ లేదు', గాంధీజీ అన్నారు. 'స్వయంగా నీవే జైలుకు వెళతానంటే అంతకుమించి సంతోషకరమైన విషయం ఏముంటుంది? కాని ఒక మాట. ఇది నా ఆజ్ఞ అని భావించి నీవు జైలుకు వెళ్ళటం మాత్రం నాకు ఇష్టం లేదు.'

'ఎందువల్ల? మీ ఆజ్ఞకూ, నాలోని నిష్ఠకూ నడుమ తేడా ఉన్నదా?' - బా అడిగింది. 'తేడా ఏమీ లేదు. కాని ఇలాంటి పనులు ఎవరి సాహసాన్నిబట్టి వారు చేయాలి. ఒకవేళ నీవు నా ఆజ్ఞ మేరకు జైలుకు వెళ్ళి అక్కడి కష్టాల కారణంగా వ్యథ చెందితే, అది సిగ్గుచేటు అవుతుందికదా?' గాంధీజీ చెప్పారు.

'ఒకవేళ నేను జైల్లో వ్యధచెంది, ఓటమిని అంగీకరించి తిరిగివస్తే నన్ను మీ వద్ద ఉండనీయవద్దులెండి' - బా ఆత్మవిశ్వాసంతో చెప్పింది.

ఆ తరువాత గాంధీజీ ఏమీ మాట్లాడలేదు. బా సత్యగ్రహంలో పాల్గొంది. జైల్లో కష్టాలను సహించింది. మూడు నెలల పిమ్మట విడుదలై తిరిగివచ్చింది.

ఈ విధంగా కస్తూరిబా మొదటిసారి తన జైలుయాత్ర పూర్తి చేసింది. సామాజిక జీవనంలో తన భర్త అడుగుజాడల్లో నడిచింది. స్వాతంత్ర్య సంగ్రామంలో బా తన కార్యం ద్వారా చరిత్ర పుటలకు ఒక సువర్ణాధ్యాయాన్ని జోడించింది. భారతీయ మహిళలకు ప్రేరణా స్రోతస్సు అయింది.

**ఆకారంపై చూపే అపేక్షను ఆంతర్యంపై చూపు.**

ధారావాహిక : మిత్రమా! తెలుసుకో ఆత్మను-4

# అంతరాత్మ పిలుపు విన్న ఆదర్శమూర్తులు

## పిలుపు వినండి, దాన్ని సార్థకం చేయండి

అంతర్వాణి ఎప్పటికప్పుడు-"ఒరేయ్! నువ్విక్కడ ఏమి చేస్తున్నావు? ఇందువలననే నీకు అన్ని సంపదలతో నిండిన ఈ శరీరం లభించిందా? లే! నీ రూపాన్ని, నీ శక్తిని గుర్తించు. వాటిని మంచి పనులకు వాడు. ఆ మంచి పనులు నీ నుంచి దానిని కోరుకుంటున్నాయి" - అని అడుగుతూ ఉంటుంది. దాని ఆ అడగడం మీరు గమనించారో లేదో.

ఈ విధంగా మిమ్మల్ని పిలిచేది మరెవరో కాదు. అందరిలోనూ ఆత్మరూపంలో గల పరమాత్మయే ఆ పిలిచేది. ఎవరు ఆ పిలుపును విని ఎంతో ఆదరంతో జాగృతులై జగత్తులో శ్రేయస్సును కలిగించే పనులను చేసి చూపిస్తే - పరమాత్మ వారికి వాటి సాఫల్యానికి సహాయం చేస్తాడు.

మనిషి ఎప్పుడైతే హద్దు మీరిన స్వార్థ, సంకుచిత భావాలతో పని చేయడం ప్రారంభిస్తాడో, చేయకూడని పనులు చేయబూనుతాడో - అప్పుడు ఈ స్వరం వినబడుతుంది. తనకు అధిక శక్తి, సమర్థతలున్నా కూడా వాటికి తగని అతి చిన్న పనులు చేస్తూ తన శక్తి యుక్తులకు అవమానం కలిగిస్తున్న సమయంలో కూడా ఈ స్వరం వినబడుతుంది; అటువంటి మనిషిని ఆపుతుంది.

ఈ స్వరం యొక్క ఒకే ఒక్క ఆశయం ఏమంటే- తన అంశయే అయిన మనిషి అటువంటి పని చేయరాదని, తనకు సిగ్గు, బాధా కలుగరాదని, మనిషిని అతి గొప్పవైన పనులను చేయడానికే తాను పంపించానని పరమాత్మ హెచ్చరించడమే. నీచమైన హేయములైన పనులు నీ శక్తికి తగినవి కావని హెచ్చరించడమే.

ఏ ఆస్తికుడు, ఆత్మవంతుడు పరమాత్మ యొక్క పిలుపు విని ప్రేరణ - పొందుతాడో అతడు తనలోపల నిండి ఉన్న శక్తులను పురిగొల్పి, నడుము బిగించి, దృఢత్వంతో కర్తవ్యాలను నిర్వహించడంలో నిమగ్నుడౌతాడు. అతను తన ప్రస్తుత స్థాయి నుంచి పైకి లేచి చంద్రునిలా, నక్షత్రాలలా వెలుగులు నింపుతాడు. అతని ఉద్యమం ఆర్థికమైనా, ఆధ్యాత్మికమైనా ఆశయసిద్ధిని అందిస్తుంది. పరమాత్మ యొక్క ఈ పిలుపులోని ఆంతర్యమేమిటంటే - ఎవరే స్థాయిలో ఉన్నారో వారదే స్థాయిలో ఉండకుండా పైకి పెరగాలని, ఎల్లప్పుడూ ముందుకు సాగాలని. మానవీయమైన వికాసానికి, ఉన్నతికి ఏ విధమైన హద్దులు గాని, ఆపులు గాని లేవు.

ఈ లోకంలో సాధారణ జనానికి ప్రేరణ నిచ్చే కేంద్రాలుగా, దీపస్తంభాలుగా ఉన్న మహాపురుషులందరూ తమ అంతరాత్మ పిలుపును ఎప్పుడూ ఉపేక్ష చేయలేదు. వాళ్లందరూ ఆ పిలుపును విన్నారు, మేలుకొన్నారు, వెంటనే పథకం వేసుకుని ముందుకు దూకారు. అటువంటి వారిలో అమెరికాకు పూర్వాధ్యక్షుడైన జార్జ్ వాషింగ్‌టన్ ఒకరు.

జార్జ్ వాషింగ్‌టన్ అమెరికాలో ఒక సాధారణ రైతు కొడుకు. తండ్రి అతిసాధారణమైన స్థితిమంతుడు. కొడుకుకు నాగలి, కొద్ది భూమి, పార, గునపాలు మినహా పెద్దపెద్ద చదువులు మొదలైనవి ఇవ్వలేనివాడు. వయసు మళ్లగానే జార్జ్ వాషింగ్‌టన్‌కు వాటినే ఇచ్చాడు తండ్రి.

వాషింగ్‌టన్ మొదటినుంచి అప్పటివరకూ అదే వాతావరణంలో పెరిగాడు. అతని ఆలోచనలు వాటిని మించి, అవే పనులను దాటి, ఆ వాతావరణానికి భిన్నంగా ఎట్లా సాగగలవు? సంతోషంగా నాగలి పట్టి, తండ్రివలెనే వ్యవసాయంలో పడ్డాడు.

వాషింగ్‌టన్ రైతయాడు. కానీ అతని ఆత్మ ఆ పనిలో తాదాత్మ్యం చెందలేకపోతోంది. ఐతే వ్యవసాయమన్నది ఏదో పనికిరాని పని అని కాదు. అది చేయడం వలన అతనికి దానికన్న పైదయిన పనేదైనా చేయాలని, దానివలన దేశానికి, సమాజానికి, ప్రపంచానికి మిక్కిలి హితాన్ని సంపాదించాలని సంకల్పం కలిగింది.

అతని సంకల్పం ప్రకాశమయింది. ఆ ప్రకాశం ఒక రోజున అతను నాగలితో దున్నుతున్న సమయంలో ఒక స్వరంగా మారి అతని అంతరంగంలో ప్రతిధ్వనిస్తూ - "ఓ వాషింగ్‌టన్!

**నేటి ఆదర్శం రేపటి వాస్తవం.**

ఏమంటున్నావు? ఈ వ్యవసాయం పని ఇతరులెవరైనా చేస్తారు. నీవు ఏ ఉద్దేశ్యంతో వచ్చావో అది గుర్తు చేసుకో. చూడు! దేశమాత నిన్ను తన నుద్ధరించమని పిలుస్తోంది." – అని హెచ్చరించింది. నాగలి ఆగిపోయింది. వాషింగ్‌టన్ తన ఉద్దేశ్య పథంలో ముందుకు సాగడ మారంభించాడు. మహాపురుషత్వం, మానవత్వ మహిమ అన్నవి సందేహరహితమైన ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఆకస్మికంగా కలిగిన సాహసములతో కూడిన అందమైన శివాలయంలో నివాసముంటాయి.

వాషింగ్‌టన్ ఆ పిలుపు విన్నాడు. మేలుకున్నాడు. తనలో తాను – "నేను తప్పకుండా గొప్ప పని చేయడానికే ఈ లోకంలోకి వచ్చాను. నేను దానినే చేస్తాను. అది చాలా గొప్ప పని. దేశాన్ని విదేశీయుల పాలన నుంచి, దాస్యం నుంచి విముక్తం చేయాలి. ఈ జగత్తులోని ఏ అడ్డంకులు, జీవనానికి చెందిన ఏవిధమైన కష్టాలు, మార్గంలో ఏవిధమైన సంకటాలు, ఏవిధమైన సాధన హీనతలు నన్ను నా కోరిక తీర్చుకోవడానికి చేసే పనినుంచి తప్పించలేవు" – అని నిర్ణయించుకున్నాడు. అతని సంకల్పం బలిదానమై అతని ప్రతి కణమూ ఆ రూపాన్ని ధరించింది.

అతని ప్రయత్నం అధ్యయనం, ఆలోచనల రూపంలో ప్రారంభమయింది. అది పరిపూర్ణత చెంది, పరిపక్వత పొంది క్రియాత్మకతతో కూడిన ప్రేరణగా రూపుదాలిచే వరకు కొనసాగింది.

ఈ విధంగా వికసించడంలోను, నిర్మాణంలోను వాషింగ్‌టన్ ఎన్నివిధాలయిన కష్టాల్లో పడవలసివచ్చిందో చెప్పలేము. దీన, బలహీన రైతు యొక్క చదువు సంధ్యలు లేని కొడుకు స్థాయి నుంచి దేశాన్ని ఉద్ధరించగల, ఊహించరాని మార్గాన్ని దాటగలగడము, తన తీవ్ర నిష్ఠయొక్క బలంతో తన సంస్కారాలను, చెడు ప్రవృత్తులను జయించి జీవించి ఉండగానే మరొక జన్మనెత్తడం తక్కువ విషయమేమీ కాదు. తక్కువ శ్రేయస్కర విషయం కాదు.

ఐతే ఏదైనా చేయదలుచుకున్న వానికి కష్టాలు, బాధలు, శ్రమ, అలసట, విశ్రాంతులన్నవి అర్థంలేని వౌతాయి. అటువంటివాడు కోరేది పని – పని, నిస్వార్థమైన పని. అంతే. ఎదురైన ప్రతికూలతలను వాషింగ్‌టన్ సంతోషంగా స్వాగతించాడు. చివరకు దేశపు దాస్య పాశాలను తెంపిపారవేసిన రోజు రానే వచ్చింది. అతను చేసిన సేవకు విలువ కట్టి దానికి ప్రతిఫలంగా తన దగ్గరగల అన్నిటికన్న విలువగలదైన రాష్ట్రపతి పదవిని దేశం ఆయనకు సమర్పించింది. అనేక సంవత్సరాలు గడిచిపోయినా – నేటికీ ఆయన పేరుకు, ఆయన శిలా విగ్రహాలకు, ఆయన స్మారకాలకు అదే గౌరవ మీయబడుతోంది.

ప్రతి మనిషి జీవితానికీ ఒక లక్ష్య ముంటుంది. అది అతనిని ఉన్నచోటే ఉండనియ్యదు. అంతకన్న ముందుకు సాగేటట్లు చేస్తుంది. ప్రస్తుతమున్న హద్దులు దాటి విశాలమైన హద్దులలో ప్రవేశించేటట్లు చేస్తుంది. ఒక తరగతి తరువాత ఇంకొక తరగతికి వెళ్లవలసినదేగదా! ఒక స్థాయి నుంచి లేచి పైస్థాయికి ఎదగవలిసిందే గదా! సాలెపురుగులాగ గూటిలోనే పడి చివరకు చావడంకాకుండా ముందుకు సాగాలి. ఆ విధంగా అతను ఎదుగుదలను, వికాసాన్ని పొందాడు. చివరకు చైతన్యవంతుడయినట్లు రుజువు పరుచుకున్నాడు. ఎంతో దుర్లభమైన మానవ జన్మ కోరికలు, వాసనలు అన్న పీఠం మీద బలిచేయడానికి కాదని, మంచి ఉద్దేశ్యమనే ఎత్తయిన ఆదర్శయుతము, పవిత్రమునైన వేదిక మీద పూవువలె సమర్పించడానికనీ తన నమ్మకాన్ని తెలుపగలిగాడు.

ఏ మనిషి తన అతినీచమైన నైతిక స్థితిని, నీచాతి నీచమైన జీవన పద్ధతిని ముళ్లను పీకినట్లు పీకి పారవేయడో, హీనావస్థ నుంచి బైటకురాడో, ఎవరు వాటిని – ఆ మచ్చలను, అవమానాలను – సహిస్తూ కూర్చుంటాడో అట్టి వానిని చచ్చిన శవమన్నా తప్పు లేదు. ఏ కాస్త ప్రాణమున్న వాడైనా, మానవత్వమున్న వాడైనా ఇటువంటి అవమానాలను, మాయని మచ్చలను సహించలేడు. అతని హృదయంలో మిక్కిలి బాధ కలుగుతుంది, ఆత్మగ్లాని ఏర్పడుతుంది. దాంతో పరిస్థితులను ధిక్కరించి పురుషార్థమును చూపించడానికి లేచి నిలబడతాడు; గట్టి సంకల్ప శక్తితో పరిస్థితులనన్నిటినీ మారుస్తాడు. ఈ జగత్తులో అటువంటి మహాపురుషులు అవతరించారు; వారు అసంభవములనుకున్న వాటిని మార్చి సంభవములు చేశారు. అటువంటి వారిలో ఒకరు మహాకవి కాళిదాసు.

కాళిదాసు అతి మూర్ఖుడు, కట్టెలు కొట్టేవాడు. అతనెంత మూర్ఖుడుగా ఉండేవాడంటే – తను కూర్చున్న కొమ్మనే తెగగొట్టే ప్రయత్నం చేసేవాడు. అనేకసార్లు అతను ఆ విధంగా ప్రయత్నిస్తూ ఉండడం చూచి దారినపోయేవాళ్లు అతనిని ఆపేవాళ్లు. ఇటువంటి మూర్ఖుడిని అందరూ 'గొట్టె' అని చీదరించుకునేవారు. అతనికి

**అద్వైతం బోధించేదీ, నేర్చుకునేదీ కాదు – సాధనతో స్వయంగా తెలుసుకునేది.**

అమ్మా నాన్నలుగానీ, అన్న తమ్ములుగానీ ఎవ్వరూ లేరు. అతని మూర్ఖత్వాన్ని ఒక వినోదంగా చూస్తూ, అతనికి తినడానికో ముద్ద, కట్టుకోవడానికొక గోచీగుడ్డ ఇచ్చేవారు జనం. అటువంటి మూర్ఖ శిఖామణి ఒక రోజున బ్రహ్మాండమైన పండితుడుగా మారి ప్రపంచమంతటికీ కవి శిరోమణి అయాడు. ఐతే కాళిదాసు కేవలం లౌకికంగా ఆ స్థాయికి ఎదగడం కోసమే జన్మించలేదు; దానికి అతీతమైన స్వరూపాన్ని సాధించి జన్మను సార్థకం చేసుకున్నాడు. నిష్ఠ, పట్టుదలల మహిమ అది.

ఆ రోజులలో గొప్ప విద్వాంసురాలయిన విద్యోత్తమ రాజకుమారితో శాస్త్రార్థాలు చేసి ఓడిపోయిన కొంతమంది విద్వాంసులు ఆమెమీద కోపంతో మోసం చేసి, ఆమె కాళిదాసును వివాహం చేసుకునేటట్లు ప్రయత్నించారు. దైవికంగా వారి ప్రయత్నం ఫలించింది.

విద్యోత్తమా, కాళిదాసులకు పరిచయం ఏర్పడింది. ఏర్పడిన మొదటి క్షణంలోనే విద్వాంసురాలయిన విద్యోత్తమ మూర్ఖరాజయిన కాళిదాసును గుర్తించింది. అయ్యో అంటూ తల మోదుకుంది. ఏడుస్తూ – "నాకన్న పండితుడైన భర్తను పొందాలని కోరుకున్న నేను నీవంటి మహామూర్ఖుడిని పెండ్లాడి విద్యలకు అవమానం కలిగించలేను, అజ్ఞానాన్ని ఆదరించలేను" – అని అంటూ కాళిదాసును తన గదిలోంచి బైటకు నెట్టేసింది. "పో! ఇక్కడనుంచి అవతలకుపో! నాకు మోసం జరిగింది." – అని మొత్తుకుంది.

కాళిదాసుకు గొప్ప ఎదురుదెబ్బ తగిలింది; అతని ఆత్మకు ఒక కుదుపు కలిగింది. అవమాన దుఃఖంలో మునిగిన కాళిదాసు ఒక్కసారి ఆశ్చర్యంగా కళ్లుతెరచి, సాహసంతో లేచి నిలబడ్డాడు. అతనిలోపల అచేతనంగా పడి ఉన్న మనుష్యత్వం యొక్క గాఢనిద్ర పటాపంచలయింది. తనకు అవమానం జరిగిందన్న బాధ నరనరాలలో వ్యాపించి గుండెను పిండుతోంది. ఐతే ఆ బాధకన్నా ఎక్కువగా విద్యోత్తమయొక్క కన్నీళ్లు, వాటి వెనుకగల ఉత్తమము, ఉజ్వలమునైన బాధ్యత మీదగల కోరిక బాధపెట్టింది అతనిని.

నిద్ర నుంచి మేలుకున్నాడు కాళిదాసు. ఆలోచించడం మొదలుపెట్టాడు. "ఈ భారతీయ లలన మరో పెండ్లి చేసుకోదు. అంత గొప్ప, విలువైన జీవితాన్ని సంతాప, పశ్చాత్తాపాల నిప్పులో దహించి వేసుకోవడమూ! సమాజానికి పట్టిన ఈ పతనానికి కేవలం నేను చదువులేని మూర్ఖుడను కావడమే కారణంగదా! నేనే నిర్మలమైన సంసార సుఖాన్ని పొందడానికి తగిన యోగ్యత కలవాడినైతే ఎంత బాగుంటుందో కదా!" – అన్న ఆలోచన కలిగిం దతనికి. వెంటనే అతని అంతరాత్మ నుండి "సంకల్ప బలం, ప్రయత్నములవలన జరగని దేముంటుంది" – అన్న హెచ్చరిక వినబడింది. కాళిదాసు లేచి వెళ్లిపోయాడు. విద్యోత్తమ కన్నీళ్లు కారుస్తూ కూలబడిపోయింది.

అంతే! ఆ తరువాత పది పన్నెండు సంవత్సరాల వరకు కాళిదాసుకు ఈ లోకంతోనే సంబంధం లేకుండా పోయింది. చదువులో మునిగిపోయాడు. పగలు రాత్రులు గానీ, ఉదయ సాయంకాలాలు గానీ ఎప్పుడు వచ్చాయో, ఎప్పుడు పోయాయో అన్నది తెలియకుండా పోయింది కాళిదాసుకు. ఆ పది పన్నెండేళ్ల సమయంలో అతనికి తెలిసినదల్లా ఒకే ఒక్కటి. అది ఏకాగ్రత, చదువుకోవడం.

కాళిదాసు చదువన్న తపస్సు యొక్క ఆఖరు అంచుకు చేరి, పొందవలసింది పొంది బయలుదేరాడు. విద్యోత్తమ అదే బాధతో తన గదిలోనే కూర్చుండి పోయింది తలుపులు బిగించుకుని. ఒక రోజున తన గది తలుపులు తడుతూ శుద్ధ సంస్కృతంలో పిలిచిన పిలుపు వింది. "ప్రియతమా! ద్వార కపాటం దేహి!" అని వినబడింది. ఆమె వెంటనే లేచి తలుపు తెరిచింది. ఎవరంటూ చూచింది. "నేనూ. మహామూర్ఖుడనైన కాళిదాసుని" – అని ముసిముసి నవ్వులతో సమాధాన మిచ్చాడు. విద్యోత్తమ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇప్పు డామె మూర్ఖ కాళిదాసు భార్య కాదు; మహాకవి కాళిదాసుకు ప్రేరణను ఇచ్చిన మహిళామణి. వారిద్దరూ మళ్లీ కలుసుకోవడం వలన కాళిదాసు యొక్క సాధన, విద్యోత్తమ యొక్క వేదన సఫలమయాయి, సార్థకములయాయి.

సంకల్పంతో కూడిన ప్రయత్నం, నిష్ఠల చమత్కారమిది. దీనాతిదీనులై, మూర్ఖాతి మూర్ఖులై కూడా ప్రపంచంలో అతి ఉన్నత స్థితులలో పాదం మోపి, పురుషార్థం యొక్క మహిమను ప్రకటించగలిగితే – మనం మన ప్రస్తుత స్థితి నుంచి ముందుకు సాగి శ్రేయస్సును పొందడం అక్షర సత్యం. ఇందుకు కావలసినదల్లా – ఆత్మయొక్క పిలుపు వినగలగడము, దాని శక్తిని పసిగట్ట గలగడము. అంతే.

★★★

**కల్పవృక్షం అన్ని కోరికలనూ తీర్చుతుంది. గురువు హితకరమైన కోరికలను తీర్చుతాడు.**

ధారావాహిక : వృద్ధాప్యం జీవిత నవనీతం-6

# ఆరోగ్యంగా, అవిశ్రాంతంగా, ఆనందంగా...

## సుఖం ఆత్మ లక్షణం

చిన్నలైనా పెద్దలైనా,పిల్లలైనా వృద్ధులైనా,పురుషులైనా స్త్రీలైనా - అందరికీ ఒకే కోరిక ఉంటుంది: తాము ఎప్పుడూ సుఖంగా ఉండాలని, తమకు ఎలాంటి కష్ట నష్టాలు కలగకూడదని, తాము అన్ని పరిస్థితులలో హాయిగా ఆనందంగా ఉండాలని. అయితే ఆ ఆనందపు వాస్తవిక స్వరూపం ఏమిటో వారు అర్థం చేసుకోలేరు.

కనుక సుఖాన్ని వెదకడంలో మనిషి ఎక్కువగా భౌతిక సాధనాలవైపు పరుగులు తీస్తూ ఉంటాడు. వాటివల్ల అతడికి తాత్కాలికమైన శారీరిక సుఖం లభిస్తుంది. అయితే, దీనితో పాటు అతడు అనేక మానసిక ఆందోళనలలో మునిగిపోతాడు. ఆధి వ్యాధుల విష వలయంలో చిక్కుకుంటాడు. ఈ సమస్యకు మూల కారణం ఉంది. శారీరిక సుఖాలూ, బాహ్య ఆడంబరాలూ మాత్రమే నిజమైనవని అతడు భావిస్తాడు. మజా చేయడంలో అతడు మునిగిపోతాడు.

వాస్తవానికి సుఖం అన్నది మనిషిలోని ఒక ఆంతరిక స్థితి. అది అతడి శరీరంతో ముడిపడినది కాదు, ఆత్మతో ముడిపడినది. వ్యామోహ మమకారాలు, లోభం-అత్యాశ, అసూయా ద్వేషాలు, క్రోధం మున్నగువాని నుండి తనను తాను విముక్తి చేసుకుని, అన్ని పరిస్థితులలో సంతృప్తిగా ఉండడాన్ని తన స్వభావంగా చేసుకున్నపుడే మనిషి నిజమైన సుఖాన్ని అనుభవించగలుగుతాడు. జీవితంలో మంచీ చెడూ ఏది జరిగినా, దానిని భగవానుని కృపగా అతడు పరిగణిస్తాడు. మంచి అంతా భగవానుని కృప. చెడు అంతా భగవానుని ఇచ్ఛ. ఈ విశ్వాసంతో, ఈ శ్రద్ధతో అతడు జీవన లక్ష్యాన్ని సాధించడం కోసం నిస్స్వార్థ భావంతో క్రియాశీలుడు అవుతాడు.

## అవిశ్రాంతంగా పని

జీవితంలో ఇలాంటి శాశ్వత ఆనందం కావాలంటే- మనల్ని మనం ఎప్పుడూ పనిలో నిమగ్నం చేసుకోవాలి. ప్రపంచంలో ప్రతి వ్యక్తీ ప్రతి క్షణం ఏదో ఒక పనిలో నిమగ్నం అయి ఉంటాడు. అయితే ఈ నిమగ్నత, ఈ తీరికలేనితనం ఎక్కువగా స్వార్థంపై, అసూయపై ఆధారపడి ఉంటుంది. ఇందువల్ల మరేదయినా లభించవచ్చు కాని - మనశ్శాంతి మాత్రం లభించదు. సంయమనంతో, సాత్విక భావంతో అందరికీ సంక్షేమం చేకూర్చే నిర్మాణాత్మక కార్యాలలో మనల్ని మనం పూర్తిగా నిమగ్నం చేసుకున్నప్పుడు మాత్రమే మనకు మనశ్శాంతి లభిస్తుంది. ఇందువల్ల అంతటా ప్రేమ, సహకార భావనలు కూడ వికసిస్తాయి. విరోధులుసైతం మనకు సహచరులుగా మారుతారు. దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా ఏది అవసరమో దానిలో మనం ఎల్లప్పుడూ నిమగ్నం కావాలి.

## దేహం ఒక దేవాలయం

ఆరోగ్యంగా ఉన్నప్పుడే మనం ఆనందంగానూ, పూర్తిగా నిమగ్నంగానూ ఉండగలుగుతాం. మొదటి సుఖం రోగం లేని శరీరం. ఈ శరీరాన్ని జవంతో, జీవంతో నింపే బాధ్యత మనదే. బాల్యంలో తల్లి దండ్రులూ, సంరక్షకులూ మనకు కొంత సహకారం అందించారు. అయితే, మిగతా జీవితంలో మనం స్వయంగా మన శరీర ఆరోగ్యాన్ని సంరక్షించుకోవలసి ఉంటుంది. వయస్సు పెరిగేకొలదీ మనకున్న ఈ బాధ్యత పెరుగుతూ ఉంటుంది. విశేషమైన పురుషార్థం జరపడానికే, కార్యశూరులం కావడానికే భగవంతుడు కృపతో మనకీ మానవ శరీరాన్ని ప్రదానం చేశాడు. పరమాత్మయొక్క అంశ అయిన ఆత్మకు నివాస స్థలం ఈ శరీరం. ఈ దేహం దేవాలయం. దీన్ని పవిత్రంగా, పుష్టిగా ఉంచడం మన మొదటి కర్తవ్యం. వృద్ధాప్యంలో ఈ విషయమై ప్రత్యేకమైన మెలకువ, క్రియాశీలత అవసరం అవుతాయి.

## సంయమనం, సాత్వికత

ఆరోగ్యం శరీరానికీ, మనస్సుకూ కూడ సంబంధించిన విషయం. మన శరీరాన్నీ, మనస్సునూ ఆరోగ్యంగా ఉంచడానికై మనం ప్రత్యేకమైన కృషి జరుపుతూ ఉండాలి. భగవంతుడు మనకు సర్వగుణ సంపన్నమైన శరీరాన్ని ప్రదానం చేశాడు. సాధారణంగా

ఇచ్చిన దానాన్నీ, వచ్చిన గౌరవాన్నీ మరచిపో.

ఈ శరీరం వంద సంవత్సరాల పాటు ఆరోగ్యంగా ఉండగలుగుతుంది. ఒకోసారి వంద సంవత్సరాలు మించికూడా. అయితే, ఇందుకై మనం సంయమనంతో, సాత్వికతతో కూడిన జీవన విధానాన్ని అనుసరించాలి. ఆచరణ-ఆలోచన, ఆహార - విహారాలు పవిత్రంగా ఉంటే, శరీరమూ మనస్సూ ఆరోగ్యంగా నిలిచి ఉంటాయి. భగవంతుడు మనకు ఇచ్చిన ఆయుర్దాయాన్ని, ఈ మానవ శరీరంలో ఉండేందుకు నిర్ణయించిన గడువును, మనం సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా ఈ జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి. వృద్ధాప్యంలో మనం నిస్సహాయులమై, బలహీనులమై ఇతరులకు బరువుకాకుండా ఉండాలంటే - ఇది మరింత అవసరం.

## ప్రాకృతిక జీవనం, వ్యాయామం

ప్రాకృతిక జీవనం - ప్రకృతికి అనుగుణమైన జీవితం - ఆరోగ్యానికి ఉత్తమోత్తమ సాధనం. సాధ్యమైనంతవరకు ప్రకృతి సన్నిధిలో ఉండడానికి మనం ప్రయత్నించాలి. ఈనాటి ఉరుకు పరుగుల జీవితంలో మనం అనేక కృత్రిమ సాధనాలను వాడక తప్పడం లేదు. ఇంటినుంచి బయటికి రాగానే, అన్ని వైపులా కాలుష్యం, కోలాహలం కనిపిస్తాయి. ఈ స్థితిలో మనం చేయగలిగింది - అవకాశం దొరికినప్పుడల్లా ప్రకృతివైపు పరిగెత్తడం. ఉదయం నిద్రలేవగానే కొంతసేపు ఆరుబయట నడక సాగించాలి. దగ్గరలో ఉన్న తోటలోకి, పార్కులోకి, పొలంలోకి లేదా నది ఒడ్డుకు వెళ్లి, స్వచ్ఛమూ పవిత్రమూ అయిన గాలిలో దీర్ఘంగా శ్వాస తీసుకుని, జీవశక్తిని మీలో నింపుకోవాలి. మీ ఇంటిలో కూడ ఖాళీ స్థలంలో మొక్కలు నాటండి. తులసి మొక్క ప్రతి ఇంటిలో ఉండితీరాలి. ఖాళీ స్థలం లేకపోతే, కుండీలలో మొక్కలను పెంచవచ్చు. ఇందువల్ల కాలుష్యం తగ్గుతుంది. పవిత్రత పెరుగుతుంది. ఇంటి అందం పెరుగుతుంది.

వృద్ధాప్యంలో శారీరికమైన క్రియాశీలత బాగా తగ్గిపోతుంది. అయినా మనం నిష్క్రియంగా చేతులు ముడుచుకుని కూర్చొనకూడదు. తేలిక అయిన వ్యాయామం లేదా యోగాసనాలు తప్పక వేయాలి. నడక అన్నిటికన్న మంచి, ప్రమాదంలేని, సులభ వ్యాయామం. మీ వయస్సుకూ, మీ అభిరుచికీ అనుగుణంగా తగు వ్యాయామాన్ని నిర్ణయించుకోండి. దాన్ని నియమబద్ధంగా చేయండి. నిష్క్రియమైన జీవితంవల్ల, సోమరి జీవితంవల్ల శరీరంలోని రోగనిరోధక శక్తి క్షీణిస్తూపోతుంది. రోగాలు తేలికగా మనల్ని వశపరచుకుంటాయి. మరోప్రక్క - ప్రాకృతికమూ, సక్రియమూ అయిన జీవన విధానంవల్ల, వ్యాయామంవల్ల శరీరం పుష్టి అవుతుంది; రోగాల ఆక్రమణను తేలికగా త్రిప్పికొడుతుంది.

ఈ నియమాలను పాటించిన తర్వాతకూడ ఏదైనా జబ్బు వస్తే, ప్రాకృతిక సాధనాలతో దానికి చికిత్స చేయాలి. రోగాణువులతో పోరాడే అపార శక్తి ఈ శరీరంలో నిలచి ఉంది. మనలోని ఈ శక్తిమీద భరోసా ఉంచాలి. కొద్దిగా సమయం పట్టినప్పటికీ, రోగం దానికదిగా పారిపోతుంది. తప్పనిసరి అయినప్పుడు మాత్రమే కృత్రిమ చికిత్సా విధానాలను ఆశ్రయించాలి. వీటివల్ల రోగం త్వరగా నయమవుతుంది. కానీ, అనేక ఇతర రోగాలకు ఇవి జన్మ నిస్తాయి. కనుక వీటికి దూరంగా ఉండడమే మంచిది.

## జిహ్వా చాపల్యం తగదు

నాలుకను అదుపులో ఉంచుకోవడం ఆరోగ్యానికి అత్యవసరం. జనం జిహ్వా చాపల్యం వల్ల మసాలాలు కలిగిన బరువైన భోజనాన్ని పీకదాకా ఎక్కిస్తూ ఉంటారు. అలాంటి భోజనం తేలికగా జీర్ణం కాదు. అది శరీరంలో అనేక వికారాలను ఉత్పన్నం చేస్తుంది. ఈ వికారాలు ఆ తర్వాత పెక్కు తీవ్ర రోగాలకు జన్మ నిస్తాయి. 40-50 సంవత్సరాల వయస్సు తర్వాత జీర్ణ వ్యవస్థయొక్క పటుత్వం క్షీణిస్తుంది. ఆ స్థితిలో సాధ్యమైనంతవరకు తేలికయిన, సాదా అయిన, సులువుగా జీర్ణమయే భోజనాన్నే తీసుకోవాలి. ఆయా ఋతువులలో చౌకగా దొరికే పండ్లు, కాయగూరలు, పాలు, తేనె వంటివి ఎక్కువగా సేవిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. తామసిక, రాజసిక భోజనాన్ని వదలివేయాలి. సాత్విక భోజనాన్నే ఇష్టపడాలి. వృద్ధులు స్వయంగా ఈ విషయంలో మెలకువ వహించవలసి ఉంటుంది.

## మానసిక ప్రసన్నత

ప్రసన్నత జీవితంలో అన్నిటినీ మించిన శక్తి. దీనివల్ల శరీరమూ, మనస్సూ ఆరోగ్యంగా, పుష్టిగా ఉంటాయి. ప్రతి

**వేదాన్ని మనం కాపాడితే, వేదం మనల్ని కాపాడుతుంది.**

పరిస్థితిలో, ప్రతి సందర్భంలో ప్రసన్నంగా ఉండడాన్ని స్వభావంగా చేసుకోవాలి. జీవితంలో కష్టాలు వస్తూనే ఉంటాయి. వాటిని ప్రసన్నతతో ఎదుర్కోవాలి. ఇందువల్ల మన శరీరిక, మానసిక శక్తులు వికాసం పొందుతాయి. జీవన ఆనందం రెట్టింపు అవుతుంది. పసిపిల్లలవలె గలగలా నవ్వుతూ ప్రసన్నంగా ఉండడంవల్ల శరీరం ఎలాగూ ఆరోగ్యంగా ఉంటుంది; అనేక మానసిక ఉద్రిక్తతల నుండి కూడ విముక్తి లభిస్తుంది.

ఎల్లప్పుడూ జీవితంపట్ల భావాత్మక, నిర్మాణాత్మక దృక్పథాన్ని కలిగి ఉండాలి. కొందరి స్వభావం ఇందుకు విరుద్ధంగా ఉంటుంది. వారికి ప్రతి స్థితిలోనూ ఏదో ఒక చెడు కనిపిస్తుంది. ప్రతి వ్యక్తీ శత్రువులా కనిపిస్తాడు. వారు ఎప్పుడూ ఏదో ఒక చింతలో మునిగి ఉంటారు. తనను గురించి చింత. కుటుంబం గురించి చింత. ఉద్యోగ వ్యాపారాలను గురించి చింత. ఇంతకు మించి – తాను చనిపోయిన తర్వాత ఏమవుతుందో అనే చింత. ప్రాపంచిక మాయా మోహంలో, లోభ–అత్యాశలలో మునిగిపోయిన వ్యక్తిని చింత అనే ఈ రోగం విపరీతంగా వేధిస్తుంది. ఇలా చింతించడంవల్ల శరీరమూ, మనస్సూ దెబ్బతింటాయి. ఈ అకారణ చింతకు మనల్ని మనం దూరంగా ఉంచుకోవాలి.

అయితే – మనం మన కర్తవ్యాలను నిర్వహించ కూడదన్నది కాదు దీని అర్థం. కుటుంబం, ఉద్యోగం, వ్యాపారం, తాను – వీటిపట్ల మనకు గల కర్తవ్యాలను మనం పూర్తి నిష్ఠతో నిర్వహించాలి. నిస్వార్థంగా, చింత నుండి విముక్తి పొంది–కర్మ చేయాలి. వ్యతిరేకాత్మక దృక్పథాన్ని వదులుకోవాలి.

మన జీవన విధానాన్ని ఇలా సంయమనంతో, నియంత్రణతో సాగిస్తే – మనం సదా మానసికంగా, శారీరికంగా ఆరోగ్యంగా నిలచి ఉంటాం. ఆరోగ్యంగా ఉంటే, నిర్మాణాత్మక కార్యాలలో మనం పూర్తిగా నిమగ్నులం కాగలుగుతాం. ఫలితంగా – చివరి క్షణం వరకు జీవితాన్ని సుఖ శాంతులతో, ఆనందంగా, హాయిగా గడుపుతాం. మానవ జీవితానికి సార్థకత ఇదే. ఇందువల్ల వృద్ధాప్యం కూడ ఆనందమయం అవుతుంది.

*– సమాప్తం –*

## సవాళ్ళను ఎదుర్కోవాలి

ఒకప్పటి సంగతి. స్వామి రామతీర్థ ఇంకా సన్యాసం పుచ్చుకోలేదు. ఆయన అప్పుడు ఎం.ఏ. చదువుతున్నారు. అప్పటి పేరు తీర్థరామ్. గణితశాస్త్రం ఆయనకు ప్రీతి పాత్రమైన విషయం. ఆయనకు ఒక అలవాటు ఉండేది. ప్రశ్నాపత్రంలో, 'ఏవైనా ఏదు లెక్కలు చేయండి,' అని వ్రాసి ఉంటే ఆయన వదలి పెట్టకుండా అన్ని లెక్కలూ చేసేవారు. ఫలానా లెక్క తాను చేయలేక పోయినానని అనిపించుకోవడం వారికి ఇష్టం ఉండేది కాదు. మర్నాడు లెక్కల పరీక్ష. సాయంత్రం నుండి తీర్థరామ్ లెక్కలు చేస్తూ కూర్చున్నాడు. రాత్రి ప్రొద్దు పోయింది. ఒక లెక్క రాలేదు ఎంతకూ జవాబు రాక చికాకు పెడుతోంది. ఐనా పట్టు వీడక విశ్వాసంతో దాన్ని చేస్తూనే కూర్చున్నాడు తీర్థరామ్. ఒక్క లెక్క కొరకు ఇంతగా సతమతమౌతుంటే చూచి తోటి విద్యార్థులు అన్నారు, 'తీర్థరామ్! పరీక్షలో ఈ ఒక్క లెక్క మాత్రమే వస్తుందా? దీనిని ప్రక్కన ఉంచి మిగతా లెక్కల వైపు దృష్టి పెట్టకూడదా?' తీర్థరామ్ ఇలా అన్నారు, 'పరీక్షలలో ఈ లెక్క వస్తుందా, రాదా అన్నది సమస్య కాదు. అసలు ఈ లెక్క నాకు ఎందుకు రావటం లేదు? ఇది నా ముందున్న సవాల్. దీనికి నేను జవాబు కనుక్కొని తీరుతాను. ఇది నా విశ్వాసం.' నిజానికి ఆ లెక్క జటిలమైన లెక్కే. దానికి జవాబు రావటంలేదు. తీర్థరామ్ ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. తెల్లవారి పోయింది. పరీక్ష మొదలు కావటానికి ఇంకా రెండుగంటల సమయం మాత్రమే ఉంది. పరీక్షలో ఏ ఒక్కలెక్కా వదలిపెట్టిరాకూడదు. ఇది తీర్థరామ్ కోరిక. ఇంతలో అతను తటాలున లేచారు గడియారానికి అలారం పెట్టారు. మళ్ళీ అదే లెక్కను ముందుపెట్టుకుని కూర్చున్నారు. మిత్రుడు చెప్పి చూశాడు. కాని ఆ సమస్యను పరిష్కరించకుండా పరీక్షలో కూర్చునేందుకు తీర్థరామ్ సిద్ధంగా లేరు. అతని మిత్రుడు 'తీర్థరామ్‌కు పిచ్చెక్కింది' అని అనుకున్నాడు. అతనికి కూడా దిగులు పట్టుకొంది. ఐదు నిమిషాలు ఐందోలేదో, లెక్కకు జవాబు రానే వచ్చింది. అప్పుడు మిత్రులన్నారు, 'లెక్కను చేయటంలో ఈ ఉపాయం గొప్పదిగా ఉంది. అదిసరే కాని, లెక్కకి జవాబు రాకపోయి ఉన్నట్లైతే నీవు పరీక్షకే వెళ్ళవా?' రామతీర్థ ఇలా బదులు చెప్పారు, 'నేను ఎవరినీ మోసం చేయలేదు. నాకు ఒక సవాలు ఎదురైంది. దానిని నేను స్వీకరించాను. దానిని పరిష్కరించలేకపోతే ఇక నేను జీవించి ఏమి లాభం?' అతని విశ్వాసాన్ని, పట్టుదలను చూచి మిత్రులు మిక్కిలి ఆనందించారు.

పూర్తి విశ్వాసంతో పనిచేస్తే అంకగణితం, బీజగణితమే కాదు, జీవితంలో క్లిష్టమైన సమస్యలు కూడా పరిష్కారమౌతాయి.

**ప్రత్యక్ష అనుమాన ప్రమాణాలకు అతీతమైనది వేదం.**

## ధారావాహిక : సమాజానికి వెన్నెముక వానప్రస్థం-6

# వానప్రస్థం - ఉత్తమం, మధ్యమం, కనిష్టం

### వానప్రస్థుడు నిజమైన బ్రహ్మవేత్త

ఒక మహత్తర జీవన దర్శనానికి ఆచరణ ప్రక్రియ వానప్రస్థం. అయితే, ఉన్నత స్థాయి ఆలోచనను ఆదర్శవాద విధానంగా అమలు పరచడం కష్టసాధ్యం. ఆదర్శవాదంతో కూడిన విద్య వ్యక్తిత్వాన్ని మహత్తరంగా, శ్రద్ధామయంగా తీర్చిదిద్దుతుంది. దానివల్ల ఆంతరిక సంతృప్తి కలుగుతుంది. ఆత్మ కళ్యాణానికి పునాది ఏర్పడుతుంది. సమాజాన్ని సమున్నతం చేసే అవకాశం కలుగుతుంది. అయితే- వ్యక్తికి ఉండే సుఖ సౌకర్యాలను తగ్గిస్తుంది. కనుక - తన శరీరానికీ, మనస్సుకూ, కుటుంబానికీ అతీతంగా ఆలోచించడం లౌకికుడైన వ్యక్తికి కష్టం. ఈనాడు ఆదర్శవాదం మాటల గారడీగా మిగిలిపోతోంది.

ఆదర్శాన్ని ఆచరణలోనికి తెచ్చే మహత్తర బాధ్యతను వానప్రస్థుడు వహించవలసివస్తుంది. కనుకనే- వానప్రస్థుడు నిజమైన బ్రహ్మవేత్త; అతడు ఉపదేశకుడు, వక్త, ప్రచారకుడు కూడ.

వక్తృత్వం సమాచారాన్ని అందిస్తుంది: ఆసక్తిని రేకెత్తిస్తుంది. అయితే, అనుకరించదగిన ఆదర్శ జీవనాన్ని ప్రత్యక్షంగా చూచినప్పుడే ప్రేరణ కలుగుతుంది. క్రిందికి దిగజార్చే పని మాట ద్వారా, కలం ద్వారా సాధ్యపడవచ్చు. కానీ, స్వయంగా శిఖరాగ్రాన్ని అందుకున్న వ్యక్తి మాత్రమే ఇతరులను ఉద్ధరించగలుగుతాడు. స్వయంగా మునిగిపోతూన్నవాడు మునిగిపోతున్న ఇతరులను ఎలా పైకి లేవదీయగలడు? కాలుష్యంలో మునిగినవాడు ఇతరులను ఎలా క్షాళన చేయగలడు? వానప్రస్థుడు లోక కళ్యాణ కార్యాన్ని తనతో మొదలుపెట్టాలి. అతడు మామూలు వ్యక్తి ఎదుట తన ఆదర్శాన్ని ఉంచాలి. సేవ, త్యాగం అనేవి వట్టి మాటలు కావనీ, వాటిని ఆచరణలో చూపవచ్చనీ రుజువు చేయాలి.

### యుగ నాయకత్వం వానప్రస్థులది

ప్రజలకు శిక్షణ గరపడానికి సమర్థవంతమైన మార్గం ఇదే. సమగ్రమైన పునరుద్ధరణ కోసం, నవ నిర్మాణం కోసం సామాన్య ప్రజలు కొన్ని కష్టాలను అనుభవించవలసి ఉంటుంది, కొంత త్యాగం చేయవలసి ఉంటుంది, కొంత దానం ఇవ్వవలసి ఉంటుంది. ఈ పెట్టుబడి ఆధారంగానే ప్రగతి భవనం నిర్మాణం అవుతుంది. జనానికి ఈ ఆదర్శాలు అర్థం అవుతాయి. కానీ, వాటికోసం ఏదైనా ఇచ్చే సాహసం వారికి ఉండదు. ఫలితంగా- గొప్ప గొప్ప పథకాలు కాగితాల మీదనే ఉండిపోతున్నాయి. సృజన కోసం ప్రజలను సన్నద్ధులను చేయడం సులభం కాదు. తాము స్వయంగా ఆ దిశలో ముందడుగు వేసినవారే ఆ పని చేయగలుగుతారు.

వానప్రస్థుడు తన నిత్య జీవితం ద్వారా ఆ అర్హతను సంపాదించాలి. దేశ ధర్మాల కోసం ఎంతో కొంత ఇవ్వడానికై ప్రజలను ఆ అర్హత ద్వారా ఒప్పించగలగాలి. భౌతిక ప్రయోజనాలను పొందడంలో మునిగితేలే నాయకుల నోట త్యాగ బలిదానాల మాటలు దెయ్యాలు వేదాలు వల్లించడంగా ఉంటాయి. యుగనాయకత్వపు మహత్తర బాధ్యతను చేపట్టే అర్హత వానప్రస్థులకు ఉన్నది.

### వానప్రస్థంలో కలపాలి సన్యాసాన్ని

ప్రాచీన కాలపు సన్యాసాన్ని ఇప్పుడు వానప్రస్థంలో విలీనం చేయాలి. సన్యాసుల వేషంలో అవాంఛనీయ వ్యక్తులు అధిక సంఖ్యలో చేరి, సన్యాస ఆశ్రమ ప్రతిష్ఠను దెబ్బతీశారు. పైగా ఈనాడు అకర్మణ్యత, ఇతరుల మీద బ్రతకడం, సేవాధర్మం పట్ల విముఖత, ఆడంబరం, మూఢ నమ్మకాలు సన్యాసంతో ముడిపడి ఉంటున్నాయి. భిక్షా వృత్తి ప్రజల ఆగ్రహానికి గురి అవుతోంది. కనుక- సన్యాసాన్ని వానప్రస్థంలో విలీనం చేసి, సహజ సులభమైన పరమార్థ జీవన ప్రక్రియను అవలంబించడం యుగానికి అనుగుణమైన చర్య.

### వానప్రస్థ జీవన దర్శనం

వ్యక్తిగతమైన సుఖ సౌకర్యాలను కనీస స్థాయికి చేర్చి

**కర్తవ్యాన్ని నిర్వహించు. కానీ, మమకారాన్ని వదులుకో.**

సంయమనంతో, మిత వ్యయంతో జీవించడం వానప్రస్థుని విధానం. వానప్రస్థుడు పిల్లలను కనకూడదు. ఆంతరిక స్థాయిని సంస్కరించడానికై సద్జ్ఞానాన్ని ఆర్జించాలి, తపస్సు చేయాలి. జ్ఞానయజ్ఞ జ్వాలను తీవ్రతరం చేయడానికై సేవా సాధనలో నిరంతరం నిమగ్నం కావాలి. ఇదే వానప్రస్థ జీవన దర్శనం. కుటుంబ బాధ్యతల బరువు లేకపోతే ఈ దర్శనాన్ని జీవితంలో అమలు చేయడం తేలిక అవుతుంది. ఆ బరువు ఉన్నా-పరమార్థ ప్రయోజనాల కోసం సమయాన్నీ, శక్తినీ అంకితం చేయడానికి అడ్డు రానంత కనీస స్థాయిలో ఉండాలి.

వాస్తవానికి-వానప్రస్థుని బాధ్యతలు గృహస్థ బాధ్యతలకన్న ఎన్నో రెట్లు హెచ్చు. కనుక-పై అర్హత లేకుండా వానప్రస్థం గురించి ఆలోచించడం వ్యర్థం.

## వానప్రస్థ సంస్కారం

వానప్రస్థ సంస్కార విధి సరళమైనది. యజ్ఞం, దేవ పూజనం, ప్రముఖులు పాల్గొనడం, వ్రత ధారణ, కౌపీన ధారణ, దండ ధారణ, పసుపు బట్టలు ధరించడం, జల కలశముల అభిషేకం, మంగళ మంత్రాల పఠనం, వివేచన, ప్రవచనం మున్నగు ప్రక్రియలతో ఈ సంస్కారం ఒకటి రెండు గంటలలో పూర్తవుతుంది. ప్రాచీన కాలంలో వానప్రస్థంలో భార్యను వెంట ఉంచుకునేవారు. అయితే బ్రహ్మచర్యాన్ని అక్షరాలా పాటించేవారు.

బాహ్య దృష్టిలో ఈ కర్మకాండ చాలు. మౌలిక విషయం కార్యకలాపాలకు సంబంధించినది. వానప్రస్థుడు పరమార్థ ప్రయోజనాల కోసం ఇచ్చే సమయాన్నీ, శక్తినీ పెంచడం తప్పనిసరి.

వానప్రస్థాన్ని మూడు స్థాయిలుగా విభజించవచ్చు.

## ఉత్తమ స్థాయి వానప్రస్థం

ఉత్తమ స్థాయి వానప్రస్థంలో వ్యక్తి మొదట కుటుంబ బాధ్యతలను విశ్వాసపాత్రులు, నిష్ఠావంతులు అయిన కుటుంబంలోని ఇతర సభ్యులకు అప్పగిస్తాడు. కొత్త జీవన విధానపు సిద్ధాంతాలను తెలుసుకుంటాడు. వాటి ఆచరణలో అనుభవం సంపాదిస్తాడు. ఆ తర్వాత విశ్వమానవ సేవా సాధనలో నిమగ్నం కావాలి. స్వాధ్యాయానికీ, యోగ సాధన తపశ్చర్యకూ, సేవా సాధనకూ సమయాన్ని కేటాయిస్తూ తన దినచర్యను రూపొందించుకోవాలి. సేవా సాధనలో జ్ఞానయజ్ఞానికి ప్రాధాన్యం ఇవ్వాలి. దాని తర్వాత నిర్మాణాత్మక, సంఘర్షణాత్మక కార్యాలను చేపట్టాలి. భావ విప్లవం, బౌద్ధిక సంస్కరణ, భావనాత్మక నవ నిర్మాణములకు సంబంధించిన సేవా కార్యాలను నిర్వహించాలి. ఈ పని ప్రత్యక్షంగా కనపడదు. దాని ఫలితం భవనం వలె కళ్లకు కనిపించదు. కనుక మామూలు వ్యక్తులు దీన్ని గురించి పట్టించుకోరు. మనం మాత్రం - ఆపద్ధర్మంగా కేవలం జ్ఞానయజ్ఞాన్నే స్వీకరించాలి.

ఉత్తమ స్థాయి వానప్రస్థుడు పరివ్రాజక జీవితాన్ని స్వీకరిస్తాడు. అతడు ఆశ్రమం ఏర్పరచుకుని కూర్చొనడు. సత్ప్రవృత్తుల అంకురాలు మొలచిన స్థలాలకు వెళ్లి, వాటికి నీళ్లు పోయడానికై నిరంతరం పర్యటిస్తూ ఉంటాడు.

జనం ఆరంభ శూరత్వంలో పలు విధములైన సత్ ప్రవృత్తులను ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఉత్సాహం చల్లబడుతుంది. వారు నీరసించిపోతారు. వ్యక్తులు ఆవేశంతో పరమార్థ పథంలో పయనించడానికి ముందుకు వస్తారు. ఆ తర్వాత జోరు తగ్గి చతికిలపడతారు. ఇలాంటి వ్యక్తులను సంపర్కం చేసి, వారిలో ఉత్సాహాన్ని తిరిగి మేలుకొలపాలి. ఇందుకు ఉపదేశం చాలదు. భుజం భుజం కలిపి, అడుగులో అడుగు కలిపి పని చేయవలసి ఉంటుంది. వానప్రస్థుడు ఈ పనిని నిరంతరం కొనసాగించాలి. కొత్త స్థలాలలో జాగృతిని కలిగించడం అవసరమే. అయితే మొట్టమొదటి ఆవశ్యకత నీళ్లూ, ఎరువూ లేక వాడిపోతూన్న మొక్కలకు వాటిని అందించి అవి పుష్పించి ఫలించేటట్లు చేయడం. వానప్రస్థుడు ఇందుకోసం పర్యటించాలి.

ఈ పరివ్రాజక జీవనం బౌద్ధమతంలో విడదీయరాని అంశం. అంతకు ముందు సాధువులూ, బ్రాహ్మణులూ, వానప్రస్థులూ ఈ పనికి అంకితం అయేవారు. మబ్బులు అన్నిచోట్లకూ వెళ్లి వర్షం కురిపిస్తాయి. వానప్రస్థులైన పరివ్రాజకులు కూడ - మబ్బులు వర్షంగా మారి తమ మనుగడను కోల్పోయిన విధంగా - తమను తాము కరిగించుకోవాలి.

వానప్రస్థుడు కుటుంబ తాపత్రయాలను వదలి పరివ్రాజకుడుగా బయలుదేరడానికి ఒక ఉపమానం ఉంది. గతంలో శత్రువు యొక్క విశాల సైన్యాన్ని ఎదుర్కొనడానికై

**మనందరిదీ ఉన్మాద అవస్థే; అది దైవ ఉన్మాదంగా మారాలి - స్వామి రామతీర్థ.**

సైనికులు గుర్రాలు ఎక్కి 'జుహార్' చేసేవారు. కోడనుండి బయలుదేరి, పోరాడుతూ పోరాడుతూ శత్రు సైన్యంలో తమను ఆహుతి చేసుకునేవారు. వానప్రస్థుల సేన అసురత్వంతో ఆవిధంగా పోరాడాలి. భావ విప్లవ ఖడ్గాన్ని త్రిప్పుతూన్న అతడి తల నరకబడినా, మొండెం లేచి పోరాడాలి.

## మధ్యమ స్థాయి వానప్రస్థం

తమ కుటుంబంతోనే ఉంటూ దగ్గర స్థలాలలో పని చేయడం మరింత సౌకర్యంగా ఉంటుందని భావించేవారు మధ్యమ స్థాయి వానప్రస్థులు. వారు తమ కుటుంబానికి మార్గదర్శనం చేస్తారు, సలహాలు ఇస్తారు, సహకారం అందిస్తారు. అయితే, పరమార్థ ప్రయోజనమే తమ ప్రధాన లక్ష్యంగా పరిగణిస్తారు. ఇంటిలో ఉంటూ కూడ, తామరాకు మీద నీటిబొట్టులా, అంటీ అంటనట్లు ప్రవర్తిస్తారు. ఏకాంతం కోసం తమ ఇంటిలోని ఒక భాగంలో కాని, దేవాలయం వంటి స్థలాలలో కాని కాలం గడుపుతూ విరక్తి భావంతో జీవిస్తారు.

## కనిష్ట స్థాయి వానప్రస్థం

కనిష్ట స్థాయి వానప్రస్థంలో కుటుంబ బాధ్యతల నిర్వహణ కూడ కలిసి ఉంటుంది. పిల్లలు చిన్నవాళ్లు. భార్య జబ్బుమనిషి. మరికొన్ని సమస్యలు ఉంటాయి. కనుక, వ్యక్తి ఇల్లు వదలివెళ్లడం కష్టమవుతుంది. కుటుంబం కోసం సంపాదించడం కూడ తప్పనిసరి అవుతుంది. ఇలాంటి స్థితిలో కనిష్ట వానప్రస్థాన్ని స్వీకరించవచ్చు.

ఇందులో రెండు షరతులు ఉన్నాయి. పిల్లలను కనడాన్ని నిలిపివేయాలి. రోజులో కనీసం నాలుగు గంటలు జ్ఞాన యజ్ఞానికి కేటాయించాలి. సాధారణంగా వ్యక్తి 7 గంటలు నిద్రకు, 5గంటలు స్నాన భోజనాదులకు, 8 గంటలు సంపాదనకు కేటాయించవచ్చు. 4 గంటల సమయాన్ని పారమార్థిక కార్యాలకు వినియోగించవచ్చు.

★★★

## దేశం కోసం - ధర్మం కోసం

ఈ సంఘటన జరిగి 657 సంవత్సరాలు దాటాయి. కంచి కామకోటి పీఠాధిపతి కాంచీనగరంలో తమ శిష్యులతో పాటు ఆసీనులై ఉన్నారు. ఇష్టాగోష్ఠి జరుగుతూంది. స్వామిజీ శ్రీ విద్యాతీర్థకు తమ శిష్యులను పరీక్షిద్దామన్న సంకల్పం కలిగింది. ప్రతి శిష్యుడినీ పిలిచి వారు ఒకే ఒక ప్రశ్న అడుగుతున్నారు - 'నీ లక్ష్యం ఏమిటి? జీవితంలో నీవు ఏమి సాధించుదామని అనుకుంటున్నావు?'

ప్రతి శిష్యుడూ తన అభిరుచునిబట్టి జవాబు చెబుతున్నాడు. ఒక శిష్యుడు చెప్పాడు, 'రాజానుగ్రహం పొంది నేను ఉన్నత పదవిని సంపాదిస్తాను.' వెంకటనాథుడు చెప్పాడు, 'నేను శ్రీ ఆదిశంకరాచార్య బోధలు ప్రచారం చేస్తాను. వేదాలలో, ఉపనిషత్తులలో శిక్షణ ఇవ్వాలని కూడా నాకు అభిలాష.'

'సుదర్శనభట్టూ, నీవేమి చేయదలచుకున్నావు?' 'నేను శ్రీరంగనాథుని సేవకై నా జీవితాన్ని సమర్పించదలచుకున్నాను.'

భోగనాథుణ్ణి కూడా అతని లక్ష్య మేమిటని స్వామీజీ అడిగారు. అతడు జవాబు చెప్పాడు. 'నేను గొప్ప పండితుడుగా పేరు తెచ్చుకుందా మనుకుంటున్నాను.' సాయణుడు, 'తర్కశాస్త్రంలోని విధానాలన్నిటిని అధ్యయనం చేసి వాటి నిగ్గుతేల్చుదామనుకుంటున్నా'నని అన్నాడు.

చివరకు స్వామీజీ మాధవుణ్ణి ప్రశ్నించారు. మాధవుడు ఇలా చెప్పాడు, 'మానవుడు అహంకారానికి దాసుడై ఉన్నంతకాలం ఏదీ పొందలేడు. భగవంతుడు అనుగ్రహిస్తే నేను నా యావజ్జీవితాన్ని మానవాళి సేవలో గడుపుదా మనుకుంటున్నాను. మన దేశాన్ని, మన ధర్మాన్ని రక్షించేందుకు నా జీవితాన్ని అర్పిస్తాను.'

విద్యాతీర్థస్వామి మాధవుని జవాబు విని పులకితులైనారు. మాధవుని వంటి శిష్యుడు లభించినందుకు వారికి హర్షం కలిగింది. ఆయన మాధవుణ్ణి తన హృదయానికి హత్తుకొని ఆశీర్వదించారు - 'నీకు లక్ష్య సిద్ధి కలుగుగాక!'

అటుపిమ్మట మాధవుడు సన్యాస దీక్షను గ్రహించి మాధవాచార్యుడు అయినారు. విద్యారణ్యస్వామి అయినారు. తన పాండిత్యం, జ్ఞానం ఆధారంగా శృంగేరీ పీఠంలో శంకరాచార్య పదవిని 12 ఏండ్లపాటు అలంకరించారు.


**ఈశ్వరుడు ధరించిన వేషం నీవు; నీ ద్వారా ఆయనను నటించ నివ్వు - శ్రీ అరవింద యోగి**

## ధారావాహిక : దివ్యజీవన దర్శనం-33

# స్వాతంత్ర్య యజ్ఞంలో ఆహుతి-5

### సూరజ్ పాల్ గృహంలో ఆశ్రయం

జనవరి మొదటి వారంలో ఈ దమనకాండ ప్రారంభమయింది. దీనినుండి తప్పించుకుని శ్రీరామ్ కార్యాలయం నుండి వెలుపలికి వచ్చారు. న్యూస్‌ప్రింట్ కాగితాల కట్టను ఆయన తనవెంట తెచ్చుకున్నారు. అక్కడ ఉంచిన బట్టలను, ఇతర అవసర వస్తువులను మూటకట్టి తెచ్చుకోవాలని ఆయన అనుకున్నారు. కానీ, వాటి బదులు కాగితాలు తీసుకువెళ్లడమే మంచిదని ఆలోచించారు. ఆ కాగితాలు వార్తలు వ్రాయడానికీ, గోడలమీద అంటించడానికీ పనికివస్తాయని ఆయన భావించారు.



శ్రీరామ్ కార్యాలయం నుండి రహస్యంగా వెలికివచ్చి ఆవల్‌ఖేడా వెళ్లలేదు. అక్కడికి పోలీసులు వచ్చే ప్రమాదం ఉంది. ఆయన సరాసరి జరార్ గ్రామానికి వెళ్లారు. తాత్కాలికంగా అక్కడ బస చేశారు. దొనోరియాజీ గృహం కూడ సురక్షితం కాదు. ఉద్యమంలో ఆయన చురుకుగా పాల్గొంటున్నారు. కనుక, పోలీసులు అక్కడ ప్రత్యక్షమయే ప్రమాదం ఉంది. రెండు రోజుల తర్వాత ఆయన సూరజ్ పాల్ వద్దకు వెళ్లారు. కొద్ది రోజుల పాటు మీ తోటలలో ఎక్కడయినా ఉండడానికి ఏర్పాటు చేయండి–అని అతడిని అడిగారు.

సూరజ్‌పాల్ అక్కడి జాగీర్దారు. అతడిని ఆశ్రయం అడగడం ఆపదను కొనితెచ్చుకోవడం వంటిదే అవుతుంది. కానీ, సూరజ్ పాల్‌కు గతంలో జరిగిన సంఘటన గుర్తుంది. శ్రీరామ్ అపుడు అతడికి సాయపడ్డారు. అందువల్లనే దొనోరియాజీ ధర్నా ప్రమాదం నుండి అతడు బయటపడ్డాడు. ఆ తర్వాత జాతీయ ఉద్యమంలోని పెక్కు సంఘటనలను అతడు కళ్లతో చూచాడు, చెవులతో విన్నాడు. హృదయాన్ని కదిలించే సంఘటనలు అవన్నీ. ఆగ్రా కలక్టరు విలియమ్స్ వరుసగా పంపుతూన్న బెదిరింపులు కూడ అతడి కళ్లు తెరిపించాయి. అతడిలా ఆలోచించసాగాడు – ఆంగ్లేయులకు మద్దతు ఇవ్వడం వల్ల ప్రయోజనం ఏముంది? వాళ్లు ఇవాళ ఉంటారు. రేపు పోతారు. ఇక్కడి ప్రజలు ఎల్లపుడూ ఇక్కడే ఉంటారు. ఇబ్బంది వచ్చినపుడు పనికి వస్తూ ఉంటారు.

సూరజ్ పాల్‌లో వచ్చిన మార్పును శ్రీరామ్ ఎలా గ్రహించారో చెప్పలేము. ఉండడానికి ఏర్పాటు చేయమని ఆయన అతడిని అడిగారు. ఏర్పాటు జరిగింది. సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక పక్కా గృహంలో శ్రీరామ్ నివాసానికి ఏర్పాటు జరిగింది.

### సైనిక్ పత్రిక గోడ సంచిక

దొనోరియాను, స్వరాజ్య ఉద్యమంలో పాల్గొంటూన్న ఆయన సహచరులను శ్రీరామ్ అక్కడికి పిలిచారు. కార్యాలయం వద్ద పోలీసు గస్తీ ఉండడం వల్ల "సైనిక్" పత్రిక ప్రచురణ సాధ్యం కాదు. కనుక, ఈ కార్యకర్తలంతా పోస్టరు కాగితాల మీద కలాలతో వ్రాయడం ప్రారంభించారు. మొదటి ప్రతిని శ్రీరామ్ తయారుచేశారు. దాని నకళ్లు తయారైనాయి. 20–25 ప్రతులు తయారుకాగానే, వాటిని ఆగ్రాలోని వివిధ పేటలలో గోడలకు అంటించేందుకు పథకం వేశారు. ఇదంతా ఎంతో శ్రమతో కూడుకున్నది, ఎంతో చాకచక్యంతో కూడుకున్నది. ప్రతిరోజూ తాజా సంచికను వెలువరించాలని వారు ఆశించలేదు. "సైనిక్" పత్రిక మనుగడ నిలిచి ఉన్నదని తెలపడం ఈ కృషి వెనుక గల ఉద్దేశ్యం. శ్రీరామ్ తన సహచరులతో ఆగ్రా చేరారు. అక్కడ ప్రధాన స్థలాలలో "సైనిక్" పత్రిక గోడ సంచికను అంటించారు. ఆ తర్వాత సూరజ్ పాల్ ఏర్పాటు చేసిన గృహంలో కన్న ఆగ్రాలో ఉండడమే మరింత ప్రయోజనకరమని శ్రీరామ్ భావించారు. జరగవలసిన పని దాగికొనడం. అందుకోసం మైళ్ల దూరం పారిపోవడం కన్న

**అసూయను వెన్నంటిఉంటుంది దుఃఖం.**

కొంచం జాగరూకత వహించడం మంచిదని ఆయన భావించారు.

ప్రభుత్వం ఈసారి నిర్దాక్షిణ్యంగా దమనకాండ జరుపుతోంది. సామాజిక కార్యాలలో పనిచేసే ఉద్యమకారులను మొదటి విడతలోనే పట్టుకున్నారు. అజ్ఞాతంగా పని చేస్తున్నవారిని కూడ డేగకళ్లతో వెదకుతున్నారు.

"సైనిక్" గోడ సంచిక తొలి ప్రతిలోనే బ్రిటిషు ప్రభుత్వం దగాకోరు అనీ, దయా దాక్షిణ్యాలు లేనిదనీ నిశితంగా విమర్శించింది. దాన్ని నిర్మూలించి పారవేయాలని పిలుపు ఇచ్చింది.

సమాచార సేకరణ వ్యవస్థ ఆనాడు వికాసం పొందలేదు. స్థానిక వార్తల కోసం విలేఖరులు ఉరుకులూ పరుగులూ పెడుతూ ఉండేవారు. నగరం వెలుపలి వార్తల కోసం రేడియో, టెలిగ్రామ్‌లు, టెలిఫోన్‌లపై ఆధారపడవలసివచ్చేది. ఈ సాధనాలు ప్రభుత్వం చేతుల్లో ఉన్నాయి. వీటి ద్వారా నిజమైన వార్తలు అందే ప్రశ్నే లేదు. అంతటా ప్రశాంతంగా ఉన్నదని రేడియో, ప్రభుత్వానికి వంతపాడే పత్రికలు వార్తలు ప్రసారం చేస్తున్నాయి.

ఈ పరిస్థితిలో - ఉద్యమం వార్తలనూ, సూచనలనూ, హృదయాన్ని కదిలించే పిలుపులనూ ఇచ్చేవారు ఆ గోడ పత్రికలో. దానిలో విశ్లేషణలు ఉండేవి కావు.

## మహారాణి బొమ్మ దగ్ధం

జనవరి 10న బ్రిటిషు మహారాణి బొమ్మ దగ్ధం చేయబడుతుందని గోడ పత్రిక రెండవ సంచికలో వార్తను ప్రచురించారు. స్థలం యమునా తీరమనీ, సమయం ఉదయం పది గంటలనీ ప్రకటించారు. ఈ పత్రికను జిల్లా అధికారి బంగళా ఎదుట కూడా అంటించారు. ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగింది. బొమ్మ దగ్ధం కాకుండా చూడడానికీ, దగ్ధం చేయడానికి ప్రయత్నించేవారిని పట్టుకోవడానికీ పథకం తయారయింది. యమునా తీరం చాలా విస్తృతం అయినది. ఆగ్రా పట్టణాన్ని సుమారు పది కిలోమీటర్ల వరకు చుట్టి ఉంటుంది. ఆ తీరంలోని ఏ స్థలంలో అది జరుగుతుందో తెలియదు. అంగుళం అంగుళంపైనా నిఘా ఉంచే విధానాన్ని పోలీసు శాఖ అవలంబించింది.

'సైనిక్' గోడ పత్రిక 15-20 స్థలాలలో అంటించబడింది. అయితే, ఆ వార్తను అనేక మంది చదివారు. అది ఆనోటా ఆనోటా వేలాదిమందికి అంది ఉంటుంది. యమునా తీరంలోని ఏ స్థలంలో బొమ్మను దగ్ధం చేస్తారో అని అందరూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

జనవరి పది రానే వచ్చింది. ఆ రోజున పోలీసుల హడావుడి ఇంతా అంతా కాదు. యమునా తీరంలో పహారా ఇస్తున్న పోలీసులను 'సైనిక్' కార్యకర్తలు ఏమార్చారు. తాజ్‌మహల్ ముఖ్య ద్వారం వద్ద జనం గుమిగూడారనీ, బొమ్మను తగులబెట్టటానికే కావచ్చనీ ఒక యువకుడు తాజ్‌మహల్ వద్ద పహారా ఇస్తూన్న పోలీసు దళానికి తెలిపాడు.

ఆ వార్త అందగానే పోలీసులు అక్కడికి పరిగెత్తారు. కొందరు యువకులు వలయాకారంలో నిలబడినట్లు వారు దూరం నుండి చూచారు. అక్కడ ఏదో మండుతోంది. మంటలు పైకి లేస్తున్నాయి. ''రాణి పోయింది, ఆమె రాజ్యం పోయింది"-అంటూ యువకులు విలపిస్తున్నారు. ఆ తర్వాత భారత్‌మాతాకీ జయ్", మహాత్మా గాంధీకీ జయ్" - అంటూ నినాదాలు చేశారు. పోలీసులు యువకులను హెచ్చరించకుండా మౌనంగా అక్కడికి పరుగులు తీస్తున్నారు. ఆ యువకులు అజాగ్రత్తగా లేరు. వారిలో ఒకరికి పోలీసులు కనబడ్డారు. పోలీసులు - అంటూ అతడు కేక వేశాడు. అక్కడ బొమ్మను తగులబెడుతున్న యువకులు మరుక్షణంలో మాయమైనారు. వారు ఎంత వేగంగా పారిపోయారంటే-వారిని వెంట తరిమి ప్రయోజనం లేదని పోలీసులు గుర్తించారు. వారా మంటను ఆర్పడానికి ప్రయత్నించారు. ప్రయోజనం లేకపోయింది. ఆ బొమ్మ మండి బూడిద అయిపోయింది. ప్రక్కనే "భారత్ మాతాకీ జయ్", "బ్రిటిష్ రాజ్ ముర్దాబాద్" నినాదాలు వ్రాసి ఉన్న అట్టలు పడి ఉన్నాయి.

★★★

**పశువుల కాపరి వాటికి యజమాని కాదు. ఆచరణలేని ఉపదేశం వ్యర్థం.**

వార్తలు

# యువతరానికి అందాలి దేవసంస్కృతి సౌరభం

## భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష బహుమతి ప్రదానోత్సవంలో పిలుపు

దేవ సంస్కృతిలోని అమూల్య వారసత్వాన్ని నేటి యువతరానికి అందించవలసిన అవసరం ఎంతయినా ఉన్నదని జూలై 9న హైదరాబాదులోని గాయత్రీ చేతనా కేంద్రంలో జరిగిన భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష రాష్ట్రస్థాయి బహుమతి ప్రదానోత్సవంలో పలువురు ప్రముఖులు పిలుపు ఇచ్చారు.

రాష్ట్ర మాజీ పోలీస్ డైరక్టర్ జనరల్ శ్రీ టి.ఎస్.రావు ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ, హిందూ సమాజానికి గాయత్రీ పరివార్ మహోన్నతమైన సేవ చేస్తూన్నదని పేర్కొన్నారు. వారింకా ఇలా అన్నారు –

పండిత శ్రీరామశర్మ ఆచార్య గారు హిమాలయాలలో తపస్సు చేసి, ఋషుల ఆశీస్సులు పొంది, వందలాదిగా గ్రంథాలు రచించారు. వారు స్థాపించిన గాయత్రీ పరివార్ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ఆధ్వర్యంలో మరింతగా విస్తరిస్తోంది. సనాతన ధర్మానికి ఆధారం వేదం. సత్సంగత్వంవల్ల నిస్సంగత్వం, తద్వారా నిశ్చలతత్త్వం, తద్వారా జీవన్ముక్తి లభిస్తుంది. ఆనాటి గురుకుల విధానంలో ఈ ఉత్తమ సంస్కారాలు అందేవి. నేటి విద్యా విధానంలో ఆ విలువలు లేవు. గాయత్రీ మంత్రం ధీశక్తిని పెంచే మహాశక్తి.

డాక్టర్ తుమ్మూరి ప్రసంగిస్తూ, నీతినీ నిష్ఠనూ నిలిపేదే నిజమైన విద్య అన్నారు. గీత, గాయత్రి, గంగ, గోవు, గురువు మనకు ఆరాధనీయాలని తెలిపారు.

శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ ఉమేశ్ శర్మ ప్రసంగిస్తూ, మన సంస్కృతికి మూలాధారాలయిన గాయత్రీ మంత్రం, యజ్ఞములను గాయత్రీ పరివార్ ప్రసారం చేస్తూన్నదని తెలిపారు.

శ్రీ అశ్విని సుబ్బారావు తమ ప్రసంగంలో గురుదేవుల తపశ్శక్తిని వర్ణించారు. ఈ సంవత్సరం యాభైవేలమంది చేత జ్ఞానపరీక్ష వ్రాయించాలనే సంకల్పం జరిగిందని తెలిపారు.

వాసవి ప్రోసాఫ్ట్ ట్రాన్ స్క్రిప్షన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీపైడా వెంకటేశ్వర రావు ప్రసంగిస్తూ, నేడు మన దేశంపై సాంస్కృతిక దండయాత్ర జరుగుతున్నదనీ, ఈ స్థితిలో మన ఆధ్యాత్మిక, నైతిక విలువలను ప్రసారం చేయడం మరింతగా అవసరం అవుతూన్నదనీ తెలిపారు.

వాసవి ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసరు శ్రీ కె.ఎస్.ఆర్.ఆంజనేయ మూర్తి ప్రసంగిస్తూ, ఋషి పరంపర, గురు పరంపర మన సంస్కృతిని నిలిపిఉంచా యన్నారు. వ్యాస పూర్ణిమను జాతీయ సమైక్యతా దినోత్సవంగా జరపాలని ఆయన సూచించారు.

తొలుత జ్ఞానపరీక్ష రాష్ట్ర సంయోజకులు శ్రీ బి.హనుమంత రెడ్డి స్వాగతం పలికారు. శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్ వందన సమర్పణ చేశారు.

నాటి ఉదయం, మధ్యాహ్నం భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష కార్యకర్తల సమావేశం జరిగింది.

### బహుమతి గృహీతలు

**రాష్ట్ర స్థాయి :**

తెలుగు మీడియం జూనియర్ – కుమారి కె.బి.నందిని, కుమారి ఎమ్. మంజుల, శ్రీ కె.ప్రవీణ్ కుమార్.

తెలుగు మీడియం సీనియర్ – కుమారి ఆర్.స్రవంతి, శ్రీ బి.కాశిరెడ్డి, శ్రీ టి.బి.కె.మనోజ్ కుమార్.

ఇంగ్లీషు మీడియం జూనియర్ – శ్రీ కె.చైతన్య, శ్రీ శివకుమార్, కుమారి ఎస్.దివ్యరాణి.

ఇంగ్లీషు మీడియం సీనియర్ – శ్రీయుతులు కె.గోకుల్, ఎమ్.నీహార్, ఎమ్.నిరంజన్.

**హైదరాబాదు జిల్లా :**

ఇంగ్లీషు మీడియం జూనియర్ – కుమారి కె.మధుర, శ్రీ కె.వి.సాయికృష్ణ, కుమారి ఎమ్.సుప్రియ.

ఇంగ్లీషు మీడియం సీనియర్ – ఎమ్.అచ్యుత, పి.నాగలోకేశ్, కె.స్వాతి.

తెలుగు మీడియం సీనియర్ – శ్రీ సిహెచ్.శివకుమార్, కుమారి డి.రాధిక.

ఇంగ్లీషు మీడియం సీనియర్ – శ్రీయుతులు కె.గోకుల్, ఎమ్.నీహార్, ఎమ్.నిరంజన్.

**రంగారెడ్డి జిల్లా :**

ఇంగ్లీషు మీడియం జూనియర్ – శ్రీ ఎస్.శ్రీనివాస్, శ్రీ టి.ఆకాశ్ సింగ్, కుమారి జి.మోనిక.

**మన ప్రసన్నతను ఇతరుల ప్రసన్నతలో లీనం చేయడమే ప్రేమ.**

ఇంగ్లీషు మీడియం సీనియర్ – కుమారి ఆర్.విజయ, శ్రీ అభిజీత్ కె.షా, శ్రీ ఏ.భార్గవ్.
తెలుగు మీడియం సీనియర్ – శ్రీ ఏ.శ్రీకాంత్.
హిందీ మీడియం జూనియర్ – కుమారి అర్చనా సింగ్.

## కరీంనగర్ జిల్లాలో జ్ఞానపరీక్ష బహుమతి ప్రదానం

కరీంనగర్ జిల్లా సిరిసిల్ల మండలం సేవ్స్ జూనియర్ కళాశాలలో భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష సీనియర్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని ప్రిన్సిపాల్, తెలుగు లెక్చరర్ శ్యామల ప్రదానం చేశారు. డా॥పి.సత్యనారాయణ కార్యక్రమానికి ఆధ్వర్యం వహించారు. ద్వితీయ, తృతీయ బహుమతుల ప్రదానం జగిత్యాలలో జరిగింది. వేములవాడ, సిరిసిల్ల, ఎలిగేడులలో మండల స్థాయి బహుమతుల ప్రదానం జరిగింది.

## మహబూబ్‌నగర్ జిల్లాలో 24 కుండముల గాయత్రీ యజ్ఞాలు

మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం తిరుమలాయపల్లెలో మార్చినెలలో 24 కుండముల గాయత్రీ యజ్ఞం అత్యంత వైభవంగా జరిగింది. యజ్ఞంలో 500 మంది పాల్గొన్నారు. డాక్టర్ తుమ్మూరి యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీమతి అనసూయమ్మ, శ్రీయుతులు హనుమంతరెడ్డి, ఫూల్‌సింగ్, లక్ష్మణరావు సహకరించారు. కార్యక్రమానికి శ్రీ నరసింహ యాదవ్ ఆధ్వర్యం వహించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తకోటలోని శ్రీ రాజవర్ధన రెడ్డి అధ్వర్యంలో నడుస్తూన్న ప్యూపిల్ పాఠశాల, కళాశాలల ఆవరణలో జూన్ 11 ఉదయం 24 కుండముల గాయత్రీ యజ్ఞం, సాయంత్రం 24వేల దీపాలతో దీపయజ్ఞం వైభవోపేతంగా జరిగాయి. వేయిమంది పాల్గొన్నారు. డాక్టర్ తుమ్మూరి యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీమతి అనసూయమ్మ, శ్రీయుతులు హనుమంతరెడ్డి, ఫూల్‌సింగ్, జగన్నాథం, పామాపురం నుండి వచ్చిన శ్రీయుతులు నరసింహ యాదవ్, బి.వి.సుదర్శన్ రెడ్డి సహకరించారు. రాజవర్ధన రెడ్డి దంపతులు యజ్ఞంకోసం చక్కని ఏర్పాట్లు చేశారు.

## హైదరాబాదు ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం

హైదరాబాదు సమీపంలోని ఎయిర్ ఫోర్స్ అకాడమీ దుండిగల్ విష్ణుమందిరంలో జూలై 23 ఉదయం పంచకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. ఆ సందర్భంగా శ్రీ అశ్విని సుబ్బారావు గాయత్రీ మంత్రాన్ని గురించి, యజ్ఞాన్ని గురించీ వివరించారు. శ్రీయుతులు హీర్‌సింగ్ రాజపురోహిత్, ఫూల్‌సింగ్ మర్కామ్, రాజూ ఆరశే, ప్యారేలాల్, అప్పారావు, జగన్నాథం, శ్రీమతి హైమవతి యజ్ఞాన్ని నిర్వహించారు. మేజర్ మహేశ్ నారాయణ్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు యజ్ఞంలో పాల్గొన్నారు.

## గురుపూజ మహోత్సవాలు

### తాళ్లదుమ్మ

తాళ్ళదుమ్మలో గురు పూర్ణిమ సందర్భంగా జరిగిన గాయత్రీ యజ్ఞంలో వందమంది పాల్గొన్నారు. శ్రీయుతులు డి.చిన్నం నాయుడు, పి.లక్ష్మణ రావు, ఈ.హరినారాయణ, సిహెచ్.ఆదినారాయణ యజ్ఞాన్ని నిర్వహించారు.

### కొండగట్టు

గురుపూర్ణిమ సందర్భంగా జగిత్యాల సమీపంలోని కొండగట్టు శ్రీ అభయాంజనేయస్వామివారి విగ్రహం వద్ద శ్రీ సామ శ్రీనాథ్ దంపతులు గాయత్రీ యజ్ఞం, వ్యాస పూజ జరిపారు. శ్రీ మంథని సత్యనారాయణ దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీయుతులు ఆదెపు గంగారాం, డి.ఎల్.ఎన్.చారి, గడ్డం బుచ్చిరెడ్డి, పడకంటి లక్ష్మీనారాయణ, గట్ల లక్ష్మణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 మంది పాల్గొన్నారు.

### పార్వతీపురం

పార్వతీపురంలో గురుపూర్ణిమ సందర్భంగా దీపయజ్ఞం జరిగింది.

★★★

## సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో పర్వదినాలు

**సెప్టెంబర్ :**

4. వామన జయంతి
11. మాతాజీ జయంతి
17. విశ్వకర్మ జయంతి
20. గురుదేవుల జయంతి
23. శరన్నవరాత్రులు ఆరంభం
30. దుర్గాష్టమి

**అక్టోబరు :**

2. గాంధీ జయంతి
   విజయదశమి
   మధ్వాచార్య జయంతి
21. దీపావళి
   స్వామి రామతీర్థ జయంతి
28. సోదరి నివేదిత జయంతి


**మనిషిగా జీవించే విద్యను సైన్సుకాక మతం నేర్పుతుంది.**

# సద్గురు లీలామృతం

## 9 రోజుల్లో క్రొత్త భాషపై పట్టు

గురుదేవులు ఓడలో తూర్పు ఆఫ్రికాకు వెళుతున్నారు. జాత్యహంకారంతో విర్రవీగుతూన్నవారి తిరస్కారాలకూ, అవమానాలకూ గురి అవుతూన్న భారతీయ బంధువులను అక్కున చేర్చుకోవడం; భారతీయ సంస్కృతీ సభ్యతల బీజాలను అక్కడ నాటడం–ఇదే ఆ పర్యటనలోని ఉద్దేశ్యం.

అనుభవం లేనివారికి సముద్రయానం ఇబ్బందికరంగా ఉంటుంది. అయినా – గురుదేవుల లేఖనం, చింతన, ఇతర దైనందిన కార్యక్రమాలు యథాప్రకారం సాగాయి. తాము వెళ్లవలసిన స్థలానికి చెందిన వ్యక్తులు కొందరు తమతో పాటు ప్రయాణం చేస్తున్నారని వారికి తెలిసింది. అంతే. మనస్సులోని నేర్చుకోవాలనే ప్రవృత్తి వారిని ప్రోత్సహించింది – అక్కడికి చేరడానికి ముందు అక్కడి భాష ఎందుకు నేర్చుకోకూడదని.



ఆలోచన ఉత్సాహంగా మారింది. ఉత్సాహం కార్యరూపం ధరించింది. భాష నేర్చుకోవడం ప్రారంభమయింది. సరిగా 9 రోజులలో ఆ దేశపు స్వాహిలీ భాషమీద వారు అధికారం సంపాదించారు. నేర్పిన వ్యక్తులు ఆశ్చర్యచకితులు అయినారు. గతంలో సుప్రసిద్ధ ప్రాచ్యవేత్త సర్ విలియమ్ జోన్స్ కూడా కలకత్తా పండితుల వద్ద సంస్కృతం నేర్చుకున్నారు. అయినా – గురుదేవుల అధ్యయన వేగం మరింత అద్భుతమైనది. వారు ఆ దేశం చేరి, అక్కడివారితో వారి భాషలోనే సంభాషణ సాగించారు – ధారాళంగా, నిర్దుష్టంగా. అక్కడి ప్రజలు విస్తుపోయారు.

## భావ సంవేదనల జలపాతం

'కిస్మత్' పత్రిక సంపాదకుని నుండి 15-16 సంవత్సరాల శ్రీరామ్‌కు ఉత్తరం వచ్చింది. అంత చిన్న పిల్లవాడికి సంపాదకుని నుండి ఉత్తరం రావడం చూచి గ్రామంలోని ఒక యువకుడు కుతూహలంగా అతని దగ్గరకు వచ్చాడు. ఇటీవల ప్రచురితమైన ఒక కవిత ప్రస్తావన ఆ ఉత్తరంలో ఉన్నదని తెలిసింది. సంపాదకుడు తీవ్రంగా స్పందించి ఇలా వ్రాశాడు.

'నీ కవిత పిల్లవాడు వ్రాసిన కవితలా లేదు; నీలో సంవేదనల, భావస్పందనల శ్రోతస్సు (పుట్టిన స్థలం) ఉంది; అది ముందు ముందు జలజల పారే జలపాతంగా మారకుండా ఉండదు.'

గ్రామంలోని ఆ యువకుడు ఆ ఉత్తరం చదివి దిగ్భ్రమ చెందాడు.

గతంలో బాల వివేకానందుని వ్యాసం చూచి, హెర్బర్ట్ స్పెన్సర్ ఇలా వ్యాఖ్యానించాడు – "త్వరలోనే ప్రపంచం నిన్ను ఒక మనీషిగా గుర్తిస్తుంది."

కాలక్రమంలో ఆ సంపాదకుని మాట అక్షరాలా సార్థకం అయింది. భావ సంవేదనలతో కూడిన ఆ జలపాతం ఎండిమోడయిన ఎందరెందరి జీవితాలనో సస్యశ్యామలం చేసింది. ఆ జీవితాలను లెక్కకట్టడం గణిత శాస్త్రానికి మించిన పని.

★★★

## లూధియానాలో అశ్వమేధ యజ్ఞం

పంజాబులోని లూధియానాలో అక్టోబరు 5,6,7,8 తేదీలలో అశ్వమేధ యజ్ఞం జరుగుతుంది. 1008 కుండముల మహాయజ్ఞం జరుగుతుంది. వివరాలకు – గాయత్రీ జ్ఞాన మందిర్ హైవ్వోవల్ కలా, లూధియానా (పంజాబు). ఫోన్లు: 0161 – 5044866, 2307866, 3209614

**ఉన్నదే జ్ఞానం. అజ్ఞానం ఇది అని చూపేందుకు గురువు అవసరం.**

# తిరుమలాయపల్లెలో 24 కుండముల గాయత్రీ యజ్ఞం



యజ్ఞ దృశ్యం

# హైదరాబాదు ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న మేజర్ మహేశ్ నారాయణ్ దంపతులు.




నెమిలిగుంటపల్లెలో గాయత్రీ యజ్ఞం నిర్వహిస్తున్న డా॥ పులి సత్యనారాయణ.

# విజయవాడలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం



యజ్ఞ దృశ్యం.



విజయవాడ కార్యాలయంలో షష్టిపూర్తి జరుపుకుంటూన్న శ్రీ సోమిశెట్టి సాంబశివరావు, శ్రీమతి లక్ష్మీదేవి దంపతులు. చిత్రంలో శ్రీయుతులు డి.వి.ఆర్.మూర్తి, కృష్ణ మూర్తి.

YUGASHAKTI GAYATRI (Telugu Monthly), September - 2006
RNI No. APTEL / 2000/1656. Postal Reg. No. L-II/RNP/H-HD-953/2006-08

## కొండగట్టువద్ద గాయత్రీ యజ్ఞం, వ్యాసపూజ




జగిత్యాల సమీపంలోని కొండగట్టు శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహంవద్ద గాయత్రీ యజ్ఞం, వ్యాసపూజ జరుపుతూన్న సామ శ్రీనాథ్ దంపతులు, మంథని సత్యనారాయణ దంపతులు.

## బీర్‌పూర్‌లో నవకుండీయ గాయత్రీ యజ్ఞం




సారంగపూర్ మండలం బీర్‌పూర్‌లో నవకుండీయ గాయత్రీ యజ్ఞం నిర్వహిస్తూన్న శ్రీ ఆదెపు గంగారాం; ప్రక్కన శ్రీయుతులు వేముల రాంరెడ్డి, గడ్డం బుచ్చిరెడ్డి.

Global Head Quarters :
**GAYATRI TEERTH, SHANTIKUNJ,**
Haridwar - 249411 Ph: (01334) 260602, 261955, 260309
Fax : (01334) 260866, E-mail : shantikunj@awgp.org,
southindiazone@awgp.org, website : www.awgp.org

Chief Editor : **Dr. PRANAV PANDYA**
Printed & Published By Sri B.CH.V.SUBBA RAO (Aswini)
(For SRI VEDAMATHA GAYATRI TRUST)
5-283, H.P.Road, Moosapet, Hyderabad-500 018.
Printeda at Bharathi Art Printers, Chikkadapally, Hyderabad - 20

If Undelivered please return to: **GAYATRI CHETANA KENDRA & MEDITATION CENTER,**
Near Aswini House, H.P.Road, Moosapet, Hyderabad - 500 018, Ph : 040 - 23700722, 32986922, 09392506888. E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com

SUNDAR GRAPHICS : 9391030025